ప్రజాజ్యోతి

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | బుధవారం 18 నవంబర్ 2026 | సంపుటి: 19 | సంచిక: 251 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , కార్తీక మాసము , తిథి: నవమి - నిండా రాత్రి వరకు నక్షత్రంశతభిష - 30:10:48 వరకు కరణంబాలవ - 18:43:14 వరకు వక్షంశుక్ల యోగంధ్రువ - 08:05:01 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL | http://www.prajajyothinews.com | Mail: prajajyothidaily@gmail.com

విదేశీ విద్యార్థులకు భారీ ఊరట

వీసా ఆంక్షలను కొట్టివేసిన యూఎస్ కోర్టు
అధికార దుర్వినియోగమేనని జడ్జి ఆగ్రహం

న్యూఢిల్లీ, నవంబర్ 17(ప్రజాజ్యోతి):
అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు మరో షాక్ తగిలింది. విదేశీ విద్యార్థులు, పరిశోధకులు, అంతర్జాతీయ జర్నలిస్టులకు ఫెడరల్ కోర్టు భారీ ఊరటనిచ్చింది. విదేశీ విద్యార్థులు, జర్నలిస్టుల వీసా గడువును కుదిస్తూ ట్రంప్ తీసుకొచ్చిన వివాదాస్పద నిబంధనను

మిగతా 2లో..

అమెరికాలో భారీ విధ్వంసానికి కుట్ర?

నిఘా వర్గాల హెచ్చరికతో హై అలర్ట్..!

న్యూఢిల్లీ, నవంబర్ 17(ప్రజాజ్యోతి):
అమెరికా– ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇప్పటికే ఇరు దేశాల మధ్య మాటల యుద్ధం, సైనికపరమైన హెచ్చరికలు కొనసాగుతుండగా, ఇప్పుడు మరో సంచలన విషయం తెరపైకి వచ్చింది. అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీని లక్ష్యంగా చేసుకుని ఇరాన్ డర్టీ బాంబు దాడులకు కుట్ర పన్నుతున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయని

మిగతా 2లో..



క్వాడ్ ఒక నమ్మకమైన, నిర్మాణాత్మక
భాగస్వామ్యం..

మనీలా నగరంతో క్వాడ్‌కు ప్రత్యేక అనుబంధం
క్వాడ్‌తో ఇండో-పసిఫిక్‌కు పూర్తి భరోసా ఉంది
భారత్, ఆసియాన్ దేశాలు కలిసి పనిచేయాలి
మనకు కావాల్సింది పోటీ కాదు.. సహకారం
మనీలా శిఖరాగ్ర సదస్సులో మోదీ వ్యాఖ్యలు
ఫిలిప్పీన్స్‌లో ప్రధాని మోదీ ప్రత్యేక పర్యటన..
వందేళ్ల నాటి చరిత్రాత్మక గురుద్వార్‌లో పూజలు!





న్యూఢిల్లీ, నవంబర్ 17(ప్రజాజ్యోతి):
ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో జరిగిన ఆసియాన్ సదస్సు సందర్భంగా నిర్వహించిన 'క్వాడ్' దేశాధినేతల శిఖరాగ్ర సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ప్రసంగం చేశారు. భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా దేశాలతో కూడిన క్వాడ్ కూటమి ఒక నిర్మాణాత్మక, విశ్వసనీయ భాగస్వామ్యమని ఆయన కొనియాడారు. మంగళవారం జరిగిన ఈ సమావేశంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్, జపాన్ ప్రధాని సనాయే తకైచీలతో కలిసి మోదీ పాల్గొన్నారు. సముద్ర భద్రత, నమ్మకమైన సరఫరా గొలుసులు, కొత్త సాంకేతికతలు, విపత్తు నిర్వహణ రంగాల్లో క్వాడ్ ఎన్నో విశ్వసనీయ పరిష్కారాలను అందిస్తోందని ప్రధాని వివరించారు. రెండేళ్ల విరామం తర్వాత జరిగిన ఈ సదస్సు తదుపరి దశ సహకారానికి స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 2024 సెప్టెంబర్‌లో అమెరికాలోని డెలావేర్ తర్వాత క్వాడ్ నేతలు కలుసుకోవడం ఇదే తొలిసారి. క్వాడ్ కూటమి ప్రస్థానంలో మనీలా నగరానికి ప్రత్యేక స్థానం ఉందని ప్రధాని మోదీ గుర్తుచేశారు. 2007లో నాలుగు దేశాల అధికారులు తొలిసారిగా ఇక్కడే

మిగతా 2లో..

మోదీ గట్టి మనిషి..

- చాలా టఫ్.. కానీ గొప్ప నాయకుడు
- ప్రపంచవ్యాప్తంగా ఎంతో గౌరవం
- ప్రధాని మోదీపై ట్రంప్ ప్రశంసలు
- మనీలాలో క్వాడ్ దేశాల సమావేశం
- క్వాడ్ భేటీకి హాజరైన ట్రంప్, మోదీ
- సముద్ర భద్రతపై కీలక చర్చలు
- 4 కీలక అంశాలపై ఏకాభిప్రాయం!

న్యూఢిల్లీ, నవంబర్ 17(ప్రజాజ్యోతి):
ప్రధాని నరేంద్ర మోదీ ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో అడుగుపెట్టారు. ఆసియాన్–భారత్, తూర్పు ఆసియా శిఖరాగ్ర సమావేశాల్లో పాల్గొనేందుకు సోమవారం ఆయన అక్కడికి చేరుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా మంగళవారం జరగనున్న క్వాడ్ దేశాల అధినేతల సమావేశంపై ప్రపంచ దేశాల దృష్టి

మిగతా 2లో..

సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు
లైన్ క్లియర్..!?

తెలంగాణలో నీటి అవసరాలు పెరిగే అవకాశం
బ్యారేజీలో నీటిని నిల్వకు అనుమతి ఇవ్వాలి
మిగిలిన పలు అనుమతులకూ సహకరించాలి
11,408 ఎకరాల భూమి ముంపునకు గురౌతాయి
ముంపు ప్రాంతాన్ని తగ్గించేందుకు పలుమార్పులు
బ్యారేజీకి ఎన్వోసీ ఇవ్వాలని కోరిన రేవంత్‌రెడ్డి
సానుకూలంగా స్పందించిన ఛత్తీస్‌గఢ్ సీఎం
ప్రక్రియను త్వరగా పూర్తి చేసేందుకు హామీ
ఛత్తీస్‌గఢ్ సీఎంతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

గోదావరి నదిపై నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడానికి తెలంగాణ ప్రభుత్వం పొరుగు రాష్ట్రంతో చర్చలను ముమ్మరం చేసింది. సీఎం రేవంత్ రెడ్డి ఛత్తీస్‌గఢ్ సీఎంతో సమావేశమై కీలక విజ్ఞప్తి చేశారు. సమ్మక్క సాగర్ బ్యారేజీ నిర్మాణానికి ఎన్ఓసీ జారీ చేయాలని కోరారు. సరిహద్దు అవతలి వైపు ఏర్పడే జలప్రభావంపై సాంకేతిక నివేదికను సమర్పించడంతో పాటు.. నష్టపరిహారం భరించే బాధ్యతను కూడా తెలంగాణ అంగీకరించింది. సీఎం రేవంత్ ప్రతిపాదనలకు ఛత్తీస్‌గఢ్ సీఎం హామీ ఇచ్చారు. తాజా భరోసా నేపథ్యంలో పెండింగ్ ప్రక్రియ కొలిక్కి వస్తుందా, సాగునీటి అవసరాలకు ఈ నిర్మాణం ఎప్పటి నుంచి తోడ్పడుతుందా అన్నది ఆసక్తికరంగా మారింది.



హైదరాబాద్, నవంబర్ 17(ప్రజాజ్యోతి):
సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు అనుమతుల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాల వేగం పెంచింది. రెండు రోజుల క్రితం ప్రధాని నరేంద్ర మోదీతోనూ చర్చించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇవాళ దిల్లీ నుంచి నేరుగా రాయ్‌పూర్ వెళ్లి ఛత్తీస్‌గడ్ సీఎం విష్ణుదేవ్‌సాయితో భేటీ అయ్యారు. సమ్మక్క సాగర్ బ్యారేజీ నిర్మాణానికి నిరభ్యంతర పత్రం ఇవ్వాలని ఛత్తీస్‌గడ్ సీఎంను రేవంత్ రెడ్డి కోరారు. ఎల్‌నినో పరిస్థితుల వల్ల తెలంగాణలో నీటి అవసరాలు పెరిగే అవకాశం ఉందని సీఎం వివరించారు. సమ్మక్క సాగర్ బ్యారేజీలో నీటిని నిల్వ చేసుకునేందుకు అనుమతి ఇవ్వడంతో పాటు ప్రాజెక్టుకు సంబంధించిన మిగిలిన అనుమతులకూ సహకరించాలని కోరారు. ప్రాజెక్టు అధ్యయనం కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కోరిన మేరకు రూ. 9.883 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్‌లోనే చెల్లించింది. ఐఐటీ ఖరగ్‌పూర్ తన నివేదికను ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి జూలై 30న సమర్పించింది. తుపాకులగూడెం వద్ద చేపట్టడం వల్ల ఛత్తీస్‌గఢ్‌లో సుమారు 33 ఎకరాలు ముంపునకు గురవుతాయని అధ్యయనంతో తేలింది. భారీ వరదల సమయంలో కూడా ప్రభావిత ప్రాంతం వంద ఎకరాలకు మించదని తెలిసిందే.ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద సమ్మక్క సాగర్ బ్యారేజీ నిర్మాణం

మిగతా 2లో..

రష్యాలో ఘోర ప్రమాదం..

కుప్పకూలిన సైనిక రవాణా విమానం..
ఘటనలో 17 మంది దుర్మరణం!

న్యూఢిల్లీ, నవంబర్ 17(ప్రజాజ్యోతి): దక్షిణ రష్యాలోని కెమెరోవోలో మంగళవారం ఘోర విమాన ప్రమాదం సంభవించింది. రష్యా సైన్యానికి చెందిన ఏఎన్-12 రవాణా విమానం యాగునోవో గ్రామం సమీపంలోని స్థానిక విమానాశ్రయానికి చేరువలో కుప్పకూలిపోయింది. ఈ దుర్ఘటనలో విమానంలో ప్రయాణిస్తున్న మొత్తం 17 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారని, ఎవరూ ప్రాణాలతో బయటపడలేదని రష్యన్ మీడియా

మిగతా 2లో..

పదోన్నతులకు మార్గం
సుగమం

త్వరలో పోలీస్ శాఖలో ప్రమోషన్లు
54 అదనపు ఎస్పీ పోస్టులు భర్తీ..!?
తొలి విడతలో భర్తీ చేసే అవకాశం
డీజీపీ సీవీ ఆనంద్ కీలక చర్యలు



హైదరాబాద్, నవంబర్ 17(ప్రజాజ్యోతి):
తెలంగాణ పోలీస్ శాఖలో చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల ప్రక్రియకు ఎట్టకేలకు మార్గం సుగమం అవుతోంది. సీనియారిటీ వివాదాలు, కోర్టు కేసుల కారణంగా నిలిచిపోయిన ప్రమోషన్ల సమస్యను పరిష్కరించేందుకు డీజీపీ సీవీ ఆనంద్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఇందులో భాగంగా 1991, 1995, 1996 బ్యాచ్‌లకు చెందిన ఎస్ఐలు, ప్రస్తుతం డీఎస్పీ హోదాలో పనిచేస్తున్న అధికారులతో డీజీపీ కార్యాలయంలో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీనియారిటీ సమస్యలు, పదోన్నతుల అర్హతలు, అందుబాటులో ఉన్న పోస్టుల భర్తీపై చర్చించారు. అధికారుల మధ్య ఏకాభిప్రాయం కుదరడంతో ప్రమోషన్ల ప్రక్రియ వేగవంతం కానున్నట్లు తెలుస్తోంది. పోలీస్ శాఖలో ప్రస్తుతం 54 అదనపు ఎస్పీ పోస్టులు అందుబాటులో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. దీంతో తొలి విడతలో ఈ పోస్టులను భర్తీ చేసేందుకు అవకాశం ఏర్పడింది. సీనియారిటీ, రోస్టర్ పాయింట్లు, అర్హతలు, నిబంధనల ఆధారంగా పదోన్నతుల

మిగతా 2లో..

సోనియా ఆత్మకథలో తెలంగాణ ఊసే లేదు..

ఆమె హృదయంలోనే తెలంగాణకు చోటులేదు
ప్రజల, కేసీఆర్ పోరాటం వల్లే రాష్ట్రం సిద్ధించింది
ఉద్యమ ఉద్ధృతికి భయపడే కాంగ్రెస్ దిగివచ్చింది
కరువుతో అల్లాడుతుంటే మూసీ సుందరీకరణా?
మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఫాలింగ్..
రైతుల్లో కాంగ్రెస్ పాలన భారీగా వ్యతిరేకత ఉంది
భారత్ సమ్మిట్‌కు కోట్లు ఖర్చు పెట్టి ప్రచారం
బాడీగార్డ్‌గా మారిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
వైఫల్యాన్ని కప్పి పుచ్చడానికి శతవిధాలా యత్నం
ఆత్మగౌరవానికై తిరగబడ్డ తెలంగాణ సమాజం
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు



హైదరాబాద్, నవంబర్ 17(ప్రజాజ్యోతి):
కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ ఇటీవల విడుదల చేసిన ఆత్మకథ 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకంలో తెలంగాణ అంశాన్ని విస్మరించడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సోనియా గాంధీ హృదయంలో, ఆత్మలో తెలంగాణకు చోటు లేనందునే ఆమె రాసుకున్న ఆత్మకథలోనూ తెలంగాణ ప్రస్తావన లేదని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ నాయకత్వం, ఇక్కడి ప్రజల పట్ల

మిగతా 12లో..



నగరంలో గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్

హైదరాబాద్‌కు మరో గ్లోబల్ కంపెనీ రాక
1,200 మందికి ఉద్యోగ అవకాశాలు!

హైదరాబాద్, నవంబర్ 17(ప్రజాజ్యోతి):
ప్రపంచ ఆర్థిక సేవల రంగంలో కీలకంగా ఉన్న ఎస్ఈఐ సంస్థ హైదరాబాద్‌లో తన గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ ను ప్రారంభించింది. ఈ కొత్త కేంద్రం ద్వారా నగరంలో తన కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు సంస్థ సిద్ధమైంది. ఈ సెంటర్‌లో ఒకేసారి 1,200 మంది పనిచేసే సదుపాయం ఉంది. ఇప్పటికే హైదరాబాద్‌లో 800 మంది ఉద్యోగులతో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఎస్ఈఐ.. రాబోయే రోజుల్లో తన టీమ్‌ను మరింత పెంచుకోనుంది. అమెరికాలోని పెన్సిల్వేనియా రాష్ట్రం ఓక్స్ కేంద్రంగా పనిచేస్తున్న ఎస్ఈఐ సంస్థకు ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉంది. ఫైనాన్షియల్ టెక్నాలజీ, ఆపరేషన్స్, అసెట్ మేనేజ్‌మెంట్ సేవలను అందిస్తోంది. నవంబర్ 17, 2026న హైదరాబాద్‌లో

మిగతా 12లో..

సంపాదకీయం

పసిడి నేలచూపు!?

బంగారం కొనాలనుకునే వారికి ఇంతకంటే మంచి శుభవార్త మరొకటి ఉండదు.. గత కొన్ని రోజులుగా పసిడి, వెండి ధరలు ఊహించని రీతిలో కుప్పకూలుతున్నాయి. సోమవారం మార్కెట్ తెరుచుకోగానే ఒక్కరోజే 10 గ్రాముల బంగారం ధర ఏకంగా రూ. 2,320 మేర తగ్గి షాకిచ్చింది. అసలు బంగారం ధర రూ.1 లక్ష మార్కుకు పడిపోనుందా? పసిడి ప్రియులకు, పెట్టుబడిదారులకు ఇది నిజంగా ఒక పెద్ద సువర్ణావకాశం. గత కొన్ని రోజులుగా బంగారం, వెండి ధరలు భారీగా పడిపోతున్నాయి. వారంలో మొదటి రోజైన సోమవారం నాడు మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ ఫ్యూచర్స్ మార్కెట్ తెరుచుకోగానే బంగారం, వెండి ధరలలో భారీ పతనం కనిపించింది. ఒక్కరోజే 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర ఏకంగా రూ. 2,320 మేర చౌకైంది. ఇదే సమయంలో కిలో వెండి ధర కూడా రూ. 6,000 తగ్గి కొనుగోలుదారులకు భారీ ఊరటనిచ్చింది.గత వారం చివరి రోజున డిసెంబర్ 4న గడువు ముగిసే 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1,36,705 వద్ద ముగిసింది. అయితే సోమవారం మార్కెట్ ప్రారంభం కాగానే బంగారం ధర రూ. 1,35,312కు పడిపోయింది. ఆ తర్వాత కూడా పతనం కొనసాగడంతో మధ్యాహ్నానికి రూ.1,34,385కు చేరుకుంది. అంటే ఒక్కరోజే రూ.2,320 మేర తగ్గింది. ఇక జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.1,77,590తో పోల్చి చూస్తే, ప్రస్తుతం 10 గ్రాముల బంగారం ఏకంగా రూ. 43,205 మేర తక్కువ ధరకు లభిస్తుండటం గమనార్హం.గతంలో మార్కెట్ నిపుణులు అంచనా వేసినట్లుగానే బంగారం ధర రూ. 1 లక్ష దిశగా పయనిస్తున్నట్లు కనిపిస్తోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో జనవరిలో నమోదైన రికార్డు గరిష్ఠ స్థాయి నుంచి పసిడి ధర ఇప్పటికే 30 శాతం పడిపోయింది. పెళ్లిళ్ల సీజన్‌కు ముందు ధరలు తగ్గుతుండటంతో కొనుగోలుదారుల్లో ఆసక్తి పెరుగుతోంది. యూఎస్ 10 సంవత్సరాల బాండ్ దిగుబడి పెరిగితే, స్వల్పకాలంలో అంతర్జాతీయ స్పాట్ బంగారం ధర ఔన్సుకు 4,025 -- 3,950 డాలర్లకు తగ్గే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. అదే జరిగితే భారత మార్కెట్‌లో 10 గ్రాముల బంగారం ధర రూ. 1 లక్ష నుంచి రూ. 1.25 లక్షల స్థాయికి దిగివచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి.బంగారం బాటలోనే వెండి ధరలు కూడా వేగంగా పడిపోతున్నాయి. సోమవారం వీజ్ఞ ఫ్యూచర్స్ మార్కెట్ తెరుచుకున్న వెంటనే, డిసెంబర్ 4న గడువు ముగిసే కిలో వెండి ధర రూ.6,000 తగ్గి రూ. 1.70 లక్షలకు పడిపోయింది. తన జీవితకాల గరిష్ఠ స్థాయి అయిన రూ.4,20,048తో పోల్చి చూస్తే, ఇప్పటివరకు కిలో వెండి ధర దాదాపు రూ. 2.50 లక్షల మేర తగ్గడం విశేషం. ఫ్యూచర్స్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టాలనుకునే వారికి ఇదే సరైన సమయమని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. కాగా మంగళవారం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై రూ.760 తగ్గి, రూ.1,36,040 పలుకుతోంది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై రూ.700 తగ్గి, రూ.1,24,700 పలుకుతోంది. వెండి ధర రూ.1,90,000 తో స్థిరంగా కొనసాగుతోంది. నవంబరు 17 మంగళవారం దేశంలోని వివిధ నగరాల్లో బంగారం, వెండి ధరలు పరిశీలిస్తే.. ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,36,200 వద్ద ట్రేడ్ అవుతోంది. 22 క్యారట్ల బంగారం ధర రూ.1,24,850 పలుకుతోంది. ముంబై, కోల్‌కతా, చెన్నైలో 24 క్యారెట్ల బంగారం రూ.1,36,040, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,24,700 పలుకుతోంది. తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలోనూ ఇవే ధరలు కొనసాగుతున్నాయి. కేజీ వెండి ధర రూ.1,90,000 గా కొనసాగుతోంది. ప్రస్తుతం పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నప్పటికీ.. మరోవైపు ముడి చమురు ధర ఎక్కువగా ఉన్నా పెట్టుబడిదారులు బంగారం వైపు వెళ్లడం లేదు. ఎందుకంటే ధరలు రోజు రోజుకు భారీగా పడిపోతున్నాయి. దీని వల్ల పెట్టుబడిదారులు కూడా ఆందోళనలో ఉన్నారు. గత రెండు రోజుల నుంచి బంగారం ధరలు భారీగా తగ్గుతూ వస్తున్నాయి. ఏది ఏమైనా మరింతగా దిగివచ్చి సామాన్యునికి అందుబాటులో ఉండేలా చూడాలని నిపుణులు కోరుకుంటున్నారు.

రష్యాలో ఘోర ప్రమాదం..

మొదటిపేజీ తరువాయి..

వెల్లడించింది. యాగునోవో సమీపంలో విమానం కూలిపోయిన విషయాన్ని కెమెరోవో గవర్నర్ ఇల్యా సెరెడ్యూక్ అధికారికంగా ధ్రువీకరించారు. అయితే ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. సాంకేతిక లోపమా లేక వాతావరణ ప్రతికూలతలా అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు ఇదే రోజు సెర్బియా ఉత్తర ప్రాంతంలోని స్టారా పజోవా పట్టణం వద్ద మిగ్-29 యుద్ధ విమానం కూలిపోవడంతో పైలట్ మృతి చెందినట్లు ఆ దేశ రక్షణ శాఖ ప్రకటించింది. రష్యా భూభాగంలోకి ఉక్రెయిన్ డ్రోన్లు, క్షిపణులతో తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్న తరుణంలో ఈ విమాన ప్రమాదం చోటుచేసుకోవడం గమనార్హం. గత 24 గంటల్లోనే రికార్డు స్థాయిలో 1,441 ఉక్రెయిన్ డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా సైన్యం ప్రకటించింది. 2022 ఫిబ్రవరిలో యుద్ధం మొదలైనప్పటి నుంచి ఒక్క రోజులో ఇంత భారీ సంఖ్యలో డ్రోన్లను అడ్డుకోవడం ఇదే తొలిసారి. ఎస్-300, ఎస్-400, ఎస్-500 వంటి అత్యాధునిక వైమానిక రక్షణ వ్యవస్థలు ఉన్నప్పటికీ, తక్కువ ఎత్తులో ఎగిరే ఉక్రెయిన్ డ్రోన్లను గుర్తించడం రష్యా రాడార్లకు సవాలుగా మారింది. చమురు శుద్ధి కర్మాగారాలు, క్రిమియాను కలిపే కెర్చ్ వంతెన వంటి కీలక ప్రాంతాలపై ఉక్రెయిన్ దాడులు పెంచగా, శీతాకాలం సమీపిస్తున్న వేళ ఉక్రెయిన్ విద్యుత్ కేంద్రాలపై రష్యా ప్రతీకార దాడులు తీవ్రతరం చేసింది.

పదోన్నతులకు మార్గం

సుగమం

మొదటిపేజీ తరువాయి..

జాబితాలను సిద్ధం చేయనున్నారు. ఇక రెండో విడతలో భాగంగా ప్యానెల్ ఇయర్ ముగిసే 2027 ఆగస్టు నాటికి మరో 34 అదనపు ఎస్పీ పోస్టులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ పోస్టులను కూడా అర్హులైన అధికారులతో భర్తీ చేసేందుకు అవసరమైన ప్రమోషన్ ప్యానెల్స్ సిద్ధం చేయనున్నారు. అదనపు ఎస్పీ పోస్టులతో పాటు మరో కీలక నిర్ణయం కూడా తీసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం అదనపు ఎస్పీ హోదాలో పనిచేస్తున్న 12 మంది అధికారులకు నాన్ క్యాడర్ ఎస్పీలుగా పదోన్నతులు కల్పించే అవకాశం ఉంది. దీనికి తోడు ప్రస్తుత ప్యానెల్ ఇయర్‌లో మరో 10 నాన్ క్యాడర్ ఎస్పీ పోస్టులను కేటాయించనున్నారు. ఈ పదోన్నతుల ప్రక్రియలో ఎలాంటి వివాదాలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు నిర్ణయించారు. సీనియారిటీ, రోస్టర్ పాయింట్లు, అర్హతలను పరిగణనలోకి తీసుకుని తుది జాబితా రూపొందించనున్నారు. పోలీస్ శాఖలో పదోన్నతులు ఆలస్యం కావడానికి ప్రధాన కారణాలుగా ఉన్న సీనియారిటీ వివాదాలు, కోర్టు కేసుల అంశాలపై డీజీపీ సీవీ ఆనంద్ సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు. పోలీసుల కంఠారావు కమిటీ రిపోర్ట్, గతంలో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులు, పదోన్నతులకు సంబంధించిన నిబంధనలను అధికారులు పరిశీలించారు. ప్రతిపాదిత ప్రమోషన్ జాబితాలపై అధికారుల అభిప్రాయాలను సేకరించారు. ఏళ్ల తరబడి పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న అధికారులకు న్యాయం జరగాలని, ముఖ్యంగా పదవీ విరమణకు దగ్గరగా ఉన్నవారికి అన్యాయం కాకూడదని డీజీపీ సీవీ ఆనంద్ భావించినట్లు తెలుస్తోంది. వివాదాలు మరింత పొడిగించకుండా, నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించుకుని విడతల వారీగా ప్రమోషన్లు, పోస్టింగులు కల్పించాలనే దిశగా చర్చలు జరిగాయి. సమావేశంలో కుదిరిన ఏకాభిప్రాయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. ప్రభుత్వ ఆమోదం, అవసరమైన తదుపరి ప్రక్రియ పూర్తి అయిన తర్వాత పదోన్నతులపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. వీలైనంత త్వరగా ప్రమోషన్ల ప్రక్రియను పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తామని డీజీపీ స్పష్టం చేసినట్లు సమాచారం. మొత్తంగా తెలంగాణ పోలీస్ శాఖలో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పదోన్నతుల అంశం కదలిక రావడం అధికారుల్లో ఆశలు పెంచుతోంది. తొలి విడతలో 54 అదనపు ఎస్పీ పోస్టులు, రెండో విడతలో మరో 34 పోస్టులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉండటంతో పలువురు సీనియర్ అధికారులకు ప్రయోజనం కలగనుంది. అయితే పదోన్నతుల తుది జాబితా, ప్రభుత్వ ఆమోదం తర్వాతే అధికారికంగా స్పష్టత రానుంది.

సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు

లైన్ క్లియర్..!?

మొదటిపేజీ తరువాయి..

పూర్తిచేశారు. బ్యారేజీలో పూర్తిస్థాయి నీటి మట్టం +83 మీటర్ల వద్ద దీని నిల్వ సామర్థ్యం 6.94 టీఎంసీలు కాగా. కరువు ప్రభావిత, వెనుకబడిన, గిరిజన ప్రాంతాల సాగు, తాగునీటి అవసరాలకు గోదావరి జలాలను వినియోగించాలనేది ఈ ప్రాజెక్టు లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పేర్కొంది.

ఛత్తీస్‌గఢ్‌లో భూసేకరణతో పాటు భూమి కోల్పోయిన వారికి పరిహారం, పునరావాసానికి అవసరమైన నిధులను నిబంధనల ప్రకారం చెల్లించేందుకు రాష్ట్రప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కావడంతో ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఎన్ఓసీని త్వరగా జారీ చేయాలని కోరారు. మిగిలిన అనుమతుల ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సమ్మక్క సాగర్ ప్రాజెక్టును తొలుత కాంతనపల్లి వద్ద నిర్మించాలని ప్రతిపాదించారు. అయితే ఆ ప్రాంతంలో సుమారు 11,408 ఎకరాల భూమి ముంపునకు గురయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. దీనివల్ల 17 ఆదివాసీ గ్రామాలతో పాటు భద్రత, మౌలిక సదుపాయాలపై ప్రభావం పడే ప్రమాదం ఉందని గుర్తించారు. ఈ సమస్యలను తగ్గించేందుకు బ్యారేజీ నిర్మాణ ప్రాంతాన్ని తుపాకులగూడెంకు మార్చారు. కొత్త ప్రాంతంలో నిర్మాణం చేపట్టినప్పటికీ ఛత్తీస్‌గఢ్ భూభాగంలో బ్యాక్‌వాటర్ ప్రభావం ఎంత ఉంటుందన్నది రెండు రాష్ట్రాల మధ్య కీలక అంశంగా మారింది.ఈ నేపథ్యంలో పొరుగురాష్ట్రం కోరిన మేరకు ఐఐటీ ఖరగ్‌పూర్‌తో అధ్యయనం చేయించారు. ఆ రిపోర్ట్ ప్రకారం సాధారణంగా పూర్తిస్థాయి నీటిమట్టం వద్ద ఛత్తీస్‌గఢ్‌లో సుమారు 33 ఎకరాల భూమి ముంపునకు గురయ్యే అవకాశం ఉందని తెలంగాణ ప్రభుత్వం వివరించింది. భారీ వరదల సమయంలోనూ ప్రభావిత ప్రాంతం 100 ఎకరాలకు మించదని తెలిపింది.

బ్యాక్‌వాటర్ ప్రభావం, ముంపు ప్రాంతాలపై సమగ్ర అధ్యయనం నిర్వహించేందుకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కోరిన రూ.9.883 కోట్లను తెలంగాణ ప్రభుత్వం ఏప్రిల్‌లోనే చెల్లించింది. ఐఐటీ ఖరగ్‌పూర్ తన అధ్యయన నివేదికను జూలై 30వ తేదీన ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నివేదిక ఆధారంగా ముంపు ప్రభావంపై ఉన్న అభ్యంతరాలను పరిష్కరించి ఎన్ఓసీ జారీ చేయాలని తెలంగాణ కోరుతోంది. ప్రభావిత భూములకు నిబంధనల ప్రకారం పరిహారం చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నట్లు మరోసారి స్పష్టం చేసింది. సమ్మక్క సాగర్ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి అయినప్పటికీ.. దాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవడానికి అంతర్రాష్ట్ర అనుమతులు కీలకంగా మారాయి. కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ)లోని పలు విభాగాల నుంచి ప్రాజెక్టుకు సంబంధించి అనుమతులు లభించినప్పటికీ.. ఛత్తీస్‌గఢ్ నుంచి ఎన్ఓసీ లేకపోవడంతో అంతర్రాష్ట్ర అంశాల పరిశీలన ముందుకు సాగడం లేదని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర అభ్యంతరాల కారణంగా సీడబ్ల్యూసీ సాంకేతిక సలహా కమిటీకి తన సిఫారసును పంపడంలో జాప్యం జరిగినట్లు తెలుస్తోంది. అందువల్ల ఛత్తీస్‌గఢ్ నుంచి అనుమతి లభిస్తే ప్రాజెక్టు తదుపరి క్లియరెన్సుల ప్రక్రియకు మార్గం సుగమం కానుంది.ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం సమీపంలో గోదావరి నదిపై ఈ సమ్మక్క సాగర్ బ్యారేజీని నిర్మించారు. సుమారు 1,143 మీటర్ల పొడవు, 59 రేడియల్ గేట్లతో నిర్మించిన ఈ బ్యారేజీకి పూర్తి స్థాయి నీటిమట్టం +83 మీటర్ల వద్ద 6.94 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉంది. దీని ద్వారా గోదావరి నుంచి 46.96 టీఎంసీల నీటిని మళ్లించే ప్రణాళిక ఉంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రెండో దశ కింద సుమారు 4.40 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడం, రామప్ప-పాకాల లింక్ కెనాల్ కింద మరో 30 వేల ఎకరాలకు కొత్తగా సాగునీరు అందించడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశాలు.

దేవాదుల ఎత్తిపోతల పథకం ఆయకట్టుకు కూడా నీటి లభ్యత మెరుగుపడే అవకాశం ఉంది. సాగుతో పాటు మార్గమధ్యంలోని ప్రాంతాలకు తాగునీటి అవసరాలు తీర్చడంలోనూ ఈ బ్యారేజీ ఉపయోగపడుతుందని అంచనా వేస్తున్నారు. సమ్మక్క సాగర్ బ్యారేజీకి ఎన్ఓసీ కోసం తెలంగాణ ప్రభుత్వం గత కొంతకాలంగా ప్రయత్నాలు చేస్తోంది.

2025 సెప్టెంబర్‌లోనూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయిని కలిసి ఈ అంశంపై చర్చించారు. ఈ ఏడాది జూన్‌లో కూడా ఆయన మరోసారి ఎన్ఓసీ ఇవ్వాలని కోరారు. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రాయ్‌పూర్‌కు వెళ్లి చర్చలు జరపడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇటీవల నవంబర్ 15వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఢిల్లీలో జరిగిన సమావేశంలోనూ ఈ ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ నుంచి అనుమతి ఇప్పించాలని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

మోదీ గట్టి మనిషి..

మొదటిపేజీ తరువాయి..

నెలకొంది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సముద్ర భద్రత, ఆర్థిక సహకారం, వాణిజ్య మార్గాల రక్షణ వంటి అంశాలు ఈ భేటీలో ప్రధానంగా చర్చకు రానున్నాయి. మంగళవారం జరిగే ఏడో క్వాడ్ లీడర్స్ సమిట్‌లో ప్రధాని మోదీతో పాటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్, జపాన్ ప్రధాని సనాయే తకాయిచి పాల్గొననున్నారు. రెండేళ్లకు పైగా విరామం తర్వాత నాలుగు దేశాల అధినేతలు ఒకే వేదికపై సమావేశం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశంలో కీలక ఖనిజాలు, సరఫరా వ్యవస్థల భద్రత, సముద్ర మార్గాల పర్యవేక్షణ, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో వాణిజ్య నౌకల రక్షణపై చర్చించే అవకాశం ఉంది. ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీలు, రక్షణ రంగానికి అవసరమైన ఖనిజాల సరఫరాలో ఇతర దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడంపై నాలుగు దేశాలు దృష్టి పెట్టనున్నాయి. కాగా ట్రంప్ భారత ప్రధాని నరేంద్ర మోదీపై మరోసారి ప్రశంసలు కురిపించారు. మీడియాతో మాట్లాడిన సందర్భంగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇక్కడ ట్రంప్ తన పక్కనే నిల్చున్న ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి, 'ఆయన చాలా కఠినమైన/దృఢమైన వ్యక్తి. జపాన్ ప్రధాని సనాయే తకాయిచి అంతకంటే కఠినమైన వ్యక్తి కావొచ్చు. మేం కూడా బాగానే ఉన్నాము' అంటూ ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ అల్బనీస్ వైపు చూస్తూ సరదాగా వ్యాఖ్యానించారు. 2024 తర్వాత క్వాడ్ దేశాధినేతలు ప్రత్యక్షంగా కలుసుకోవడం ఇదే తొలిసారి. ట్రంప్ ప్రస్తుత పదవీ కాలంలో ఇదే తొలి క్వాడ్ శిఖరాగ్ర సమావేశం కావడం విశేషం. 2024 సెప్టెంబర్ 21న అమెరికాలోని విల్మింగ్టన్‌లో అప్పటి అధ్యక్షుడు జో బైడెన్ ఆతిథ్యంలో చివరిసారిగా క్వాడ్ నేతల ప్రత్యక్ష సమావేశం జరిగింది. ఆ సమావేశంలో 2025లో తదుపరి సదస్సుకు భారత్ ఆతిథ్యం ఇవ్వాలని ప్రకటించారు.ఇక ఈసారి సమావేశం సందర్భంగా మీడియాతో మాట్లాడిన ట్రంప్, క్వాడ్ దేశాలతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. 'ఈ వ్యక్తులతో, ఈ దేశాలతో మొదటి నుంచి మాకు అద్భుతమైన సంబంధాలు ఉన్నాయి. వీరంతా అసాధారణ వ్యక్తులు. నాకు మంచి మిత్రులు' అని అన్నారు. వారితో దీర్ఘకాలిక వ్యక్తిగత అనుబంధం గురించి ప్రస్తావించారు. సమావేశం అనంతరం కూడా మాట్లాడిన ట్రంప్- ప్రధాని మోదీ తనకు మంచి మిత్రుడని, ప్రపంచవ్యాప్తంగా అంతా గౌరవించే గొప్ప నాయకుడు అని కొనియాడారు. తన ఫోన్, వైట్ హౌస్ ఓవల్ ఆఫీస్ తలుపులు క్వాడ్ దేశాలకు ఎప్పుడూ తెరిచే ఉంటాయని భరోసా ఇచ్చారు. గతంలో కూడా మోదీని ట్రంప్ 'గ్రేట్ లీడర్', 'వెరీ టఫ్ కుకీ' అంటూ ప్రశంసించారు. జూన్‌లో ఆక్సియోస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మోదీ 12 ఏళ్లకుపైగా ప్రధానిగా కొనసాగుతున్నారని, భారత్‌లో రాజకీయ స్థిరత్వానికి ఆయన ఉదాహరణగా నిలిచారని వ్యాఖ్యానించారు.

మరోవైపు మనీలాలో క్వాడ్ సమావేశం ముగిసిన కొద్ది రోజులకే ట్రంప్ చైనాలో పర్యటించనున్నారు. ఆసియా-పసిఫిక్ ఆర్థిక సహకార వేదిక (ఏపీఈసీ) సదస్సులో పాల్గొనడంతో పాటు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో ఆయన భేటీ కానున్నారు. ఈ నేపథ్యంలో మనీలాలో జరిగే క్వాడ్ సమావేశానికి మరింత ప్రాధాన్యత ఏర్పడింది. అయితే క్వాడ్ ఏ ఒక్క దేశానికి వ్యతిరేకంగా ఏర్పడిన కూటమి కాదని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో స్పష్టం చేశారు. చైనాను లక్ష్యంగా చేసుకుని ఈ కూటమి పనిచేయడం లేదని ఆయన పేర్కొన్నారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భద్రత, ఆర్థిక సహకారాన్ని బలోపేతం చేయడమే క్వాడ్ లక్ష్యమని వెల్లడించారు. భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా దేశాలతో కూడిన క్వాడ్ ప్రయాణం 2004లో హిందూ మహాసముద్రంలో వచ్చిన సునామీ తర్వాత ప్రారంభమైంది. ఆ సమయంలో బాధిత దేశాలకు ఈ నాలుగు దేశాలు కలిసి సహాయక చర్యలు చేపట్టాయి. 2007లో తొలిసారి అధికారిక స్థాయిలో సమావేశమయ్యాయి. కొంతకాలం మందగించిన ఈ కూటమి.. 2017లో మళ్లీ క్రియాశీలమైంది. 2021లో క్వాడ్ సమావేశాలు దేశాధినేతల స్థాయికి చేరాయి. అదే ఏడాది మార్చి 12న తొలి వర్చువల్ శిఖరాగ్ర సమావేశం జరిగింది. అప్పటి నుంచి సంప్రదాయ భద్రతా అంశాలకే పరిమితం కాకుండా సాంకేతికత, మౌలిక సదుపాయాలు, ఆరోగ్య భద్రత, విపత్తుల సమయంలో సహకారం వంటి అంశాలకూ క్వాడ్ తన కార్యాచరణను విస్తరించింది. 2024 సెప్టెంబర్ 21న అమెరికాలోని విల్మింగ్టన్‌లో చివరిసారిగా క్వాడ్ దేశాధినేతల సమావేశం జరిగింది. 2025లో భారత్‌లో జరగాల్సిన తదుపరి సమావేశం నిర్వహణకు నోచుకోలేదు. దీంతో మనీలాలో జరిగే భేటీ నాలుగు దేశాల మధ్య సహకారాన్ని సమీక్షించుకోవడానికి కీలక వేదికగా మారనుంది. 2021లో ఈ స్థాయి సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి ప్రతి క్వాడ్ లీడర్స్ సమిట్‌కు హాజరైన ఏకైక నేత ప్రధాని మోదీ కావడం విశేషం. క్వాడ్ ప్రధానంగా నాలుగు అంశాలపై దృష్టి సారిస్తోంది. సముద్ర, అంతర్జాతీయ భద్రత; ఆర్థిక అభివృద్ధి, భద్రత; కీలక, ఆధునిక సాంకేతికతలు; మానవతా సహాయం, విపత్తుల నిర్వహణ వంటి అంశాలు ఇందులో ఉన్నాయి.

క్వాడ్ ఒక నమ్మకమైన, నిర్మాణాత్మక

భాగస్వామ్యం..

మొదటిపేజీ తరువాయి..

సమావేశమయ్యారని, పదేళ్ల తర్వాత 2017లో ఇదే వేదికపై చర్చలను పునఃప్రారంభించామని తెలిపారు. మళ్లీ ఈ చారిత్రక నగరంలో క్వాడ్ సదస్సు జరగడం ఒక ముఖ్యమైన మైలురాయి అని పేర్కొన్నారు. గతేడాది జనవరి నుంచి ఇప్పటివరకు నాలుగు దేశాల విదేశాంగ మంత్రులు ఐదుసార్లు సమావేశం కావడం కూటమి పట్ల తమకున్న నిబద్ధతకు నిదర్శనమని మోదీ అన్నారు. 23వ ఆసియాన్-ఇండియా సదస్సు, 21వ తూర్పు ఆసియా సదస్సులలో పాల్గొనేందుకు మనీలా వెళ్లిన ప్రధాని మోదీ, అక్కడే క్వాడ్ భేటీకి హాజరయ్యారు. స్వేచ్ఛాయుత, సమ్మిళిత ఇండో-పసిఫిక్ ప్రాంతాన్ని నిర్మించడమే లక్ష్యంగా నాలుగు దేశాలు కలిసి పనిచేస్తున్నాయి.క్వాడ్ సమావేశంతో పాటు మనీలాలో జరిగిన ఇతర అంతర్జాతీయ సమావేశాల్లోనూ మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఇరు దేశాల మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకునే మార్గాలపై చర్చించారు. ముఖ్యంగా పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఆవిష్కరణలు, సెమీకండక్టర్లు, ఆధునిక తయారీ రంగాల్లో సహకారాన్ని పెంచుకోవడంపై ఇరువురు నేతలు దృష్టి సారించారు. 2025 సెప్టెంబర్‌లో సింగపూర్ ప్రధాని భారత్‌లో పర్యటించిన సందర్భంగా రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక అమలుపైనా సమీక్షించారు. త్వరలో సింగపూర్ ఆసియాన్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో లారెన్స్ వాంగ్‌కు మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ విషయంలో భారత్ పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. ఆసియాన్ దేశాల్లో భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా సింగపూర్ ఉంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విషయంలోనూ ఆ దేశం భారత్‌కు ముఖ్యమైన వనరుగా కొనసాగుతోంది. థాయ్‌లాండ్ ప్రధాని అనుతిన్



చార్న్‌విరాకుల్‌తోనూ మోదీ సమావేశమయ్యారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయనకు అభినందనలు తెలిపారు. ఇరు దేశాల మధ్య రక్షణ, భద్రత సహా పలు కీలక రంగాల్లో సహకారాన్ని పెంచుకోవడంపై చర్చించారు. భారత్, థాయ్‌లాండ్ సముద్ర పొరుగు దేశాలని, శతాబ్దాలుగా కొనసాగుతున్న చరిత్ర, సంస్కృతి, ఆధ్యాత్మిక సంప్రదాయాలు ఇరు దేశాలను కలిపి ఉంచుతున్నాయని మోదీ పేర్కొన్నారు. 2025 ఏప్రిల్‌లో మోదీ థాయ్‌లాండ్ పర్యటన సందర్భంగా ఇరు దేశాల సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచారు. అప్పటి నుంచి సాధించిన పురోగతిని తాజా సమావేశంలో సమీక్షించారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, భద్రత, రవాణా అనుసంధానం, డిజిటల్ సాంకేతికతలు, ఫిన్‌టెక్, పర్యాటకం, సాంస్కృతిక సంబంధాలపై చర్చలు జరిపారు.

బిమ్‌స్టెక్, ఇండియన్ ఓషన్ రిమ్ అసోసియేషన్, మెకాంగ్-గంగా సహకార వేదికలతో పాటు ఆసియాన్ ఆధ్వర్యంలో జరిగే ప్రాంతీయ సమావేశాల్లోనూ కలిసి పనిచేయాలని ఇరు దేశాల ప్రధానులు అభిప్రాయపడ్డారు. ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపైనా తమ అభిప్రాయాలను పంచుకున్నారు. భారత్ అనుసరిస్తున్న యాక్ట్ ఈస్ట్ విధానానికి థాయ్‌లాండ్ అనుసరిస్తున్న యాక్ట్ వెస్ట్ విధానం పరస్పరం తోడ్పడుతున్నాయని భారత విదేశాంగ శాఖ తెలిపింది. ఇటీవలి సంవత్సరాల్లో ఇరు దేశాల మధ్య వాణిజ్యం గణనీయంగా పెరిగింది. 2025లో ద్వైపాక్షిక వాణిజ్యం సుమారు 21 బిలియన్ డాలర్లకు చేరింది. ఇందులో థాయ్‌లాండ్ వాణిజ్య మిగులు 10 బిలియన్ డాలర్లకు పైగా ఉంది.

కాగా వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన ఈ గురుద్వారా పునరాభివృద్ధి (రీడెవలప్‌మెంట్) పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేసి, పనులను ప్రారంభించారు. ఈ సందర్శన అనంతరం ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా తన సంతోషాన్ని పంచుకున్నారు. "మనీలాలోని గురుద్వారా ఖల్సా దివాన్‌ను సందర్శించడం నాకు ఎంతో ఆశీర్వాదంగా, ధన్యతగా అనిపిస్తోంది" అని పేర్కొన్నారు. మరోవైపు, ఖల్సా దివాన్ గురుద్వారా గత శతాబ్ద కాలంగా భారత్-ఫిలిప్పీన్స్ మధ్య ఉన్న బలమైన సాంస్కృతిక, ప్రజల మధ్య సంబంధాలకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోందని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది.

అమెరికాలో భారీ విధ్వంసానికి కుట్ర?

మొదటిపేజీ తరువాయి..

జచీచీ కథనం వెల్లడించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగంలోని కీలక అధికారులను లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందని పేర్కొంది. అయితే ఈ వార్తలపై అమెరికా ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్ర

జిల్లా లోనే అత్యధికంగా నియోజకవర్గానికి పింఛన్ ల మంజూరు

బాసర నవంబర్ 17 (ప్రజా జ్యోతి):
నిర్మల్ జిల్లా లోనే అత్యధికంగా ముధోల్ నియోజకవర్గానికి చేయూత పింఛన్ లు మంజూరు చేయడం జరిగిందని ఎమ్మెల్యే రామారావ్ పటేల్ అన్నారు. మంగళవారం ముధోల్ మండల కేంద్రం లోని ఢిలక్స్ ఫంక్షన్ హల్ లో



చేయూత పింఛన్ మంజూరీ పత్రాలు పంపిణి చేసిన సందర్భంగా అయన మాట్లాడారు.. గత పది సంవత్సరాలు గా పేదలు పింఛన్ అందక ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు.ప్రభుత్వం, అధికారుల సహకారం మూలంగా ముధోల్ నియోజకవర్గం లో 5వేల మందికి చేయూత పింఛన్ లను అందిస్తున్నా మని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వికలాంగులకు, వితంతువులకు ఒంటరి మహిళలకు, గీత కార్మికుల కు పింఛన్ అందించడాన్ని స్వాగతిస్తున్నా మని అదే విధంగా వృద్దులకు పింఛన్ లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వికలాంగులకు 6వేలు, వృద్దులకు 4వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ విషయమై అసెంబ్లీ లో మాట్లాడనున్నట్లు చెప్పారు. ముధోల్ మండల కేంద్రం లో 5 కోట్ల రూపాయల నిధుల తో సి సి రోడ్ల నిర్మాణం,4 కోట్ల నిధుల తో కస్తూరిబా పాఠశాల భవనం, 200 కోట్ల తో ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు..ప్రభుత్వం ప్రతి విడత లో 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాల్సి ఉండగా ఈసారి 1000 ఇండ్లు మాత్రమే మంజూరు చేసిందన్నారు.. త్వరలో కొత్త వారికి ఇండ్లు మంజూరు చేయనున్నట్లు చెప్పారు.. కార్యక్రమం లో అధికారులు, సర్పంచ్ లు, నాయకులు పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆపదలో అండగా నిలచిన యువ నేత అశ్విన్ రెడ్డి

నేరడిగొండ, నవంబర్ 17 (ప్రజాజ్యోతి):
ప్రాంతాలు, పరిచయాలకు అతీతంగా ఆపదలో ఉన్న ఒక విశ్రాంత సైనికాధికారికి రక్తదానం చేసి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ నాయకుడు ఏలేటి అశ్విన్ రెడ్డి తన మానవత్వాన్ని చాటుకున్నారు.



డెహ్రాడూన్‌కు చెందిన విశ్రాంత సీఆర్పీఎఫ్ అధికారి సంజయ్ కుమార్ తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో, మెరుగైన వైద్యం కోసం ఎయిర్‌లిఫ్ట్ ద్వారా హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆయనకు అత్యవసరంగా రక్తం అవసరమైంది. విషయం తెలుసుకున్న అశ్విన్ రెడ్డి ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి చేరుకుని స్వయంగా రక్తదానం చేశారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, మనం చేసే చిన్న సాయం మరొకరి ప్రాణాలను నిలబెడుతుందని ఈ సందర్భంగా అశ్విన్ రెడ్డి పేర్కొన్నారు. సరైన సమయానికి స్పందించి తమ కుటుంబ సభ్యుడి ప్రాణాలు కాపాడినందుకు సంజయ్ కుమార్ కుటుంబ సభ్యులు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రేషన్ కార్డులు నిరంతర ప్రక్రియ

7వార్డ్ స్మార్ట్ కార్డుల పంపిణీలో ఎమ్మెల్యే బొజ్జు పటేల్ వెల్లడి

ఖానాపూర్ నవంబర్ 17(ప్రజా జ్యోతి)
పేదవాడికి కవచకుండలం లాంటి రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరం కొనసాగు



తుందని గత ప్రభుత్వం పదేళ్లుగా ఇవ్వని రేషన్ కార్డులు రేవంత్ రెడ్డి ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త కార్డులతో పాటు సన్నబియాన్ని మంజూరు చేసే పేద కుటుంబాల ఆకలి తీరుస్తుందని ఖానాపూర్ శాసనసభ్యులు వెడమ బొజ్జు పటేల్ అన్నారు మంగళవారం ఖానాపూర్ పట్టణంలోని ఏడవ వార్డులో నూతన స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో అవార్డు కౌన్సిలర్ నిమ్మల రమేష్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాజీద్ 11వ వార్డు కౌన్సిలర్ రాజుర సత్యం మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్ తహసిల్దార్ సుజాత రెడ్డి పద్మావతి నగర్ యూత్ సభ్యులతో పాటు అవార్డు ప్రజలు ఎమ్మెల్యే చేతుల మీదుగా స్మార్ట్ కార్డులను పొందారు

ఇంకుడు గుంతల పనులకు శ్రీకారం

నేరడిగొండ నవంబర్ 17 (ప్రజాజ్యోతి):
నేరడిగొండ గ్రామపంచాయతీ పరిధిలోని మధుర నగర్ కాలనీలో మంజూరైన ఇంకుడు గుంతల నిర్మాణ పనులకు అధికారులు, ప్రజాప్రతినిధులు మంగళవారం శ్రీకారం చుట్టారు. రెండు రోజుల క్రితం జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) రమేష్ కాలనీలో పర్యటించి ఈ పనులను మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఏలేటి నీలిమ రవీందర్ రెడ్డి, ఉప సర్పంచ్ గోతి గులాబ్ సింగ్, పంచాయతీ కార్యదర్శి అరుణ్, కారోబారి పోశెట్టిలతో కలిసి సామాజిక కార్యకర్త సాబ్లే సంతోష్ సింగ్ పనులను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వర్షపు నీరు వృథాగా పోకుండా భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా భూగర్భ జలాలు గణనీయంగా పెరుగుతాయని పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇచ్చి, తమ ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు.



మస్కాపూర్ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ శంకుస్థాపన

జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులు రాగం విజ్ఞత, కన్నల్వర్ నవీన్ లకు ఘన సన్మానం

ఖానాపూర్ నవంబర్ 17 (ప్రజా జ్యోతి)
ఖానాపూర్ మండలం మస్కాపూర్ గ్రామంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో మంగళవారం ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వం పాఠశాలల బలోపేతానికి మరియు విద్యార్థుల చదువుకు ఎటువంటి ఆటంకం కలగకుండా మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించడానికి కట్టుబడి ఉన్నామని అన్నారు. విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నామని అన్నారు. అనంతరం, జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన పాఠశాల విద్యార్థులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలు, 6 కేంద్రపాలిత ప్రాంతాల నుండి క్రీడాకారులు



పాల్గొన్న జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 10వ తరగతి విద్యార్థిని రాగం విజ్ఞత 17వ స్థానం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విజ్ఞతను శాలువాతో సత్కరించి, మెడల్ బహూకరించారు. అలాగే, ఇదే పాఠశాల నుండి జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్న మరో విద్యార్థి కన్నల్వర్ నవీన్ కు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించడం గర్వకారణమని, భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోనగిరి నరేందర్, సర్పంచ్ దోనికేని లక్ష్మీ దయానంద్, ఉపసర్పంచ్ దొనికేని వెంకటేష్, గ్రామఅభివృద్ధి అధ్యక్షులు కృష్ణ, కార్యదర్శి రాజు, ఉపాధ్యాయులు వెన్నం



అంజయ్య, షేక్ ఇమ్రాన్, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలుడి మృతితోనైనా మార్పు రాదా?

మోతుగూడ బైపాస్‌పై లారీల ఇష్టారాజ్యం

రోడ్డుపైనే భారీ వాహనాల నిలుపుదల.. బస్సుల రాకపోకలకు తీవ్ర అంతరాయం

అభం శుభం తెలియని బాలుడు మృత్యువాత పడినా అధికారుల్లో చలనం కరువు

మరో ప్రాణం బలికాకముందే చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

ఆసిఫాబాద్ నవంబర్ 17 ప్రజా జ్యోతి
ఒక చిన్నారి ప్రాణం పోయినా పరిస్థితిలో మార్పు రాకపోవడం ఏమిటని మోతుగూడ గ్రామపంచాయతీ పరిధి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బైపాస్ రహదారిపై భారీ లారీలను ఇష్టారాజ్యంగా నిలిపివేస్తుండటంతో నిత్యం రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. రహదారిపై లారీలు నిలిపి ఉంచడంతో బస్సులు సైతం వెళ్లలేని దుస్థితి నెలకొంది. ఫలితంగా విద్యార్థులు, వృద్ధులు, మహిళలు, ఇతర ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవలే అభం శుభం తెలియని ఓ బాలుడు మృత్యువాత పడిన ఘటన స్థానికులను తీవ్రంగా కలచివేసింది. అయినా లారీల నిలుపుదల విషయంలో ఎలాంటి మార్పు కనిపించకపోవడం ప్రజల్లో ఆగ్రహానికి కారణమవుతోంది.

చిన్నారి ప్రాణం పోయినా పట్టదా?

రోడ్డు భద్రత విషయంలో కనీస జాగ్రత్తలు పాటించకపోవడం వల్లే ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ప్రజలు, విద్యార్థులు నిత్యం ప్రయాణించే రహదారిపై భారీ లారీలను అడ్డంగా నిలిపివేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఒక బాలుడు ప్రాణాలు కోల్పోయిన ఘటన తర్వాత కూడా లారీలను రోడ్డుపై నిలపకుండా ఉండాలనే కనీస ఇంగితజ్ఞానం లేదా? అంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. లారీలను ఎక్కడపడితే అక్కడ నిలిపివేయడం వల్ల రహదారి కుంచించుకుపోయి బస్సులు వెళ్లేందుకు కూడా అవకాశం లేకుండా పోతోందని చెబుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలకు దారి ఇవ్వలేని పరిస్థితి ఏర్పడటంతో ప్రయాణికులు ప్రమాదాల భయంతో రాకపోకలు సాగించాల్సి వస్తోందని వాపోతున్నారు.

విద్యార్థులు, వృద్ధులకు తప్పని అవస్థలు

ఈ రహదారిపై బస్సుల రాకపోకలకు ఆటంకం ఏర్పడటంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సులు సకాలంలో రాకపోవడం, వచ్చినా లారీల కారణంగా ముందుకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు, మహిళలు రహదారిపై నడవడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు, ఇతర వాహనాల రాకపోకలకు సైతం ఆటంకం కలిగే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ప్రయాణ సౌకర్యం కోసం ఉపయోగపడాల్సిన బైపాస్ రహదారి లారీల పార్కింగ్ స్థలంగా మారడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

అధికారులు ఏం చేస్తున్నట్లు?

ఇంతటి సమస్య కొనసాగుతున్నా సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదని స్థానికులు నిలదీస్తున్నారు. రహదారిపై లారీల నిలుపుదలను నియంత్రించాల్సిన బాధ్యత అధికారులకు లేదా? ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతున్నా పట్టించుకోకపోవడం వెనుక కారణమేమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రమాదం జరిగిన



ప్పుడు మాత్రమే హడావుడి చేసి, ఆ తర్వాత యథావిధిగా వదిలేయడం వల్ల సమస్యలు పరిష్కారం కావని హితవు పలుకుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపై నిలిపిన లారీలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మరో ప్రాణం పోతేనే స్పందిస్తారా?

ఇప్పటికే ఒక బాలుడు మృత్యువాత పడిన నేపథ్యంలో అధికారులు ఇకనైనా నిర్లక్ష్యాన్ని వీడి తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. బైపాస్ రోడ్డుపై లారీల నిలుపుదలను పూర్తిగా నియంత్రించాలని, భారీ వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ స్థలం కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. బస్సులు ఎలాంటి ఆటంకం లేకుండా రాకపోకలు సాగించేలా రహదారిని అందుబాటులోకి తేవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల ప్రాణాల కంటే లారీల నిలుపుదలే ముఖ్యమా? మరో అమాయకుడు ప్రమాదానికి బలైన తర్వాతే అధికారులు మేల్కొంటారా? అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మోతుగూడ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

అభయ హస్తం కాదు.. అబద్ధాల హస్తం

మంచిర్యాల, 17, నవంబర్ (ప్రజాజ్యోతి):
కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలు, అభయ హస్తం మేనిఫెస్టో హామీలు ప్రజలకు ఇప్పటికీ పూర్తిస్థాయిలో అందలేదని ఆరోపించారు. మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆధ్వర్యంలో మంగళవారం మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2023 సెప్టెంబర్ 17న తుక్కుగూడలో నిర్వహించిన విజయభేరి సభలో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ఆరు గ్యారెంటీలను ప్రకటించారని గుర్తుచేశారు. అనంతరం నవంబర్ 17న అభయ హస్తం పేరుతో 42 పేజీల ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసి 62 ప్రధాన హామీలను ప్రజల ముందుంచారని తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ.2,500, రూ.500కే గ్యాస్ సిలిండర్, రైతు భరోసా కింద రైతులకు ఏటా రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు, వరి పంటకు రూ.500 బోనస్, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం, యువ వికాసం కింద విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, చేయూత కింద నెలకు రూ.4 వేల పెన్షన్, రూ.10 లక్షల ఆరోగ్య బీమా వంటి హామీలను ప్రకటించారని వివరించారు. అదేవిధంగా తొలి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపు



వంటి హామీలను సైతం మేనిఫెస్టోలో పొందుపరిచారని తెలిపారు . ఎన్నికల సమయంలో ప్రజలకు ఎన్నో ఆశలు కల్పించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. అభయ హస్తం పేరుతో ఇచ్చిన హామీలు ప్రజలకు భరోసా కల్పించలేకపోయాయని, అందుకే వాటిని అబద్ధాల హస్తంగా అభివర్ణిస్తూ నిరసన చేపట్టినట్లు విజిత్ కుమార్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, టీబీజీకేఎస్ నాయకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆసరా పెన్షన్ ప్రొసీడింగ్స్ అందజేసిన సర్పంచ్‌కు ఘన సన్మానం

ఇచ్చోడ 17నవంబర్ (ప్రజాజ్యోతి):
ఇచ్చోడ మండలంలోని దుబార్పేట్ గ్రామపంచాయతీ పరిధిలో ఆసరా పెన్షన్ మంజూరైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేసిన సందర్భంగా



గ్రామ సర్పంచ్ కత్తే ప్రవీణ, పంచాయతీ కార్యదర్శి హిమబిందును పెన్షన్ లబ్ధిదారులు శాలువాలతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ కత్తే ప్రవీణ, పంచాయతీ కార్యదర్శి హిమబిందు, వార్డు మెంబర్ పవన్, గ్రామ పటేల్ జోతీరాం, గంగారాం పటేల్ పెన్షన్ లబ్ధిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెన్షన్ లబ్ధిదారులు తమకు పెన్షన్మంజూరులో సహకరించి, ప్రొసీడింగ్స్ అందజేసినందుకు సర్పంచ్ కు కార్యదర్శికి గ్రామప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

12వ వేతన ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలి

మంచిర్యాల, 17, నవంబర్ (ప్రజాజ్యోతి):
కేంద్ర ప్రభుత్వం, కోల్ ఇండియా యాజమాన్యం బొగ్గు గని కార్మికుల 12వ వేతన ఒప్పందం అమలులో తీవ్ర జాప్యం చేస్తున్నాయని సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ (టీఎన్‌టీయూసీ) నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 2026 జూలై 1 నుంచి అమల్లోకి రావాల్సిన 12వ వేతన ఒప్పందంపై ఇప్పటివరకు చర్చలు ప్రారంభించకపోవడం, జేబీసీసీఐ స్థాయి కమిటీని ఏర్పాటు చేయకపోవడం పట్ల రాష్ట్రంలోని సుమారు 42 వేల మంది సింగరేణి కార్మికుల కుటుంబాల్లో ఆందోళన నెలకొందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నాలుగు లేబర్ కోడ్ల అమలుతోనే వేతన ఒప్పందం చేపడతామంటూ కోల్ ఇండియా యాజమాన్యం కాలయాపన చేయడం సరికాదన్నారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను తమ



యూనియన్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు. గతంలో మాదిరిగానే ఐదేళ్లకోసారి సకాలంలో వేతన ఒప్పందం జరిగేలా కేంద్ర కార్మిక సంఘాల ప్రతినిధులు, జేబీసీసీఐ సభ్యులతో వెంటనే చర్చలు ప్రారంభించి వేతనాలు, అలవెన్సులు ఖరారు చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి వ్యాప్తంగా నూతన బొగ్గు గనులను ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. గుర్తింపు సంఘం ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నెలకు రెండుసార్లు మెడికల్ బోర్డు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కార్మికుల సమస్యల పరిష్కారంలో విఫలమయ్యాయని విమర్శించారు. సొంతింటి పథకం, వారసత్వ ఉద్యోగాలు, కాంట్రాక్టు కార్మికుల క్రమబద్ధీకరణ, సమాన పనికి సమాన వేతనం వంటి దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల సాధన కోసం టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో 2027 జనవరి రెండో వారంలో రెండో విడత సింగరేణి కార్మిక బాట కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రకటించారు. కలిసివచ్చే కార్మిక సంఘాలతో కలిసి సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటాలు, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని యాజమాన్యాన్ని హెచ్చరించారు. బెల్లంపల్లిలోని టీఎన్‌టీయూసీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన రీజియన్ స్థాయి కార్యవర్గ సమావేశంలో సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి టీ. మణిరాం సింగ్, ఉపాధ్యక్షులు గద్దెల నారాయణ, శాంతిగని ఫిట్ కార్యదర్శి గడిపల్లి శంకర్, ఎస్ఆర్‌పీ ఏరియా అధ్యక్షులు రఘుపతి, ఫిట్ కార్యదర్శి కర్నె శ్రీనివాస్, బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షులు చంద్రమౌళి, ఎస్.ఎస్. పాండే, మేకల నర్సింగ్, బొల్లు మల్లయ్య, బి. సత్యనారాయణ, మాదాసి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై విస్తృత ప్రచారం కల్పించాలి:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు పకడ్బందీ ఏర్పాట్లు

ఈ నెల 19 నుంచి జిల్లావ్యాప్తంగా ప్రత్యేక శిబిరాలు

గద్వాల,నవంబర్ 17(ప్రజా జ్యోతి ప్రతినిధి):
ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో భాగంగా జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో ప్రత్యేక శిబిరాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు.ఈ నెల 19వ,తేదీ నుంచి జిల్లావ్యాప్తంగా ప్రారంభమయ్యే ప్రత్యేక శిబిరాల ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.మంగళవారం క్యాంపు కార్యాలయం నుంచి మండల ప్రత్యేక అధికారులు,ఎంపీడీవోలు,తహసీల్దార్లు,మున్సిపల్ కమిషనర్లు, ఇతర సంబంధిత అధికారులతో వెబ్‌ఎక్స్ ద్వారా పథకం అమలు సన్నద్ధతపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు జిల్లావ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు.ప్రత్యేక శిబిరాల నిర్వహణకు అధికారులు ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.రేషన్ కార్డుదారుల వివరాలను ప్రతి మండలానికి పంపించడం జరుగుతుందని,వాటి ఆధారంగా ఆయా రేషన్ దుకాణాల పరిధిలోని లబ్ధిదారులందరికీ దరఖాస్తులు అందించి, దరఖాస్తు ప్రక్రియ పూర్తయ్యేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలన్నారు. పథకం అమలుపై ఈ నెల 18న స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు,అధికారులు, రేషన్ డీలర్లతో మండల స్థాయిలో సమన్వయ సమావేశాలు నిర్వహించి తగిన సూచనలు చేయాలని ఆదేశించారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి గ్రామ పంచాయతీకి ఒక ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేయాలని,ఇందుకోసం అనువైన ప్రదేశాన్ని గుర్తించి టెంట్లు,టేబుళ్లు,కుర్చీలు,ఫ్లెక్సీలు తదితర అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు.పట్టణ ప్రాంతాల్లో మూడు లేదా నాలుగు వార్డులకు కలిపి ఒకచోట శిబిరం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.దరఖాస్తుల పూరణ,ఇతర విధుల్లో మహిళా స్వయం సహాయక సంఘాల సిబ్బంది సేవలను వినియోగించుకోవచ్చని తెలిపారు.మున్సిపల్ కమిషనర్లు,తహసీల్దార్లు,వార్డు అధికారులు,రేషన్ డీలర్లు సమన్వయంతో పనిచేస్తూ అవసరాన్ని బట్టి ఒకటి కంటే ఎక్కువ రేషన్ దుకాణాలకు కలిపి ఒకే చోట శిబిరం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.పథకం ఉద్దేశం,ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామాలు,పట్టణాల్లో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు.

కుటుంబ యజమాని పేరిట బీమా దరఖాస్తు

కుటుంబాన్ని పోషించే యజమాని పేరిట బీమా దరఖాస్తు చేసుకోవచ్చని,18 నుంచి 59 ఏళ్ల వయస్సు కలిగిన వారు ఈ పథకానికి అర్హులని కలెక్టర్ తెలిపారు. కుటుంబానికి సంపాదించే వ్యక్తి ఆకస్మికంగా మరణించిన సందర్భంలో ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు బీమా కంపెనీల సహకారంతో ప్రభుత్వం రూ.5 లక్షల బీమా పరిహారం అందిస్తుందని వివరించారు. దరఖాస్తుదారులు నామినీలుగా కుటుంబ సభ్యుల్లో ఒకరి కంటే ఎక్కువ మందిని కూడా సూచించేందుకు అవకాశం ఉన్నందున,ఈ వివరాలను దరఖాస్తుల్లో సక్రమంగా నమోదు చేయాలని సూచించారు.

దరఖాస్తుల దుర్వినియోగానికి పాల్పడితే చర్యలు

రేషన్ కార్డుల ఆధారంగా లబ్ధిదారుల వివరాలతో ముందస్తుగా నింపిన దరఖాస్తులను రేషన్ షాపుల వారీగా సిద్ధం చేసి సంబంధిత అధికారులకు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు.రేషన్ కార్డులు లేని కుటుంబాలకు ఆధార్ ఆధారిత ధ్రువీకరణ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని, అటువంటి వారు తప్పనిసరిగా ఆధార్ కార్డు తీసుకురావాలని తెలిపారు. లబ్ధిదారుల పూర్తి వివరాలు,సంతకాలతో కూడిన దరఖాస్తులను నిర్లక్ష్యంగా పదిలేయడం,పోగొట్టడం లేదా దుర్వినియోగం చేయడం వంటి చర్యలకు పాల్పడే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.పూరించిన దరఖాస్తులను రోజువారీగా జాగ్రత్తగా భద్రపరచాలని ఆదేశించారు.దరఖాస్తుల నమోదు ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రత్యేక యాప్‌తో పాటు ఆన్‌లైన్ నమోదు సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.తహసీల్దార్,ఎంపీడీవో కార్యాలయాల్లోని ఆపరేటర్లకు ఆన్‌లైన్ నమోదు విధానంపై శిక్షణ ఇవ్వాలని సూచించారు.కంప్యూటర్,ప్రింటర్ సదుపాయాలు ఉన్న శిబిరాల్లో దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు,ప్రింటింగ్,లబ్ధిదారుల సంతకాల ప్రక్రియను అక్కడిక క్కడే పూర్తి చేయాలని ఆదేశించారు.



రోజువారీ పురోగతిపై ప్రత్యేక పర్యవేక్షణ

ప్రతి మండలం,మున్సిపాలిటీ పరిధిలో పథకం అమలు పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక ఎక్సెల్ ట్రాకింగ్ షీట్ నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.మొత్తం రేషన్ కార్డుల సంఖ్య,అందిన దరఖాస్తులు,ఆన్‌లైన్‌లో నమోదైన దరఖాస్తులు,పెండింగ్ దరఖాస్తులు,పెండింగ్‌కు గల కారణాలు,ఆధార్ ఆధారితంగా అందిన దరఖాస్తుల వివరాలను ప్రతిరోజూ నమోదు చేయాలని తెలిపారు.ఎంపీడీవోలు,మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలోని శిబిరాల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని,ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.రోజువారీ నివేదికలను జిల్లా యంత్రాంగానికి సమర్పించాలని ఆదేశించారు.పథకం అమలులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రెవెన్యూ,పంచాయతీరాజ్,మున్సిపల్,పౌరసరఫరాల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని,ఈ నెల 19వ,తేదీ నాటికి జిల్లాలోని అన్ని శిబిరాలు పూర్తిస్థాయిలో ప్రారంభమయ్యేలా ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు,ఎంపీడీవోలు,తహసీల్దార్లు,మున్సిపల్ కమిషనర్లు,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు
- ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ
- ముగ్గురు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

గద్వాల,నవంబర్ 17(ప్రజా జ్యోతి ప్రతినిధి):
విధుల పట్ల అలసత్వం,నిర్లక్ష్యం వహించే ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవాలని,అవసర మైతే విధుల నుంచి తొలగించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వైద్యాధికారులను ఆదేశించారు. విధులకు హాజరై సక్రమంగా హాజరు నమోదు చేయని ముగ్గురు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సూచించారు.మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి వివిధ విభాగాలను తనిఖీ చేశారు.ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, ప్రసూతి, శిశు సంరక్షణ విభాగాలు,ఇన్‌పేషెంట్ వార్డులు,మందుల లభ్యత, పారిశుద్ధ్యం,వైద్య సిబ్బంది హాజరు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని,వైద్యులు,నర్సింగ్ సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.ప్రసూతి,ప్రసవ విభాగాల్లో అనవసరమైన రద్దీ లేకుండా చూడాలని, ప్రసవానంతరం తల్లులు,శిశువులను నిర్దేశించిన వార్డులకు తరలించాలని సూచించారు.నవజాత శిశువుల గుర్తింపు కోసం తల్లిదండ్రుల వివరాలు,ప్రత్యేక ఐడీతో కూడిన ట్యాగింగ్ విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. శిశువులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నియోనాటల్ స్పెషలిస్ట్ సేవల అవసరాన్ని పరిశీలించాలని తెలిపారు.మాతా సంరక్షణ విభాగంలో బెడ్‌షీట్ల కొరతపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.సిబ్బంది తమ పనితీరును మెరుగుపరచుకోవాలని,విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అభివృద్ధి పనులకు రూ.50 లక్షల నిధులు

ఆసుపత్రిలో వివిధ మరమ్మతులు,అభివృద్ధి పనుల కోసం రూ.50 లక్షల నిధులు మంజూరు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.ఈ నిధులతో చేపట్టాల్సిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.అన్ని వార్డుల్లో ఫ్యాన్లు,ఏసీలు,లైట్లు సక్రమంగా పనిచేసేలా చూడాలన్నారు.మరుగుదొడ్ల నిర్వహణ,వార్డుల పరిశుభ్రత,రోగులకు అందించే ఆహార నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.అవసరమైన చోట జెరియాట్రిక్ వార్డును అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు.వివిధ వార్డుల్లో పర్యటించి రోగులతో మాట్లాడిన కలెక్టర్ వారి కేసు షీట్లను పరిశీలించి అందుతున్న వైద్య సహాయంపై ఆరా తీశారు.గద్వాల ప్రభుత్వ ఆసుపత్రిలోనే మెరుగైన వైద్య సేవలు అందించాలని, అనవసరంగా రోగులను ఇతర ప్రాంతాలకు రిఫర్ చేయకూడదని స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం ఇన్‌పేషెంట్లకు ఆహారం అందించాలని,ఆహార సరఫరాలో అవకత వకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తే చర్యలు

ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు అవసరమైన మందులు, ఇంజెక్షన్లు ఆసుపత్రిలోనే అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. బయట మెడికల్ షాపుల్లో మందులు కొనుగోలు చేయాలని రోగులకు సూచించరాదన్నారు.డిస్పెన్సరీ,సెంట్రల్ స్టోర్స్‌లో మందుల నిల్వలను ఎప్పటి కప్పుడు పరిశీలిస్తూ అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు.రోగుల నుంచి డబ్బులు వసూలు చేయడం, అనవసరంగా ప్రైవేటు ఆసుపత్రులకు పంపించడం,బయట మందులు కొనుగోలు చేయాలని సూచించడం,ప్రభుత్వ వైద్య సామగ్రిని బయట విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైద్య సిబ్బంది హాజరుపై ప్రత్యేక పర్యవేక్షణ

వైద్యులు,ప్రొఫెసర్లు,నర్సింగ్ సిబ్బంది,ల్యాబ్ టెక్నీషియన్లు,ఇతర ఉద్యోగులు విధులకు సక్రమంగా హాజరుకావాలని,బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు.పర్యవేక్షకుల ఛాంబర్‌లో ఉద్యోగుల హాజరు రిజిస్టర్లను కలెక్టర్ క్షుణ్ణంగా తనిఖీ చేశారు.గత 45 రోజుల హాజరు వివరాలను పరిశీలించి,మాన్యువల్ రిజిస్టర్,ఆన్‌లైన్,బయోమెట్రిక్ హాజరు వివరాలను సరిపోల్చి సమగ్ర నివేదిక సమర్పించాలని సూచించారు.అవుట్‌సోర్సింగ్ సిబ్బంది హాజరు,పని తీరును నిరంతరం పర్యవేక్షించాలని,దీర్ఘకాలంగా విధులకు హాజరుకాని వారి స్థానంలో ఆమోదిత మెరిట్ జాబితా ప్రకారం తదుపరి అర్హులైన అభ్యర్థులను నియమించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.మెరిట్ జాబితాలో మార్పులు చేసే అధికారం ఏజెన్సీలకు లేదని స్పష్టం చేశారు.

మూడు షిఫ్టుల్లో వైద్య సేవలు అందించాలి

ఆసుపత్రిలో వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా మూడు షిఫ్టుల్లో సిబ్బంది విధులు నిర్వహించేలా షెడ్యూల్ రూపొందించాలని సూచించారు.ఓపీ బ్లాక్‌ను సందర్శించి ఔట్‌పేషెంట్ రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు.రోగులకు ఇబ్బందులు కలగకుండా టోకెన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని తెలిపారు.గైనకాలజీ విభాగం ఇరుకుగా ఉండటంతో అనువైన మరో ప్రదేశానికి తరలించాలని సూచించారు.కొత్తగా విధుల్లో చేరిన నర్సింగ్,సాంకేతిక సిబ్బందికి అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో థియరీతో పాటు ప్రాక్టికల్ శిక్షణ అందించాలని ఆదేశించారు.ఎంఎల్‌టీ,ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులు పూర్తి చేసి శిక్షణ నిమిత్తం ఆసుపత్రికి వచ్చిన విద్యార్థులతో మాట్లాడి,విధుల్లో నైపుణ్యాలను పెంపొందించుకొని రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.





పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలి

ఆసుపత్రి పరిసరాల్లో పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగుపరచాలని,భద్రతా సిబ్బంది విధులను పటిష్టంగా పర్యవేక్షించాలని,వాహనాల పార్కింగ్‌ను క్రమబద్ధీకరించాలని కలెక్టర్ ఆదేశించారు.రోగుల సహాయకులు ఇష్టానుసారంగా కూర్చోకుండా వారికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు.తాగునీటి కొరత లేకుండా చూడాలని,వాష్‌రూమ్‌లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు.వాహనాల పార్కింగ్ అస్తవ్యస్తంగా ఉండకుండా అవసరమైన ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు.ఆసుపత్రి సూపరింటెండెంట్ అన్ని విభాగాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ తనిఖీలో గుర్తించిన లోపాలను తక్షణమే సరిచేయాలని,తీసుకున్న చర్యలపై విభాగాల వారీగా సమగ్ర యాక్షన్ టేకెన్ రిపోర్టును సమర్పించాలని ఆదేశించారు.ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి పేద రోగికి మెరుగైన వైద్యం,నాణ్యమైన సౌకర్యాలు కల్పించడం అధికారుల ప్రధాన బాధ్యతని,ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ తనిఖీలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ఝాన్సీ లక్ష్మి ,ఇతర వైద్యాధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

మూడు మండలాల్లో 1,100 మందికి కొత్త పింఛన్లు

- వనపర్తి నియోజకవర్గంలో నెలకు రూ.11 కోట్ల పంపిణీ
- పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి ప్రతినిధి, నవంబరు 17 (ప్రజాజ్యోతి):
పేద కుటుంబాలకు సంక్షేమ భరోసా కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పింఛన్లు, రేషన్ కార్డుల పంపిణీకి ప్రాధాన్య మిస్తోందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. మంగళవారం గోపాలపేట, ఏదుల, రేవల్లి మండలాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో దాదాపు 1,100 మంది లబ్ధిదారులకు కొత్త పింఛన్ మంజూరు పత్రాలు, రేషన్ కార్డుల పంపిణీ చేశారు. సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి , షాదీముబారక్ చెక్కులను అందజేశారు. గోపాలపేటలోని పద్మావతి గార్డెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి ఎమ్మెల్యే పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.
రేవల్లి మండల కేంద్రంలోని రైతువేదిక లోనూ లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వనపర్తి నియోజకవర్గంలో ప్రతి నెలా సుమారు రూ.11 కోట్ల పింఛన్ల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ బీమా ద్వారా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం కరువును తీసుకొచ్చిందంటూ బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు హాస్యాస్పదమని విమర్శించారు. గత ప్రభుత్వాలు అమలు చేసిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే ప్రజల అవసరాలకు అనుగుణంగా కొత్త పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. పేదల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, మహిళా సాధికారత,
కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమాల్లో మార్కెట్‌యార్డు అధ్యక్షుడు వెంకటేష్, ఉపాధ్యక్షుడు సత్యశీలారెడ్డి, ఏదుల మండల అధ్యక్షుడు సుఖేందర్‌రెడ్డి, రేవల్లి మండల అధ్యక్షుడు సుల్తాన్, జిల్లా నాయకులు వాడాల పర్వతాలు, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వాకిటి ఆదిత్య, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





అన్నగా ఉంటా.. అందరి రుణం తీర్చుకుంటా

వనపర్తి ప్రతినిధి, నవంబరు 17 (ప్రజాజ్యోతి):
ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, తనను గెలిపించిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటూ వారి రుణం తీర్చుకుంటానని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. పెద్దమందడి మండల కేంద్రంలోని శ్రీ చెన్నకేశవ స్వామి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సంక్షేమ పథకాల లబ్ధిదారుల కార్యక్రమంలో ఆయన పాల్గొని పింఛన్, స్మార్ట్ రేషన్ కార్డులు, ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్), కల్యాణలక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. ఎన్నో ఏళ్లుగా పింఛన్లు, రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న వారికి ప్రజాపాలనలో లబ్ధి చేకూరుతోందని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పింఛన్లు వంటి పథకాలతో పేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఇందిరా బీమా పథకం ద్వారా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించేందుకు చర్యలు చేపడుతోందని తెలిపారు. వనపర్తి నియోజకవర్గంలో ప్రతినెలా రూ.11 కోట్ల పింఛన్ల పంపిణీ చేస్తున్నామని, 5,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. తద్వారా నిరుపేదల సొంతింటి కల నెరవేరనుందని పేర్కొన్నారు. నాలుగు కొత్త సింగిల్ విండోలు మంజూరు నియోజకవర్గ రైతుల సౌకర్యార్థం సోలిపూర్, వెల్టూరు, రేవల్లి, ఏదుల ప్రాంతాలకు నాలుగు కొత్త సింగిల్ విండోలు మంజూరయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. వీటి ద్వారా రైతులకు వ్యవసాయ సేవలు మరింత చేరువవుతాయన్నారు. త్వరలో పెద్దగూడెం, కదుకుంట్ల, గుమ్మడం, అయ్యవారిపల్లి గ్రామాలకు కూడా సింగిల్ విండోలు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని చెప్పారు. సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన పెద్దమందడి రోడ్డు పనులను తిరిగి ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడతానన్నారు. మండలంలోని ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఖిల్లా గణపురం, పెద్దమందడి వ్యవసాయ మార్కెట్ యార్డుల అధ్యక్షురాలు నవనీత క్యామరాజు, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ గంగా రవీందర్, మండలాధ్యక్షుడు కొమ్ము వెంకటస్వామి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వాకిటి ఆదిత్య, మాజీ ఎంపీపీ రఘుప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు సత్యారెడ్డి, మాజీ జెడ్పీటీసీ రమేష్ గౌడ్, మనిగిల్ల తిరుపతిరెడ్డి, ఎంపీడీవో, తహసీల్దార్, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- కాంగ్రెస్ మేనిఫెస్టోను బుట్టదాఖలు చేసిన నిరంజన్‌రెడ్డి
- 420 హామీలు, ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలం

వనపర్తి, నవంబరు 17 (ప్రజాజ్యోతి):
ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో ప్రతులను చించి బుట్టలో వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఎన్నికల మేనిఫెస్టోకు ఎంతో ప్రాధాన్యం ఉంటుందని, దానిని భగవద్గీత, బైబిల్, ఖురాన్‌తో సమానంగా భావించాలని పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ ప్రకటించిన 420 హామీలు, ఆరు గ్యారంటీలు అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. సహకార సంఘాల ఎన్నికల్లో సింగిల్‌విండో అధ్యక్ష పదవులను అధికార పార్టీ కైవసం చేసుకుంటూ, మరోవైపు ఓటు చోరీ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని, ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంపై ప్రజలు తగిన సమయంలో స్పందిస్తారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ వంటి పథకాలతో రైతులకు అండగా నిలిచామని పేర్కొన్నారు. రైతుబంధు కింద 11 విడతల్లో రూ.72,815 కోట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం రైతులకు సాగునీరు, విద్యుత్ అందించడంలో ప్రభుత్వం విఫల మవుతోందని విమర్శించారు. శ్రీశైలం జలాలను పూర్తిస్థాయిలో వినియోగించి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. రెండేళ్లు గడుస్తున్నా రెండు లక్షల ఉద్యోగాల భర్తీపై స్పష్టత లేదని, రైతుబంధు చెల్లింపుల్లో జాప్యం జరుగుతోందని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కేటాయించిన నిధులు సరిపోవడం లేదని, భూభారతి విధానంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనుల్లోనూ ఆశించిన పురోగతి లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రైతుల సమస్యలను పరిష్కరించాలని నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు.
ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, జగదీశ్వర్‌రెడ్డి, నందిమళ్ల అశోక్, కరుణశ్రీ, కృష్ణానాయక్, రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సందర్శించిన రామకృష్ణారెడ్డి

నాగర్ కర్నూల్ నవంబర్ 17 (ప్రజా జ్యోతి బ్యూరో)
అనూష ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ మరియు శంకర నేత్రాలయం వారు సంయుక్తంగానిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరం గత నాలుగు రోజులుగా వంగూరు మండలం ఎల్లమ్మ రంగాపూర్ గ్రామంలోవిజయవంతంగా కొనసాగుతుంది. గత నాలుగు రోజుల నుంచి ప్రారంభమైన ఈ శిబిరం కంటి వైద్యం కొరకు వచ్చే ప్రజలకు పరీక్షలు నిర్వహించి మంగళవారం అవసరమైన వారికి ఆపరేషన్ చేస్తున్న నేపథ్యంలో.. అనూష ప్రాజెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ అండపల్లి రామకృష్ణారెడ్డి, వైద్య శిబిరాన్ని సందర్శించి వైద్యం కొరకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని శంకర నేత్రాలయ సిబ్బందికి ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పెద్దలు గోవర్ధన్ రెడ్డి, శంకర నేత్రాలయ కోఆర్డినేటర్ బైరం రాజు, మల్లయ్య, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ సభ్యుడు రేనయ్య, తరుణ్ రెడ్డి, రామాంజనేయులు, హరీష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు★



ప్రైవేట్ టీచర్ సమస్యలను పరిష్కరించాలని మంత్రికి వినతి

వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్.పానగల్ మండల కేంద్రంలో చేయూత పెన్షన్ పంపిణీకి హాజరైన తెలంగాణ పర్యాటక& ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు శ్రీ జూపల్లి



కృష్ణారావుకి తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ &లెక్చరర్స్ సంఘం ఆధ్వర్యంలో డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.టిపిటిఎల్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు హుస్సేన్, పరమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రైవేటు విద్యాసంస్థల్లో అనేకమంది టీచర్స్ మరియు లెక్చరర్స్ చాలీచాలని వేతనాలతో వెట్టి చాకిరి చేస్తూ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిస్తు విజ్ఞానజ్యోతులను వెలిగిస్తూ ప్రైవేట్ టీచర్స్ బతుకులు అంధకారంలో కొనసాగుతున్నా యని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న టీచర్స్& లెక్చరర్ సంక్షేమానికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి భరోసా ఇవ్వాలని, ప్రైవేట్ టీచర్స్ కు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, గుర్తింపు కార్డులు

ఆర్ట్ గ్యాలరీ పనులు త్వరగా పూర్తి చేయాలి: కలెక్టర్

వచ్చే నెలలో పీవీ విజ్ఞాన కేంద్రం ప్రారంభం

భీమదేవరపల్లి నవంబర్ 17 ప్రజా జ్యోతి:
మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పేరిట వంగరలో నిర్మిస్తున్న పీవీ విజ్ఞాన కేంద్రం అభివృద్ధి పనులను హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మంగళవారం పరిశీలించారు. ఫొటో గ్యాలరీ, మ్యూజియం,



సమావేశ మందిరం, ఆర్ట్ గ్యాలరీతో పాటు ప్రాంగణాన్ని సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారు. ఆర్ట్ గ్యాలరీ పనులు, పీవీ విగ్రహ ఏర్పాటు, సీసీ కెమెరాలు, విద్యుత్ దీపాల పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రాంగణంలోని మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నెలాఖరులోగా అన్ని పనులు పూర్తి చేసి, వచ్చే నెలలో ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సృజన, కుడా సీపీఓ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్‌రావు, తహసీల్దార్ రాజేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వైద్యంతో సంపూర్ణ ఆరోగ్యం.. ఆరోగ్యకరమైన జీవనశైలికి ప్రాధాన్యత

నేడు జాతీయ ప్రకృతి వైద్య దినోత్సవం

పర్వతగిరి, నవంబర్ 17 (ప్రజాజ్యోతి):
ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో ఆరోగ్య పరిరక్షణ ప్రతి ఒక్కరికీ అత్యంత అవసరమని, ప్రకృతికి అనుగుణమైన జీవన విధానాన్ని అలవర్చుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని సొంతం చేసుకోవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ప్రతి సంవత్సరం నవంబర్ 18న జాతీయ ప్రకృతి వైద్య దినోత్సవాన్ని నిర్వహిస్తున్న సందర్భంగా ప్రకృతి వైద్యం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, యోగా, వ్యాయామం, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ప్రకృతి వైద్యం అనేది శరీరం సహజంగా ఆరోగ్యాన్ని కాపాడుకునే సామర్థ్యానికి తోడ్పడే విధానం. సమతుల్య ఆహారం తీసుకోవడం, తగినంత నీరు తాగడం, ప్రతిరోజూ వ్యాయామం చేయడం, యోగా, ధ్యానం చేయడం, తగినంత నిద్రపోవడం వంటి అలవాట్లు ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తాయి. పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, పీచు పదార్థాలు అధికంగా ఉండే ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వాలి. అధిక ఉప్పు, చక్కెర, కొవ్వు పదార్థాలు, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలి. ముఖ్యంగా మారుతున్న ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ తగ్గడం, మానసిక ఒత్తిడి కారణంగా చిన్న వయసులోనే మధుమేహం, రక్తపోటు, ఊబకాయం వంటి సమస్యలు పెరుగుతున్నాయి. వీటిని నివారించేందుకు రోజువారీ జీవనశైలిలో ఆరోగ్యకరమైన మార్పులు చేసుకోవాలి. అనారోగ్య లక్షణాలు కనిపించినప్పుడు వైద్యులను సంప్రదించి తగిన చికిత్స పొందాలి. ప్రకృతి వైద్యం పేరుతో వైద్యులు సూచించిన మందులను నిలిపివేయకూడదు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రకృతి వైద్యం, యోగా, ఆరోగ్యకరమైన జీవన విధానంపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే నినాదాన్ని ఆచరణలో పెడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచిస్తున్నారు.

గోరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గో పూజ మహోత్సవం

పర్వతగిరి, నవంబర్ 17 (ప్రజాజ్యోతి):
విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో పర్వతగిరి శ్రీ



వేణుగోపాల స్వామి దేవాలయంలో గో పూజ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఫణి శర్మ మాట్లాడుతూ గోమాత ముక్కోటి దేవతల నిలయమని, భారతీయ సంస్కృతిలో గోవుకు విశిష్ట స్థానం ఉందని అన్నారు. వి హెచ్ పి అధ్యక్షులు గుడ్ల శ్రీధర్, కార్యదర్శి పోలోజు శ్రీనివాసచారి మాట్లాడుతూ గోరక్షణ ప్రతి హిందువు బాధ్యతని, గోవును పూజించడమే కాకుండా వాటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బజరంగ్ దళ్ నాయకులు, కార్యకర్తలు, గోసేవకులు తదితరులు పాల్గొన్నారు.

కాట్రపల్లి గ్రామంలో శతాధిక వృద్ధురాలు మృతి

పరామర్శించిన యువ నాయకుడు రాపాక ప్రశాంత్

రాయపర్తి నవంబర్ 17 ప్రజా జ్యోతి:
కాట్రపల్లి గ్రామానికి చెందిన ఖాజాబీ (శతాధిక వృద్ధురాలు (110)సంవత్సరాలు మంగళవారంస్వర్గస్తులైనారు. వారి పార్థివదేహానికి రాపాక ప్రశాంత్ నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతి తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్రత్యేక వైద్య శిబిరాలు

అర్హులందరికీ అందేలా చర్యలు: మంత్రి పొన్నం ప్రభాకర్

హనుమకొండ జిల్లా ప్రతినిధి,
నవంబర్ 17, (ప్రజా జ్యోతి):
హుస్నాబాద్ నియోజకవర్గంలోని దివ్యాంగులు,



వయోవృద్ధులకు అవసరమైన సహాయక ఉపకరణాలను ఉచితంగా అందించేందుకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయక పరికరాలు అందించడమే లక్ష్యమన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ఎస్ఎంఆర్ గార్డెన్స్‌లో అలింకో సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన నిర్ధారణ వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దివ్యాంగులు, వృద్ధులతో మంత్రి ఆప్యాయంగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. వైద్య పరీక్షల కేంద్రాలను పరిశీలించి, లబ్ధిదారులకు స్వయంగా పరీక్షలు చేయించారు. ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా పరీక్షించి వారికి అవసరమైన ఉపకరణాలను గుర్తించాలని నిర్వాహకులకు సూచించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఏడు మండలాలు, మున్సిపాలిటీలో ఈ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఎల్కతుర్తిలో మంగళవారం ప్రారంభించామని, 18న భీమదేవరపల్లి, 20న కోహెడ, 21న చిగురుమామిడి మండలాల్లో శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. 25, 26, 27 తేదీల్లో హుస్నాబాద్ మండలం, పట్టణంలో శిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం అక్కన్నపేట మండలంలోనూ శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు.వైద్య పరీక్షల అనంతరం అర్హతను బట్టి కృత్రిమ కాళ్లు, చేతులు, వినికిడి యంత్రాలు, చంక కర్రలు, చేతి కర్రలు, వీల్‌చైర్లు, మూడు చక్రాల వాహనాలు తదితర ఉపకరణాలను ఉచితంగా అందజేస్తామన్నారు. గ్రామాల నుంచి లబ్ధిదారులను శిబిరాలకు తీసుకురావడంతోపాటు పరీక్షల అనంతరం తిరిగి గ్రామాలకు చేర్చే బాధ్యతను అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. ఇప్పటికే అర్హులకు ఏడు రకాల పెన్షన్లు మంజూరు చేశామని, సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రతి ఒక్కరికీ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

ఒకటి, రెండు నెలల్లో ఉపకరణాల పంపిణీ:
జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ శిబిరాల్లో నిర్వహించే వైద్య పరీక్షల ఆధారంగా లబ్ధిదారులకు అవసరమైన ఉపకరణాలను గుర్తించి ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. వీటిని ఒకటి, రెండు నెలల్లో అందుబాటులోకి తీసుకొచ్చి గ్రామాల్లో పంపిణీ చేస్తామన్నారు.



అంగన్‌వాడీ టీచర్ల సహకారంతో అర్హులైన వారిని శిబిరానికి తీసుకొచ్చినట్లు వివరించారు. ఇప్పటివరకు హాజరుకాలేకపోయిన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఈ నెల 22, 23 తేదీల్లో హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో చివరి విడత ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులైన దివ్యాంగులు, వృద్ధులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, డీఆర్డీఓ పీడీ శ్రీను, జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, అలింకో సంస్థ ప్రతినిధులు, జిల్లా అధికారులు, సర్పంచులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించాలి

బేసిక్ ఇంగ్లిష్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ఎల్కతుర్తి గురుకుల పాఠశాలలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకస్మిక తనిఖీ

హన్మకొండ జిల్లా ప్రతినిధి, నవంబర్ 17, (ప్రజా జ్యోతి):
విద్యార్థినులకు నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికాహారం అందించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఉపాధ్యాయులు, అధికారులను





ఆదేశించారు. ప్రతి విద్యార్థిని బేసిక్ ఇంగ్లిష్‌లో మాట్లాడేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మంగళవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థినుల సంఖ్య, ఉపాధ్యాయుల హాజరు తదితర వివరాలను పరిశీలించారు. ఇంటర్మీడియట్ విద్యార్థినులతో నేరుగా మాట్లాడి ప్రతిరోజూ అల్పాహారం, భోజనం నాణ్యతగా అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. గత ఏడాది మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచిన తర్వాత నాణ్యమైన భోజనంతోపాటు అన్ని సౌకర్యాలు అందుతున్నాయని విద్యార్థినులు మంత్రికి వివరించారు.గత విద్యా సంవత్సరంలో సాధించిన మార్కుల వివరాలను అడిగి తెలుసుకున్న మంత్రి.. ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. చదువుతోపాటు క్రీడలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ ప్రతిభ కనబర్చాలన్నారు. క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థినులను అభినందించారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటి పాఠశాలకు, రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని, వారి విజయాలు తల్లిదండ్రులు, కుటుంబం, గ్రామానికి గౌరవం తీసుకురావాలని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కీలకమని, వారి సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తూ అవసరమైన సౌకర్యాలు కల్పిస్తోందని మంత్రి తెలిపారు.ఈ తనిఖీలో స్థానిక సంస్థల జిల్లా ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, డీఆర్డీఓ మేన శ్రీను, ఎంపీడీఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వేరో ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

నియోజకవర్గ సమన్వయకర్త చాతల్ల వేణుగోపాల్

హసన్‌పర్తి,నవంబర్17(ప్రజాజ్యోతి):
ఈ నెల 22వ తేదీన హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించనున్న స్వేరో ఆత్మీయ సమ్మేళన



సభను విజయవంతం చేయాలని వర్ధన్నపేట నియోజకవర్గ సమన్వయకర్త చాతల్ల వేణుగోపాల్ పిలుపునిచ్చారు. మంగళవారం వర్ధన్నపేట నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు ఊరిబిండి ఓంకార్ యాదవ్ ఆధ్వర్యంలో హసన్‌పర్తి మండలంలోని అన్నాసాగర్, మడిపల్లి, జయగిరి గ్రామాల్లో నాయకులతో కలిసి సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా చాతల్ల వేణుగోపాల్ మాట్లాడుతూ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యదర్శిగా పనిచేసిన సమయంలో డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ ఎంతోమంది పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేశారని పేర్కొన్నారు. అట్టడుగు వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడంతోపాటు వారి భవిష్యత్తుకు బాటలు వేయాలనే లక్ష్యంతో, తనకు పోలీసు ఉన్నతాధికారిగా పదవీకాలం ఉన్నప్పటికీ స్వచ్ఛందంగా పదవికి రాజీనామా చేసి ప్రజాక్షేత్రంలోకి వచ్చారని తెలిపారు.నిరంతరం ప్రజల సమస్యలపై స్పందిస్తూ వారి గొంతుకగా పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఈ సమ్మేళనానికి అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మడిపల్లి సర్పంచ్ బుర్ర రంజిత్‌కుమార్ గౌడ్, జయగిరి మాజీ సర్పంచులు రాజకుమార్ ముదిరాజ్, రేణిగుంట్ల అశోక్, అన్నాసాగర్ మాజీ ఉపసర్పంచ్ బండ సాగర్‌రెడ్డి, పండ్యాల కుమారస్వామి గౌడ్, యువ నాయకులు కిషన్, మహేందర్, పోగుల విజయ్‌కుమార్, బాబు తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగునిస్తున్న జనతా ట్రస్ట్.. వాసవి మండపంలో 1,625 మందికి పరీక్షలు

52 మందికి హైదరాబాద్‌లో ఉచిత ఆపరేషన్లకు ఏర్పాట్లు

నెక్కొండ, నవంబర్ 17(ప్రజా జ్యోతి):
మండల కేంద్రంలోని శ్రీ వాసవి కళ్యాణ మండపంలో జనతా ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన 6వ విడత ఉచిత కంటి వైద్య శిబిరం ఘన విజయం సాధించింది. ట్రస్ట్ చైర్మన్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజలు పెద్ద సంఖ్యలో క్యూ కట్టి పరీక్షలు చేయించుకున్నారు.మొత్తం 1,625 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వందలాది మందికి అద్దాలు పంపిణీ చేశారు. కంటిశుక్లాలు ఉన్నట్లు గుర్తించిన 52 మందిని మెరుగైన ఆపరేషన్ల నిమిత్తం హైదరాబాద్ తరలించి ప్రత్యేక మార్గదర్శకత్వం అందించారు.సర్వేంద్రియానాం నయనం ప్రధానమని, నర్సంపేట నియోజకవర్గంలో ఏ ఒక్కరూ కంటి సమస్యలతో బాధపడకూడదనే ఉద్దేశంతోనే ఈ శిబిరాలు నిర్వహిస్తున్నామని రాణా ప్రతాప్ రెడ్డి



తెలిపారు. పేద ప్రజలకు నిరంతరం సేవనందించడమే జనతా ట్రస్ట్ లక్ష్యమని, భవిష్యత్తులో మండలంలోని ప్రతి గడపకూ ఈ సేవలను విస్తరిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కళ్యాణ మండపాన్ని ఉచితంగా అందించిన నెక్కొండ ఆర్యవైశ్య సంఘంతో పాటు మారం రాము, దొడ్డ నాగేష్, తాటిపెల్లి శివకుమార్, దొడ్డ విజయ్, తాళ్లూరి నరసింహులు, కొనిశెట్టి బిక్షపతి, నాయిని అశోక్, దామచర్ల రామారావు, అంబాల రాంగోపాల్, రాంపల్లి రాజగోపాల్, శ్రీరంగం సాగర్, అంబాల సుధీర్, పసుల అశోక్, సింగారపు సురేష్, సింగారం శ్రీరాములు, శ్రీనివాస్, నీలం ఏలేందర్, లౌడియా శ్రీనివాస్, జమ్ముల సుధాకర్, మల్లం మల్లేష్, కుడికాల సుధీర్, పోయాడ అనిల్, జయప్రకాష్, శ్రీనివాస్ గౌడ్ శెట్టి, సూత్రం శీను, రాజు, బల్లికొండ పవన్, కుడికాల శ్రీధర్ తదితరులు, శంకర కంటి ఆసుపత్రి వైద్య బృందం, జనతా ట్రస్ట్ సభ్యులు, మండల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

యాసంగిలో వరి సాగు తగ్గించాలి.. ఆరుతడి పంటలే మేలు

పర్వతగిరి, నవంబర్ 17 (ప్రజాజ్యోతి):
ఎల్‌నినో ప్రభావంతో రానున్న యాసంగి సీజన్‌లో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు వరి సాగును తగ్గించి పెసర, మినుము, కంది, జొన్న, రాగి, నువ్వులు, వేరుశనగ వంటి ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని వరంగల్ జిల్లా ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్





విజయనిర్మల సూచించారు. మంగళవారం పర్వతగిరి మండలంలోని ఏనుగల్లు, దుబ్బతండా గ్రామాల్లో ఏడీఏ నర్సింగంతో కలిసి ఆమె పర్యటించి రైతులకు అవగాహన కల్పించారు. భూగర్భ జలాలు అడుగంటుతున్న నేపథ్యంలో నీటి వినియోగాన్ని తగ్గించే పంటలను ఎంచుకోవాలని కోరారు. పంట అవశేషాలను కాల్చకుండా భూసారాన్ని కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శశికాంత్, ఏఈఓలు, సర్పంచ్ తిరుపతి, రైతులు పాల్గొన్నారు.

మూగజీవంపై రైతు ఆత్మీయత.. కంటతడి పెట్టించిన అంతిమ వీడ్కోలు..!

-తిమ్మాపురంలో లేగదూడకు శాస్త్రోక్తంగా అంత్యక్రియలు

సంగెం,నవంబర్17(ప్రజాజ్యోతి):
మూగజీవాల పట్ల ఒక రైతు చూపిన ఆత్మీయత అందరినీ కంటతడి పెట్టించింది. తన ఇంట్లో కుటుంబ సభ్యుడిలా పెంచుకున్న లేగదూడ అనారోగ్యంతో మృతి చెందడంతో చలించిపోయిన ఆ రైతు,





మనుషులకు నిర్వహించినట్లే శాస్త్రోక్తంగా దహన సంస్కారాలు జరిపించారు. ఈ హృదయ విదారక ఘటన వరంగల్ జిల్లా సంగెం మండలం తిమ్మాపురం గ్రామంలో చోటుచేసుకుంది.
గ్రామానికి చెందిన రైతు మెంత్తుల రజినీకాంత్ తన ఇంట్లో ఒక లేగదూడను ఎంతో ప్రేమగా పెంచుకుంటున్నారు. ఇటీవల ఆ లేగదూడ అనారోగ్యానికి గురై మృతి చెందింది. దీంతో తీవ్ర ఆవేదనకు గురైన రజినీకాంత్, దానిని సాధారణంగా పారవేయకుండా తన కుటుంబ సభ్యుడిగా భావించి అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. జేసీబీ సహాయంతో ప్రత్యేకంగా గొయ్యి తీయించి, మానవులకు ఏ విధంగా అయితే దహన సంస్కారాలు నిర్వహిస్తారో అదే పద్ధతిలో ఆ లేగదూడకు అంతిమ సంస్కారాలు పూర్తి చేశారు. మూగజీవి పట్ల రజినీకాంత్ చూపిన ప్రేమ, అనుబంధాన్ని చూసి గ్రామస్తులు సైతం భావోద్వేగానికి లోనయ్యారు.

కాంగ్రెస్ దొంగ హామీలకు నేటితో మూడేళ్లు

ఆరు గ్యారెంటీలు.. 420 హామీలు.. అమలులో మాత్రం శూన్యం : దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్

దేవరకొండ, నవంబర్ 17,(ప్రజా జ్యోతి) :
కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని దేవరకొండ మాజీ శాసనసభ్యులు,బీఆర్ఎస్ నాయకులు రమావత్ రవీంద్ర కుమార్ తీవ్రస్థాయిలో విమర్శించారు. మంగళవారం దేవరకొండ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ



కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు.ఈ సందర్భంగా రవీంద్ర కుమార్ మాట్లాడుతూ.. 2023 నవంబర్ 17న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన అభయహస్తం మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌తో సమానమని ప్రకటించిన కాంగ్రెస్ నాయకులు, అందులో పేర్కొన్న ప్రతి హామీని అమలు చేస్తామని ప్రజలకు భరోసా ఇచ్చారని గుర్తుచేశారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, వంద రోజుల్లోనే హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి నేటికీ కాలయాపన చేస్తోందని మండిపడ్డారు.62 ప్రధాన అంశాలతో 42 పేజీల్లో రూపొందించిన అభయహస్తం మేనిఫెస్టోలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, కౌలు రైతులకు ఆర్థిక సాయం, వ్యవసాయ కూలీలకు భరోసా, వరికి రూ.500 బోనస్, తొలి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి అనేక హామీలు ఇచ్చారని తెలిపారు. అయితే వాటిలో అనేక హామీలు పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదని విమర్శించారు. గొప్పగా ప్రచారం చేసుకున్న అభయహస్తం నేడు శూన్యహస్తంగా మారిందని ఎద్దేవా చేశారు.తొలి క్యాబినెట్ సమావేశంలోనే ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పటివరకు 38 క్యాబినెట్ సమావేశాలు జరిగినా ఆ హామీని ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు. గాంధీభవన్ సాక్షిగా తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాటను ఎందుకు నిలబెట్టుకోలేకపోయారో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మేనిఫెస్టో కమిటీ చైర్మన్ శ్రీధర్ బాబు, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.
మహిళలకు నెలవారీ ఆర్థిక సాయం, పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెంచిన పింఛన్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల ఆరోగ్య బీమా వంటి హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. నిరుద్యోగ యువతకు నెలకు రూ.4 వేల భృతి, జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ, ప్రతి సంవత్సరం రెండు లక్షల ఉద్యోగాల భర్తీ వంటి హామీల సంగతేంటని ప్రశ్నించారు.
విద్యారంగంలో విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, ప్రతి మండలంలో అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠశాలలు, ఫీజు రీయింబర్స్‌మెంట్,స్కాలర్‌షిప్‌ల పెంపు వంటి హామీలను కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఐదేళ్లలో బీసీ సంక్షేమానికి రూ.లక్ష కోట్లు, బీసీ సబ్‌ప్లాన్‌కు చట్టబద్ధత వంటి హామీలను నెరవేర్చాలని అన్నారు.గౌడ, ముదిరాజ్, మత్స్యకారులు, గొర్రెల కాపరులు, చేనేత కార్మికులు, చేతివృత్తుల వారికి ఇచ్చిన హామీలను సైతం ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. రెండో విడత గొర్రెల పంపిణీ, గీత కార్మికులకు ఈత చెట్ల పెంపకానికి భూమి, 90 శాతం సబ్సిడీ, గౌడలకు మద్యం దుకాణాల లైసెన్సుల్లో 25 శాతం రిజర్వేషన్ వంటి హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు.ప్రజల ఆశలను ఓట్లుగా మార్చుకుని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఆ తర్వాత హామీలను విస్మరించడం ప్రజలను వంచించడమేనని రవీంద్ర కుమార్ అన్నారు. గాంధీ పేరు చెప్పుకుని రాజకీయాలు చేసే కాంగ్రెస్ పార్టీ, గాంధీభవన్ సాక్షిగా ఇచ్చిన హామీలను కూడా అమలు చేయక పోవడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ మాయమాటలను తెలంగాణ ప్రజలు ఇప్పటికే గుర్తించారని, రాబోయే రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని తక్షణమే అమలు చేయాలని, మాటలతో కాలయాపన చేయకుండా ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హామీల అమలులో జాప్యం చేస్తే ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు టీవీఎన్ రెడ్డి, రమావత్ దాస్రు నాయక్, మాజీ వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్, మాజీ జడ్పీటీసీ బోయపల్లి శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నీల రవికుమార్, గాజుల రాజేష్, బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు, ముత్యాల రవికుమార్, బీఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ, సర్పంచులు ఆడారపు హరికృష్ణ, బషీర్, కార్మిక విభాగం రాష్ట్ర నాయకులు ఎండీ జనీబాబా, యువజన విభాగం రాష్ట్ర నాయకులు ఇలియాస్ పటేల్, మకాం చంద్రమౌళి, మాడెం రాములు, ఆఫ్రోజ్, వంగూరి పాపయ్య గౌడ్, గుండాల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే బిఎల్ఆర్

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళా రైతు లను తన కారులో ఆసుపత్రికి తరలింపు

మిర్యాలగూడ, నవంబర్ 17,(ప్రజాజ్యోతి):
అధికారిక హంగు, ఆర్భాటం కన్నా... మానవత్వమే మిన్న అని మరోసారి నిరూపించాడు మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్).





మంగళవారం మిర్యాలగూడ మండలం కిష్టాపురం గ్రామ శివారు అద్దంకి – నార్కట్ పల్లి రహదారి పై జరిగిన రోడ్డు ప్రమాదం లో దామరచర్ల మండలం బొల్లిగుట్ట తండాకు చెందిన రైతు ధాన్యం ట్రాక్టర్ ను మిర్యాలగూడ రైస్ మిల్లుకు తీసుకువస్తుండగా, అదే దారిలో వస్తున్న టిప్పర్ లారీ వెనక నుండి ట్రాక్టర్ను ఢీ కొట్టడంతో ధాన్యం ట్రాక్టర్ బోల్తా పడటం జరిగింది. ట్రాక్టర్ ఇంజన్ పై ప్రయాణిస్తున్న మహిళ రైతు పాప డాక్టర్ నుండి కింద పడటంతో బలమైన గాయం తగిలింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్రమాదం జరిగిన తీరును క్షతగాత్రులను అడిగి తెలుసుకుని వెంటనే తన అనుచరుల సాయం తో తన సొంత వాహనంలో గాయపడిన రైతులను మిర్యాలగూడ ప్రభుత్వం ఏరియా ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య చికిత్స అందజేయాలని డాక్టర్లను కోరారు. ప్రమాదానికి కారణమైన వాహనంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని పోలీసుకు సూచించారు.ఆపదలో ఎమ్మెల్యే బిఎల్ఆర్ స్పందించిన తీరుపై నియోజకవర్గంలో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

లిడ్ క్యాప్ భూములను కాపాడాలి

మందకృష్ణ మాదిగ
ఎమ్మెల్యే వేముల వీరేశంను కలిసి విజ్ఞప్తి

నార్కట్ పల్లి, నవంబర్ 17 (ప్రజా జ్యోతి):
గచ్చిబౌలి రాయదుర్గంలోని లిడ్ క్యాప్ భూములను కాపాడాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ నకిరేకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వేముల వీరేశంను కోరారు. చిట్యాల మండలంలోని



మదర్ డెయిరీ గెస్ట్ హౌస్‌లో ఎమ్మెల్యే వేముల వీరేశంను మంద కృష్ణ మాదిగ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గచ్చిబౌలి రాయదుర్గంలోని లిడ్ క్యాప్ భూములకు సంబంధించి పలు అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. లిడ్ క్యాప్‌కు చెందిన ఆరున్నర ఎకరాల భూమిని యూనిట్ మాల్ కోసం రాష్ట్ర ప్రభుత్వానికి కేటాయించడాన్ని వెంటనే రద్దు చేయాలని, అలాగే పెట్రోల్ బంక్, ఈవీ ఛార్జింగ్ స్టేషన్ కోసం కేటాయించిన మూడున్నర ఎకరాల భూముల కేటాయింపులను కూడా రద్దు చేసేలా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లిడ్ క్యాప్‌కు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, కార్పొరేషన్ అభివృద్ధికి ప్రత్యేక కమిటీని నియమించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే వేముల వీరేశం స్పందిస్తూ, మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలందరితో సమావేశం ఏర్పాటు చేసి, ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. లిడ్ క్యాప్ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.
ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోవింద్ నరేష్ మాదిగ, ఎంఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఇంజన్ వెంకటస్వామి మాదిగ, ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి కోళ్ల శివ మాదిగ, రాష్ట్ర సమన్వయకర్త జానకిరామ్ చౌదరి, ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు ఇరిగి శ్రీశైలం మాదిగ, మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బోడ సునీల్ మాదిగ, కొమిరె స్వామి మాదిగ, ఎరసాని గోపాల్ మాదిగ, మాచర్ల సుదర్శన్ మాదిగ, వంగూరు ప్రసాద్ మాదిగ, పెరిక లింగస్వామి మాదిగ, నోముల పురుషోత్తం మాదిగ, మేడి కృష్ణ మాదిగ, పొలిమేర దశరథ మాదిగ, నక్క కృష్ణ మాదిగ, చింత శివశంకర్ మాదిగ, వెంకటయ్య మాదిగ, పాలకృష్ణ మాదిగ, జిట్టా రవి మాదిగ, గాదె రాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డ వివాహానికి రూ.50 వేల ఆర్థిక సహాయం

వధూవరులను ఆశీర్వదించిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నేనావత్ కిషన్ నాయక్

దేవరకొండ, నవంబర్ 17, (ప్రజా జ్యోతి) :
పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ సామాజిక సేవా కార్యక్రమాల్లో తనవంతు సహకారం అందిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నేనావత్ కిషన్ నాయక్ మరోసారి ఆర్థిక సహాయం అందించారు. దేవరకొండ మండలం కర్నాటిపల్లి గ్రామానికి చెందిన జాజాల బుచ్చయ్య కుమార్తె పూజ వివాహం సందర్భంగా వారి కుటుంబ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని రూ.50,000 (యాభై వేల రూపాయలు) ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నల్లమాద తిరుపతిరెడ్డి, నేనావత్ రమేష్ నాయక్, ఆంగోత్ సంతోష్ నాయక్, చిత్రం రమేష్, కొర్ర నరేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



అందుబాటులో కస్టమ్ హైరింగ్ సెంటర్ లు

మునగాల నవంబర్17(ప్రజా జ్యోతి):
కేంద్ర ప్రభుత్వం మరియు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా



వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా కస్టమ్ హైరింగ్ సెంటర్లను ప్రవేశపెట్టినట్టు మండల వ్యవసాయ అధికారి రాజు తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, శ్రీ శక్తి సమభావన సంఘాలు, రైతు ఉత్పత్తి సంఘాలు ఈ పథకానికి అర్హులని ఈ కస్టమ్ హైరింగ్ సెంటర్ యాంత్రికరణ పథకంలో రైతులకు కావాల్సిన పరికరాలు సబ్సిడీపై పొంది, వాటిని కిరాయికి ఇచ్చి సంఘాల తో పాటు రైతులు తక్కువ కిరాయి ఖర్చుతో అభివృద్ధి చెందాలి అనేది ముఖ్య ఉద్దేశమని అన్నారు ఈ పథకంలో తీసుకునే పనిముట్లకు 40 శాతం లేదా గరిష్టంగా 20 లక్షల సబ్సిడీ వర్తిస్తుంది. ట్రాక్టర్ లు, రోటోవేటర్ లు, హార్వెస్టర్ లు, గడ్డి కట్టే మెషీన్లు, వడ్లు ఎండబెట్టే డ్రయర్ లు, గట్లు వేసే మెషిన్ లు, మొదలగు 34 రకాల యంత్రాలలో కావలసినవి మాత్రమే, ఎన్ని అయినా తీసుకోవచ్చని మునగాల రైతు వేదికలో మండలంలోని 4



సహకార సంఘాల అధ్యక్షులు, సభ్యులు, సెక్రటరీలకు, గ్రామ, మండల సమభావన సంఘాల అధికారులు, సభ్యులకు, రైతు ఉత్పత్తి సంఘాల సభ్యులకు అవగాహన కల్పించడం జరుగుతుందని మరిన్ని వివరాలకు వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించగలరని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మునగాల సహకార సంఘం అధ్యక్షులు కందిబండ సత్యనారాయణ, కొక్కిరేణి సహకార సంఘ అధ్యక్షులు చంద్రయ్య, కరుణాకర్, బసవయ్య, శ్రీనివాస్, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు..

నూతనకల్, నవంబర్ 17 (ప్రజా జ్యోతి):
మండల పరిధిలోని దిర్శనపల్లి గ్రామానికి చెందిన తూటి సోమిరెడ్డి (55) కి మంగళవారం రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల య్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సోమిరెడ్డి తన వ్యవసాయ భూమిని పరిశీలించేందుకు (టీవీఎస్ ఎక్సెల్ టీజీ 29 డి 924) నెంబర్ గల మోటార్ సైకిల్ పై వెళుతుండగా 65 వ జాతీయ రహదారి పై మహబూబాబాద్ వైపు వెళుతున్న టీఎస్ 26 జి 26 26 నెంబర్ గల హుండాయ్ క్రెటా కారు అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చి ఆయన ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో సోమిరెడ్డికి తీవ్ర రక్త గాయాలయ్యాయని వారు తెలిపారు.చికిత్స నిమిత్తం బాధితుని 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు.ఢీకొన్న కారు అదుపుతప్పి ఆ రోడ్డుపై పల్టీలు కొట్టగా కారు డ్రైవర్ కు గాయాలైనట్లు వారు తెలిపారు. ఈ ఘటనపై బాధితుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.



కట్టంగూరులో కాంగ్రెస్ వర్గపోరు.. మహిళా సర్పంచ్‌కు వేధింపులా?

పది నెలలైనా తగ్గని రాజకీయ ఆధిపత్య పోరు..
మహిళా సర్పంచ్ కు ప్రోటోకాల్ లేదా?
అభివృద్ధి నిధులకు అడుగడుగునా అడ్డంకులేనా?
అధికార పార్టీలోనే మహిళా సర్పంచ్‌కు ఇన్ని అవమానాలా?
కలెక్టర్‌ను ఆశ్రయించినా కొలిక్కిరాని సమస్య.. పింఛన్ ఉత్తర్వుల పంపిణీలో మరో వివాదం..
కోమటిరెడ్డి- వేముల వీరేశం వర్గాల మధ్య ఆధిపత్య పోరే కారణమా?
అధికారుల మౌనంపై స్థానికుల ప్రశ్నలు..
ప్రజా ప్రతినిధుల మధ్య విభేదాలకు గ్రామాభివృద్ధి పింఛన్ లబ్ధిదారులు బలి కావాలా?

నల్గొండ నవంబర్ 17,(ప్రజాజ్యోతి) :
అధికార పార్టీలోనే ఉన్నా,అధికారికంగా గ్రామానికి ప్రథమ పౌరురాలైనా.. మహిళా సర్పంచ్‌కు మాత్రం అడుగడుగునా అవరోధాలే ఎదురవుతున్నాయనే



ఆరోపణలు కట్టంగూరు మండలంలో రాజకీయ చర్చకు దారితీస్తున్నాయి. గ్రామాభివృద్ధి కోసం పనిచేయాల్సిన ప్రజాప్రతినిధికి సహకారం అందించాల్సిన చోట రాజకీయ వర్గపోరు, ప్రోటోకాల్ వివాదాలు, అభివృద్ధి పనుల బిల్లుల సమస్యలు తలెత్తుతున్నాయని సర్పంచ్ వర్గం ఆవేదన వ్యక్తం చేస్తోంది. కట్టంగూరు సర్పంచ్ ముక్కామల శ్యామల శేఖర్ బాధ్యతలు చేపట్టి పది నెలలు గడుస్తున్నా పరిస్థితిలో మార్పు రాకపోవడం చర్చనీయాంశంగా మారింది.

వర్గపోరుకు మహిళా సర్పంచ్ బలి?

కట్టంగూరు మండలంలో కాంగ్రెస్ పార్టీలో ముక్కామల శ్యామల శేఖర్‌కు ప్రాధాన్యత ఇవ్వకుండా ఉపసర్పంచ్‌తో ఉత్తర్వులు పంపిణీ



అంతర్గత విభేదాలు తీవ్రస్థాయిలో ఉన్నాయనే చర్చ స్థానికంగా సాగుతోంది. ముఖ్యంగా కోమటిరెడ్డి, వేముల వీరేశం వర్గాలకు చెందిన అనుచరుల మధ్య రాజకీయ ఆధిపత్య పోరు కొనసాగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ రాజకీయ విభేదాల ప్రభావం గ్రామస్థాయి పాలనపై పడుతోందని, దాని ఫలితంగా మహిళా సర్పంచ్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె వర్గీయులు ఆరోపిస్తున్నారు.
పార్టీ అంతర్గత రాజకీయాలను పక్కనపెట్టి గ్రామాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన నాయకులు, వ్యక్తిగత ఆధిపత్యానికి ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల చేత ఎన్నుకోబడిన సర్పంచ్ తన విధులను స్వేచ్ఛగా నిర్వహించుకునే పరిస్థితి లేకపోతే స్థానిక పాలన ఎలా సాగుతుందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

పింఛన్ల పంపిణీలో ప్రోటోకాల్ వివాదం :

ఇటీవల కట్టంగూరు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నూతన పింఛన్ల ఉత్తర్వుల పంపిణీ సందర్భంగా మరోసారి వివాదం తెరపైకి వచ్చింది. ఎమ్మెల్యే వేముల వీరేశం ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కార్యక్రమం ముగించుకుని వెళ్లిపోయిన అనంతరం మిగిలిన పింఛన్ ఉత్తర్వుల పంపిణీ విషయంలో వివాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. అక్కడే ఉన్న గ్రామ సర్పంచ్ చేయించడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో సర్పంచ్, ఉపసర్పంచ్ మధ్య వాగ్వాదం చోటుచేసుకుని పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. చివరకు పింఛన్ ఉత్తర్వుల పంపిణీ నిలిచిపోయింది. పేదలకు అందాల్సిన సంక్షేమ పథకాల పంపిణీ కూడా ప్రజాప్రతినిధుల మధ్య విభేదాలకు వేదిక కావడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సర్పంచ్‌కు గౌరవం ఏది? కార్యదర్శి బాధ్యత ఏమైంది?

గ్రామ పంచాయతీ పరిపాలనలో కీలకంగా వ్యవహరించాల్సిన పంచాయతీ కార్యదర్శి ఈ వివాదాన్ని నిబంధనల ప్రకారం పరిష్కరించాల్సి ఉన్నప్పటికీ, సరైన స్పష్టత ఇవ్వలేదని సర్పంచ్ వర్గం ఆరోపిస్తోంది. ప్రజాప్రతినిధుల మధ్య వివాదం తలెత్తినప్పుడు అధికారుల బాధ్యత మరింత పెరుగుతుంది. అలాంటప్పుడు నిబంధనల ప్రకారం వ్యవహరించి సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు మౌనంగా ఉండటానికి కారణాలేమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.
మహిళా ప్రజాప్రతినిధి అని కూడా చూడకుండా ఆమెకు తగిన గౌరవం ఇవ్వకపోవడం, విధుల నిర్వహణలో సహకరించకపోవడం ఎంతవరకు సమంజసమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

అభివృద్ధి పనుల బిల్లులకూ అడ్డంకులేనా?

మరోవైపు గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల విషయంలోనూ సమస్యలు ఎదురవుతున్నాయని సర్పంచ్ వర్గం ఆరోపిస్తోంది. పనులు చేసినప్పటికీ బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతోందని, సంబంధిత వ్యవహారాల్లో అడ్డంకులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. ఈ ఆరోపణల్లో వాస్తవమెంత? బిల్లుల చెల్లింపులో సాంకేతిక కారణాలున్నాయా? లేక రాజకీయ విభేదాల ప్రభావం ఉందా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.
గ్రామాభివృద్ధి కోసం పనిచేయాల్సిన సర్పంచ్‌కు అవసరమైన సహకారం అందకపోతే అభివృద్ధి పనులు ముందుకు ఎలా సాగుతాయని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు.

కలెక్టర్‌ను ఆశ్రయించినా ఫలితం శూన్యమేనా?

తనకు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని సర్పంచ్ ముక్కామల శ్యామల శేఖర్ ఇప్పటికే జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించినట్లు సమాచారం. అయినప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు మారలేదని ఆమె వర్గం ఆవేదన వ్యక్తం చేస్తోంది. జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి సమస్య వెళ్లినప్పటికీ మండలస్థాయిలో పరిష్కారం ఎందుకు లభించడం లేదన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.
ఒక మహిళా ప్రజాప్రతినిధి తన బాధ్యతలను నిర్వర్తించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే ఆరోపణలు వస్తున్నప్పుడు జిల్లా పంచాయతీ అధికారులు, ఎంపీడీవో స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వర్గపోరుకు ఫుల్‌స్టాప్ పెట్టేదెవరు?

కట్టంగూరు మండలంలో కొనసాగుతున్న రాజకీయ విభేదాలు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయ లోపం చివరకు గ్రామ ప్రజలపై ప్రభావం చూపుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ ఆధిపత్య పోరులో మహిళా సర్పంచ్ ఇబ్బందులు పడటం, అభివృద్ధి పనులకు ఆటంకాలు ఎదురవుతున్నాయనే ఆరోపణలు రావడం, పింఛన్ల వంటి సంక్షేమ కార్యక్రమాల్లో వివాదాలు తలెత్తడం పాలనా వ్యవస్థ పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.జిల్లా కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకుని సర్పంచ్ ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్ర విచారణ జరపాలని, ప్రోటోకాల్ వివాదానికి నిబంధనల ప్రకారం పరిష్కారం చూపాలని, అభివృద్ధి పనుల బిల్లుల వ్యవహారాన్ని పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు.ప్రజల కోసం ఎన్నికైన ప్రజాప్రతినిధుల మధ్య ఆధిపత్య పోరు ఎందుకు? మహిళా సర్పంచ్‌కు విధుల నిర్వహణలో ఎదురవుతున్న అడ్డంకులను తొలగించాల్సిన బాధ్యత అధికారులకు లేదా? రాజకీయ విభేదాల మధ్య గ్రామాభివృద్ధి, పేదల సంక్షేమం బలికావాలా? కట్టంగూరులో నెలకొన్న ఈ పరిస్థితికి జిల్లా యంత్రాంగం ఎప్పుడు ముగింపు పలుకుతుందో వేచి చూడాల్సిందే.

జీపీఓ మీసాల రవీందర్ ఆకస్మిక మృతి

● విషాదంలో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు





ఇందల్వాయి(ప్రజా జ్యోతి) నవంబర్. 17 ఇందల్వాయి మండలంలోని గౌరారం గ్రామ జీపీఓగా విధులు నిర్వహిస్తున్న మీసాల రవీందర్ మంగళవారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన మరణవార్తతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, సహచరులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జి. బాలయ్య మాట్లాడుతూ.. గత 12 నెలలుగా గౌరారం గ్రామ జీపీఓగా విధులు నిర్వహిస్తున్న రవీందర్ ప్రతి ఒక్కరితో ఆప్యాయంగా మాట్లాడుతూ, అందరితో కలిసిమెలిసి ఉండేవారని తెలిపారు. విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా ప్రతి పనిని తన సొంత పనిగా భావించి బాధ్యతగా నిర్వహిస్తూ మంచి పేరు సంపాదించుకున్నారని కొనియాడారు. రవీందర్ స్వస్థలం వన్నెలబి గ్రామమని, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే ఆయన ఆకస్మిక మరణం ఎంతో బాధాకరమని బాలయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి విషాదకర సంఘటన మరెవరి కుటుంబంలోనూ చోటుచేసుకోకూడదని, రవీందర్ మృతి ప్రతి ఒక్కరినీ తీవ్ర దుఃఖానికి గురిచేసిందని తహసీల్దార్ జి. బాలయ్య విచారం వ్యక్తం చేశారు.

ప్రతి ఇంటికి ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలి

● ఎంపీడీవో అనంతరావు



ఇందల్వాయి (ప్రజా జ్యోతి) నవంబర్. 17 ఇందల్వాయి: మండలంలోని చంద్రాయన్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలో జల సంరక్షణ కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో అనంతరావు ఈరోజు ఆకస్మికంగా పర్యటించి ఇంకుడు గుంతల ఏర్పాటుపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అనంతరావు మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన ప్రతి ఇంటి వద్ద తప్పనిసరిగా ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకునేందుకు గ్రామపంచాయతీ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, సర్పంచ్ సహకారంతో వాటిని ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. మంచినీటిని వృథా చేయకుండా ప్రతి నీటి బొట్టును సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ఇంకుడు గుంతల ద్వారా వర్షపు నీటిని భూమిలోకి ఇంకించి భూగర్భ జలాలను పెంపొందించుకోవచ్చని వివరించారు. అనంతరం చంద్రాయన్‌పల్లి గ్రామంలో పర్యటించి, ఇదే విధంగా మండలంలోని ప్రతి గ్రామంలో జల సంరక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అరటి రఘు, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

రైతులు వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు వేయాలి

● మండల వ్యవసాయ అధికారి శోభ



ఎల్లారెడ్డి, నవంబర్ -17(ప్రజా జ్యోతి) ఎల్లారెడ్డి మండలంలోని జంగమయిపల్లి గ్రామంలో యాసంగిలో వరి పంటకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శోభ అన్నారు. మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితుల వలన బోరు బావులు, చెరువులు ఎండిపోయే ప్రమాదం ఉందని, కాబట్టి రైతులు వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలైన పెసర, మినుము, కంది, జొన్నలు, పొద్దుతిరుగుడు మొదలైన పంటలు వేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా తక్కువ నీరు ఉన్న బోరు బావుల వద్ద కూరగాయలు కూడా సాగు చేసుకోవచ్చని సూచించారు.ఏఈఓ రాజా గౌడ్ మాట్లాడుతూ ఖేత్ బచావో అభియాన్ లో భాగంగా రైతులు నేల సంరక్షణ కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఇంకుడు గుంతల తవ్వకాలు, సోక్ పిట్, పశువుల మేతకు సంబంధించి గడ్డి పెంపకం మొదలైన వాటి గురించి వివరించారు. హిందూస్తాన్ యూనిలివర్ కంపెనీ మేనేజర్ మనోజ్ రెడ్డి మాట్లాడుతూ రైతులు ఆయిల్ పామ్ చెట్ల పెంపకం చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జంగమయిపల్లి గ్రామ సర్పంచ్ రాములు, మత్మల్ సొసైటి సి.ఇ.ఓ పవన్ కుమార్, రాములు, ప్రవీణ్, పౌలు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలి

● కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జ్ షకీల్ మహమూద్

● సాలారే మిల్లత్ ఎడ్యుకేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ





ఎల్లారెడ్డి, నవంబర్ -17(ప్రజా జ్యోతి) విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత లక్ష్యాలను అధిరోహించాలని కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జ్ షకీల్ మహమూద్ అన్నారు.మంగళవారం ఎల్లారెడ్డి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎంఐఎం ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచడానికి 2005 నుండి ఎఐఎంఐఎం వ్యవస్థాపక అధ్యక్షుడు సుల్తాన్ సలావుద్దీన్ ఒవైసీ ఉర్దూ మీడియం విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ మెటీరియల్‌ను అందిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోని పేద విద్యార్థులు చదువుకోవడానికి వీలుగా, అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించేందుకు ఈ మెటీరియల్స్ ఉపయోగపడు తున్నాయన్నారు. విద్యార్థులందరూ శ్రద్ధగా చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. చదువుకు వయసుతో సంబంధం లేదని, విద్యార్థులు ఒక సబ్జెక్టును ఎంచుకుని దానిపై పట్టు సాధించాలన్నారు. ఉర్దూ మీడియం విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, వారి ఉన్నత చదువులకు ఎంఐఎం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ప్రతిభావంతుల కోసం నిర్వహించే యూపీఎస్సీ పరీక్షలు గానీ, రాష్ట్ర పరీక్షలు గానీ ఉర్దూలో కూడా నిర్వహిస్తున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తల్లిదండ్రులు, పెద్దల ఆశీర్వాదం ఉంటే జీవితంలో ఏదైనా సాధించవచ్చన్నారు. అనంతరం ఎల్లారెడ్డి ఎంఐఎం అధ్యక్షుడు అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ, సాలారే మిల్లత్ ఎడ్యుకేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో అందిస్తున్న ఆల్ ఇన్ వన్ మెటీరియల్ ద్వారా విద్యార్థులు చదువుకుని అధిక ఉత్తీర్ణత శాతాన్ని సాధించాలన్నారు.అనంతరం పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు కె. లింగమూర్తి మాట్లాడుతూ, విద్యార్థుల చదువు కోసం ఇలాంటి పుస్తకాలు అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఆల్ ఇన్ వన్ మెటీరియల్ విద్యార్థులకు పరీక్షల్లో ఎంతో ఉపయోగపడుతుందని, విద్యార్థులు దీన్ని సద్వినియోగం చేసుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్యార్థుల ఉన్నతికి ఉపాధ్యాయులు ఎల్లప్పుడూ తోడుగా ఉంటారని, పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం స్థానిక నాయకులతో కలిసి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ మెటీరియల్ అందించారు.ఈ కార్యక్రమంలో మహమ్మద్ షఫీ నిజామి, కలీముద్దీన్, మహమ్మద్ ఫరూక్, మహమ్మద్ సుమేరుద్దీన్, మహమ్మద్ ఇర్ఫాన్, ఎంఐఎం కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లిలో ఘనంగా గోపాష్టమి వేడుకలు



కమ్మర్‌పల్లి (ప్రజాజ్యోతి) నవంబర్ - 17 : విశ్వహిందూ పరిషత్ కమ్మర్‌పల్లి ప్రఖండ ఆధ్వర్యంలో మంగళవారం గోపాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గోవులను పూజించి, గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోవుల సంరక్షణ, ప్రాముఖ్యతను ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ హారిక, ఉపసర్పంచ్ అశోక్, జిల్లా ధర్మప్రసార ప్రముఖ్ వుట్నూర్ రాజశేఖర్, కమ్మర్‌పల్లి ప్రఖండ అధ్యక్షుడు భోగ రామస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. హిందూ సంప్రదాయంలో గోమాతకు విశిష్ట స్థానం ఉందని, గోవుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. గోసేవ ద్వారా సమాజంలో ధార్మిక భావనలు, ఆధ్యాత్మిక చింతన పెంపొందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మగ్గిడి లక్ష్మి, ఆమెటి నరేందర్, నల్ల గణేష్ గుప్తా, పసుపుల చంద్రమోహన్, భూషణ్ పెట్రోల్ బంక్ ప్రతినిధులు, సిలివేరి భూమేశ్వర్, సురుకుట్ల నరేష్, గుండోజి ప్రభాకర్, గుగ్గిలం కుటుంబ సభ్యులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి ప్రజా సమస్యలపై

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే మదన్ మోహన్



ఎల్లారెడ్డి, నవంబర్ -17(ప్రజా జ్యోతి) ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే మదన్ మోహన్ జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ను కలిసి 13 ప్రధాన ప్రజా సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల భవనాలకు స్థలాల కేటాయింపు, రైతుల భూ సమస్యలు, పట్టాదార్ పాస్‌బుక్‌ల జారీ, నకిలీ విత్తనాల నియంత్రణ, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు, పేదలకు ఇంటి స్థలాలు, జర్నలిస్టుల సంక్షేమం, కమ్యూనిటీ భవనాల నిర్మాణం తదితర అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.అలాగే రైతులకు మొక్కజొన్న, జొన్న కొనుగోలు పరిమితుల పెంపు, ఖాళీ రేషన్ షాప్ డీలర్ పోస్టుల భర్తీ, కొత్త మీ-సేవ కేంద్రాల ఏర్పాటు సహా మొత్తం 13 అంశాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల సమస్యలకు ప్రాధాన్యత ఇస్తూ, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని, ఎల్లారెడ్డి అభివృద్ధే తమ లక్ష్యమని ఎమ్మెల్యే మదన్ మోహన్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

13వ వార్డులో వితంతు, ఒంటరి మహిళలకు పింఛన్ కార్డుల పంపిణీ



సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా ప్రజాప్రతినిధులు కృషి చేస్తున్నారు. తాజాగా, సదాశివపేట 13వ వార్డు పరిధిలో అర్హులైన మహిళలకు వితంతు మరియు ఒంటరి మహిళల పింఛన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. తెలంగాణ ప్రభుత్వం పేద మరియు నిస్సహాయ మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు మంజూరు చేసిన వితంతు పింఛన్లు, ఒంటరి మహిళల పింఛన్లకు సంబంధించిన కార్డులను 13వ వార్డు కౌన్సిలర్ ఎర్ర విశాలి నాగరాజ్ గౌడ్ లబ్ధిదారులకు అందజేశారు.వార్డులోని అర్హులైన మహిళలను గుర్తించి, వారికి ప్రభుత్వ ఫలాలు నేరుగా అందేలా కౌన్సిలర్ చొరవ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రభుత్వం అందిస్తున్న ఈ పింఛన్లు ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు ఎంతో ఆసరాగా నిలుస్తాయని తెలిపారు. వార్డు అభివృద్ధితో పాటు అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందేలా నిరంతరం కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. తమకు పింఛన్ కార్డులు మంజూరు చేయించడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ, కౌన్సిలర్ ఎర్ర విశాలి నాగరాజ్ గౌడ్ కి మరియు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వార్డు ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నెల రోజులుగా వడ్ల కొనుగోళ్లు నిలిపివేత.. రైతుల రాస్తారోకో!

● గన్నీ బ్యాగులు, లారీలు లేవంటూ కొనుగోళ్లకు బ్రేక్.. ఎండలో ఎండిపోతున్న ధాన్యం









అందోల్, నవంబర్ 17 (ప్రజాజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో జాప్యంతో అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల రోజులుగా కొనుగోలు కేంద్రంలో వడ్ల తూకం వేయడం లేదని ఆరోపిస్తూ సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల కేంద్రంలో రైతులు రోడ్డెక్కారు. వివిధ గ్రామాల నుంచి పుల్కల్ కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చిన రైతులు, గన్నీ బ్యాగులు లేవని, లారీలు అందుబాటులో లేవని సిబ్బంది చెబుతూ కొనుగోళ్లు నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజుల తరబడి ధాన్యం కొనుగోలు కేంద్రంలోనే పడిఉండటంతో ఎండకు వడ్లు ఎండిపోతున్నాయని, అకాల వర్షాలు వస్తే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. దీంతో ధాన్యం లారీలతో పాటు ఇతర వాహనాలు నిలిచిపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న తహసీల్దార్ కృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వెంటనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తామని భరోసా ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. హామీలతో సరిపెట్టకుండా కొనుగోళ్లు నిరంతరాయంగా కొనసాగించాలని, గన్నీ బ్యాగులు, లారీల కొరత లేకుండా చూడాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. పండించిన పంటను అమ్ముకోవడానికి రోజుల తరబడి రోడ్లపై పడిగాపులు కాయాల్సిన పరిస్థితి రాకుండా అధికారులు శాశ్వత చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సదాశివపేట 1వ వార్డులో

ఘనంగా ఆసరా పింఛన్ కార్డుల పంపిణీ



సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి: సదాశివపేట పట్టణంలో అర్హులైన మహిళలకు తెలంగాణ ప్రభుత్వ ఆసరా పింఛన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. 1వ వార్డు కౌన్సిలర్ ఫణి కృష్ణ లబ్ధిదారులకు ఈ కార్డులను అందజేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద మహిళల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వితంతు మరియు ఒంటరి మహిళల పింఛన్ పథకం కింద కొత్తగా మంజూరైన కార్డులను సదాశివపేట 1వ వార్డు కౌన్సిలర్ ఫణి కృష్ణ పంపిణీ చేశారు. వార్డు పరిధిలోని అర్హులైన లబ్ధిదారుల అందరికీ , ఆయా పత్రాలను స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఫణి కృష్ణ మాట్లాడుతూ... ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు అండగా నిలవడమే ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పింఛన్ కార్డులు అందుకున్న మహిళలు ప్రభుత్వానికి, కౌన్సిలర్ ఫణి కృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

సిద్దిపేటలో సీఎం బహిరంగ సభను విజయవంతం చేయండి

● కాంగ్రెస్ పార్టీ నాయకులు అజీజ్ ఖురేషి



హత్నూర 17 నవంబర్ (ప్రజాజ్యోతి) హత్నూర మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు,కార్యకర్తలకు, అనుబంధ సంఘాల సభ్యులకు మరియు ప్రజలకు హృదయపూర్వక విజ్ఞప్తి.తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి తేదీ 19-11-2026 (గురువారం) సాయంత్రం 5:00 గంటలకు సిద్దిపేటలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారు.ప్రజా ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు,అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు,ఉమ్మడి మెదక్ జిల్లా అభివృద్ధికి సంబంధించి ముఖ్యమంత్రి కీలక సందేశాన్ని అందించనున్నారు. ఈ చారిత్రాత్మక బహిరంగ సభను నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి నాయకత్వంలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. కావున హత్నూర మండలంలోని ప్రతి గ్రామం నుండి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, యువజన, మహిళా ,ఎన్ఎస్‌యూఐ (చీఖ×),మైనార్టీ బిసి, ఎస్సీ ఎస్టీ, కిసాన్ కాంగ్రెస్ కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద ఎత్తున సిద్దిపేటకు తరలిరావాలని విజ్ఞప్తి.

క్యాన్సర్ నివారణపై మహిళలకు అవగాహన అవసరం

బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి

కల్హేర్, నవంబర్ 17, ప్రజాజ్యోతి: మహిళలు బ్రెస్ట్ క్యాన్సర్ (రొమ్ము క్యాన్సర్), సర్వైకల్ క్యాన్సర్ (గర్భాశయ ముఖద్వార క్యాన్సర్) పట్ల అవగాహన పెంపొందించుకోవాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి సూచించారు. పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మహిళల ఆరోగ్య పరిరక్షణకు క్యాన్సర్‌పై అవగాహన ఎంతో అవసరమన్నారు. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్స పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. క్యాన్సర్ నివారణకు అందుబాటులో ఉన్న టీకాలు, వైద్య పరీక్షల గురించి ప్రతి మహిళ తెలుసుకోవాలని సూచించారు. ముఖ్యంగా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు ఉపయోగపడే (హెచ్.పీ.వీ)టీకాలను అర్హులైన వారు వైద్యుల సలహా మేరకు వేయించుకోవాలని కోరారు. మహిళలు తమ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, క్యాన్సర్ లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి సూచించారు.

జవాబుదారి తనాన్ని పెంపొందించే

లక్ష్యంతో సమాచార హక్కు చట్టం అవగాహన

● అదనపు కలెక్టర్ నగేష్

నవంబర్ 17 మెదక్ జిల్లా బ్యూరో ప్రజాజ్యోతి : ప్రభుత్వ పరిపాలనలో పారదర్శకత, జవాబు దారితనాన్ని మరింత పెంపొందించే లక్ష్యంతో సమాచార హక్కు చట్టంఅవగాహనకార్యక్రమం నిర్వహిస్తున్నామని అదనపు కలెక్టర్ నగేష్ పేర్కొన్నారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎం సి ఆర్ హెచ్ ఆర్ డి ఇన్‌స్టిట్యూట్ వారి ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం (ఆర్.టి.ఐ యాక్ట్ , 2005) మెదక్ జిల్లా స్థాయిలో పౌర సమాచార, సహాయ పౌర సమాచార అధికారులకు 02 రోజుల ప్రత్యేక శిక్షణలను ఏర్పాటు చేశారు. మొదటి రోజు శిక్షణా కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ నగేష్





ముఖ్యఅతిథిగాపాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం సామాన్య పౌరులకు ప్రభుత్వం అందించిన ఒక శక్తివంతమైన ఆయుధమని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు కోరిన సమాచారాన్ని చట్ట నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులోగా (సాధారణ సమాచారం 30 రోజుల్లోగా, ప్రాణ/స్వేచ్ఛకు సంబంధించిన సమాచారం 48 గంటల్లోగా) ఖచ్చిత త్వంతో అందజేయాలని అధికారులకు సూచించారు. ఎటువంటి గోప్యతకు తావి వద్దని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎం సి హెచ్ ఆర్ డి శంకర్ ,వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన పౌర సమాచారఅధికారులు, సహాయ పౌర సమాచార అధికారులు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మండల టాపర్‌కి శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ తరుపున నగదు ప్రోత్సాహం

1.'చదువుకో తెలంగాణ' కార్యక్రమంలో భాగంగా నగదు ప్రోత్సాహకం

2. మండల టాపర్ వెల్మకన్న విద్యార్థిని శ్రీ నిఖిలకు రూ.10 వేల చెక్కు అందజేత

3. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆర్థిక భరోసా అభినందనీయం: ఎస్సై నిరేష్

కౌడిపల్లి నవంబర్ 17 ప్రజా జ్యోతి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ చేపట్టిన 'చదువుకో తెలంగాణ' కార్యక్రమం అభినందనీయమని కౌడిపల్లి ఎస్సై నిరేష్ అన్నారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ఆర్థిక ప్రోత్సాహకాలు అందించడం వారి ఉన్నత చదువులకు ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. కౌడిపల్లి మండలం వెల్మకన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని శ్రీ నిఖిల 2025--26 విద్యా సంవత్సరంలో 549 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'చదువుకో తెలంగాణ' కార్యక్రమంలో భాగంగా ఆమెకు రూ.10 వేల నగదు బహుమతిని చెక్కు రూపంలో అందజేశారు. అనంతరం 'చదువుకో తెలంగాణ' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను మెదక్ బ్రాంచ్ మేనేజర్లు రత్నాకర్, శ్రీనివాస్, ఎస్సై నిరేష్, గ్రామ సర్పంచ్ శివలీల సతీష్, మాజీ సర్పంచ్ కాజీపేట రాజేందర్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరోజిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ రత్నాకర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు వివరించారు. ఈ పథకం కింద మండల స్థాయి టాపర్‌కు రూ.10 వేలు, నియోజకవర్గ స్థాయి టాపర్‌కు రూ.1 లక్ష, జిల్లా స్థాయి టాపర్‌కు రూ.2 లక్షలు, రాష్ట్ర స్థాయి మొదటి టాపర్‌కు రూ.5 లక్షలు, రెండో టాపర్‌కు రూ.3 లక్షల నగదు పురస్కారాలు అందజేస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు, చదువుకున్న పాఠశాలకు పేరు తీసుకురావాలని, భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ





కార్యక్రమంలో మెదక్ బ్రాంచ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రాయగిరి, ఏజెంట్లు మల్లేష్, భూపాల్‌రెడ్డి, తులసి, మాధవి, శైలజ, సుధాకర్, వెంకటేశం, నరేందర్, సల్మాన్, కృష్ణారావు, రవిగౌడ్, సాయిప్రసాద్, ప్రశాంత్, ఆంజనేయులు, ఉప సర్పంచ్ ప్రభు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు సరోజ, ఉపాధ్యాయులు వెంకటేష్, చంద్రశేఖర్,మౌనిక, లింగమయ్య,సింహాచలం విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యమెందుకు?

● రైతుల ధాన్యం కొనుగోలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం!

● కొనుగోలు కేంద్రం ప్రారంభించి.. లారీల రవాణా వేగవంతం చేయాలి

● ఆర్డీవోతో ఫోన్‌లో మాట్లాడిన కంఠరెడ్డి తిరుపతిరెడ్డి





నవంబర్ 17 మెదక్ జిల్లా బ్యూరో ప్రజాజ్యోతి : నెల రోజులు గడుస్తున్నా ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించకపోవడం, రైతుల నుంచి ధాన్యం సేకరించకపోవడంపై అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఏడుపాయల నుంచి ఎర్రవెల్లి వరకు చేపట్టిన పాదయాత్రకు స్వాగతం పలికేందుకు వచ్చిన బీఆర్ఎస్ నాయకుడు కంఠరెడ్డి తిరుపతిరెడ్డిని శంకరంపేట మండలం గవ్వలపల్లి వద్ద రైతులు కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా గవ్వలపల్లి ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం ఇప్పటివరకు ప్రారంభం కాలేదని, లారీల కొరత కారణంగా ధాన్యం తరలింపు నిలిచిపోయిందని రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో వెంటనే స్పందించిన తిరుపతిరెడ్డి ఆర్డీవోతో ఫోన్‌లో మాట్లాడి రైతుల సమస్యలను వివరించారు. తక్షణమే ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడంతో పాటు ధాన్యం రవాణాకు సరిపడా లారీలను ఏర్పాటు చేసి కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. నెల రోజులుగా రైతులు ధాన్యం కొనుగోళ్ల కోసం ఎదురుచూస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకు ధాన్యం విక్రయించాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పండించిన ధాన్యం రోజుల తరబడి కల్లాల్లోనే ఉండిపోకుండా వెంటనే కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి, ధాన్యం సేకరణ చేపట్టాలని, లారీల ద్వారా మిల్లులకు తరలించేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పేదల జీవితాల్లో కొత్త వెలుగులు.. ప్రజాప్రభుత్వం "చేయూత"

● పేదల కళ్లలో ఆనందం.. ప్రజాప్రభుత్వ సంక్షేమం

● మెదక్ నియోజకవర్గంలో ఘనంగా చేయూత పింఛన్ల పంపిణీ

● కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేసిన ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు





నవంబర్ 17 మెదక్ జిల్లా బ్యూరో ప్రజాజ్యోతి : పేదల జీవితాల్లో కొత్త వెలుగులు.. నింపాలనే ఉద్దేశంతో ప్రజాప్రభుత్వం "చేయూత"పింఛన్ల కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నామని మెదక్ నియోజకవర్గ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు తెలిపారు. నియోజకవర్గంలో అర్హులైన పేదలకు సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమాలు మంగళవారం ఘనంగా జరిగాయి. లిమెదక్ నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావులి స్వయంగా పలు మండలాలు,గ్రామాలు, మెదక్ పట్టణంలో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొని నూతనంగా మంజూరైన చేయూత పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ..పేదల కళ్లలో ఆనందం.. చూడాలనే ఉద్దేశంతో ప్రజాప్రభుత్వ సంక్షేమం మెదక్ నియోజకవర్గంలో ఘనంగా చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు. పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పింఛన్లు కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా నిరుపేద కుటుంబాలకుఆత్మగౌరవంతో జీవించేందుకు తోడ్పడే భరోసా అని పేర్కొన్నారు. నార్సింగి మండలంలో పింఛన్ల పంపిణీ చేశారు.

నార్సింగి మండలంలో 86 చేయూత పెన్షన్ పంపిణీ

నార్సింగి మండలంలోని నాలుగు గ్రామాలకు సంబంధించిన 86 నూతన చేయూత పింఛన్ లబ్ధిదారులకు రైతు వేదికలో ఎమ్మెల్యే పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నివసించే పేదలు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయం అందేలా కృషి చేస్తానని తెలిపారు.

రామాయంపేట పట్టణం, మండలంలో పింఛన్ల పంపిణీ

రామాయంపేట పట్టణంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో రామాయంపేట పట్టణం,142 మండల పరిధిలోని 323 నూతన చేయూత పింఛన్ లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వృద్ధాప్యంలో కుటుంబాలపై ఆర్థిక భారం పడకుండా, పేదలకు నెలనెలా ఆర్థిక సహాయం అందించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు.

నిజాంపేట మండలంలో చేయూత పింఛన్లు పంపిణీ

నిజాంపేట మండలానికి చెందిన 257 నూతన పింఛన్ లబ్ధిదారులకు రేణుక ఫంక్షన్ హాల్‌లో పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందించే చేయూత పింఛన్లు నిరుపేద కుటుంబాలకు ఎంతో ముఖ్యమైన ఆర్థిక ఆధారమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మరియు కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

● సీపీఎస్ రద్దు కోసం ఉద్యోగ, ఉపాధ్యాయుల ఐక్య పోరాటం: అధ్యక్షుడు దేవరాజ్





సిద్దిపేట,నవంబర్ 17(ప్రజాజ్యోతి):- బిసీపీఎస్ విధానం వల్ల ఉద్యోగుల భవిష్యత్తు ఆర్థిక భద్రతకు ముప్పు ఏర్పడుతోందని టీఎస్సిపిఎస్ఈయూ సిద్దిపేట అధ్యక్షుడు చేగురి దేవరాజ్, ప్రధాన కార్యదర్శి బత్తిరాజు శశి యాదవ్ లు పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం గౌరవప్రదమైన జీవితం గడపడానికి పాత పెన్షన్ విధానమే సరైన మార్గమన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత



పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సామూహిక సాధారణ సెలవు కార్యక్రమంలో భాగంగా మంగళవారం నాడు సిద్దిపేట జిల్లాలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసనను తెలియజేశారు.ఈ మేరకు జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టి సమస్యలతో కూడిన మెమోరాండాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్, జిల్లా కలెక్టర్ కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ అధికారి రాజ్ కుమార్ లకు అందించి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ అయిన సీపీఎస్ రద్దుపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు.అలాగే మాస్ లీవ్ పెట్టిన ఉపాధ్యాయులను, ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేయొద్దని కోరగా అడిషనల్ కలెక్టర్ ఉద్యోగుల పట్ల సానుకూలంగానే ఉంటామని హామీ ఇచ్చారన్నారు.ఉద్యోగుల పెన్షన్ భద్రత కోసం చేపట్టిన ఈ ఉద్యమం మరింత ఐక్యంగా, ఉధృతంగా కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో, డాక్టర్ బాబు, రమేష్, హరి ప్రసాద్, బాల్ లక్ష్మి, ప్రవీణ్ కుమార్, సతీష్, మల్లేశం, రామచంద్రం, తిరుమలేశ్, శ్రీకాంత్, వినోద్, రాజమౌళి, రఫీక్, సదానందం, తదితరులు పాల్గొన్నారు.

దోచుకో... దాచుకో...

● రంగనాయక సాగర్‌లో రాత్రి మట్టి దందా

● అంతా అధికారుల కనుసన్నల్లోనే అంటూ ఆరోపణలు

చిన్నకోదూరు, నవంబర్17, (ప్రజాజ్యోతి) పొద్దంతా ప్రశాంతమైన వాతావరణంలో జలసవ్వడులతో ప్రజలకు ఆహ్లాదాన్ని ఆహ్లాదాన్ని అందించే రంగనాయక సాగర్ లో రాత్రిపూట అక్రమ మట్టి రవాణా అడ్డగోలుగా జరుగుతుంది. రాత్రి అయితే చాలు జెసిబిలు,టిప్పర్లతో మట్టిని దర్జాగా మట్టిని దోచుకుంటూ అడ్డగోలుగా అక్రమ సంపాదనను దాచుకుంటున్నారు. ప్రభుత్వ సంపదను కాపాడాల్సిన అధికారులు నిద్రమత్తులో ఉండటంతో మట్టి మాఫియా రోజురోజుకు పెరిగిపోతుంది.రాత్రి తొమ్మిది గంటలు మొదలు తెల్లవారుజాము వరకు మట్టి దందా కొనసాగుతోంది. అనుమతులు లేకుండానే భారీ యంత్రాలతో తవ్వకాలు జరుపుతూ,టిప్పర్ల ద్వారా వెంచర్లకు, ఇటుక బట్టీలకు మట్టిని విక్రయిస్తున్నారు. ఇదంతా సంబంధిత శాఖ అధికారులకు తెలుసని వారి కనుసన్నుల్లోనే మట్టి తరలింపు జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పదుల సంఖ్యలో టిప్పర్లు నడుస్తున్నా,మట్టి తరలింపు జరుగుతుందన్న విషయం తెలిసినా అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అక్రమార్కులకు కొందరు అధికారుల అండదండలు ఉన్నాయని, మామూళ్ల మత్తులో వారు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ఇప్పటికైనా సంబంధిత అధికారులు





స్పందించి మట్టి తరలింపుపై దృష్టి సారించి విచారణ చేపట్టాలని అదేవిధంగా అనుమతులు లేకుండా తవ్వకాలు జరిపి మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

విదేశీ నేత రాజకీయ వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలి

● భారత్ సమ్మిట్ వేదికగా దేశ ప్రతిష్టను దెబ్బతీశారు

● బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్

సిద్దిపేట అర్బన్, నవంబర్ 17(ప్రజాజ్యోతి):- హైదరాబాద్‌లో జరిగిన భారత్ సమ్మిట్ లో విదేశీ సంస్థ ప్రతినిధి,పార్టీ ఆఫ్ యూరోపియన్ సోషలిస్ట్ (పి ఇ ఎస్) సెక్రెటరీ జనరల్ జియాకోమో ఫిలిబెక్ చేసిన రాజకీయ వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ అన్నారు. భారత్ సమ్మిట్ వేదికగా దేశ ప్రతిష్టను దెబ్బతీశారని విదేశీయులను భారత్ కు రప్పించి అంతర్జాతీయంగా దేశ పరువు తీసేందుకు ప్రయత్నించిన రాహుల్ గాంధీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ నాయకులతో కలిసి బైరి శంకర్ ఏసీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవంబర్ 13,14 తేదీల్లో హైదరాబాద్ లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన భారత్ సమ్మిట్ లో ఇటలీకి చెందిన జియాకోమో ఫిలిబెక్ ఓట్ చోర్..గద్దె చోడ్ అంటూ ప్రధానిని ఉద్దేశించి నినాదాలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశామన్నారు. భారత ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందంటూ, రాహుల్ గాంధీకి మద్దతుగా మాట్లాడటం పట్ల మండిపడ్డారు.ఒక విదేశీ పౌరుడు,అదీ కాన్సరెన్స్ వీసాపై వచ్చిన వ్యక్తి.భారతదేశ అంతర్గత రాజకీయాల్లో జోక్యం చేసుకోవడం వీసా నిబంధనల ఉల్లంఘన అని,ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్ - 2025 ప్రకారం నేరమని అన్నారు. ఇది భారత్ సమ్మిట్ కాదు,యాంటీ భారత్ సమ్మిట్ అని విదేశీ శక్తులను పిలిచి దేశాన్ని ప్రధానిని అవమానించడం కాంగ్రెస్ కు అలవాటైపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.రాహుల్ గాంధీ నవ్వుతూ ఆ వ్యాఖ్యలను ఆస్వాదించడం సిగ్గుచేటన్నారు. ఒక విదేశీ రాజకీయ ప్రతినిధికి భారత చట్టాలను ఉల్లంఘించే స్వేచ్ఛ లేదని,ఫిలిబెక్ పై అతనికి వేదిక కల్పించిన నిర్వాహకులపై కేసు నమోదు చేసి,వీసా రద్దు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఇదే అంశంపై రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు నేతృత్వంలోని బృందం హైదరాబాద్ లో ఎఫ్ ఆర్ ఆర్ ఓ, డీజీపీ సీవీ ఆనంద్ కు ఫిర్యాదు చేసిందని అందులో భాగంగానే సిద్దిపేట లో నేడు ఏసీపీకి ఫిర్యాదు చేసినట్లు బైరి శంకర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు బాసంగారి వెంకట్, కాసని గొట్టు సంతోష్, గుండ్లజనార్దన్, కెమ్మసారం సంతోష్, బి.సునీల్, శ్రీను, వేణు, చెంది సత్యనారాయణ, సుతారి కార్తీక్, అరిగే యాదగిరి, కృష్ణ, మహేందర్, సంతోష్, గణేష్, రాజిరెడ్డి, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో మార్పు లేదు

ఎమ్మెల్యే మాటకు తిరుగులేదు!
తాండూరు నియోజకవర్గంలో జోరుగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు
సొంతింటి కల నెరవేరడంతో లబ్ధిదారుల్లో ఆనందం
ఎమ్మెల్యే మనోహర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న లబ్ధిదారులు



తాండూరు నవంబర్ 15 ప్రజా జ్యోతి :
వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం లోని తాండూర్, పెద్దేముల్, యాలాల, బషీరాబాద్, మండలాల్లోని వివిధ గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. పలు గ్రామాల్లో లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేస్తుండటంతో గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సందడి కనిపిస్తోంది. ప్రభుత్వం నిర్ణయించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణాలు చేపడుతూ, ఇందిరమ్మ ఇంటి రూపురేఖలు స్పష్టంగా కనిపించేలా పనులు కొనసాగుతున్నాయి.గతంలో అద్దె ఇళ్లలో, ఇరుకు గదుల్లో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న పేద కుటుంబాలకు సొంతింటి నిర్మాణంతో కొత్త ఆశలు కలిగిస్తోంది. తమకంటూ ఒక ఇల్లు ఉండాలనే ఎన్నో ఏళ్ల కల ఇప్పుడు సాకారమవుతుండటంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.తాండూరు నియోజకవర్గానికి మొత్తం 2808 ఇండ్లు మంజూరు కాగా ఇప్పటికే 548 ఇండ్లు చేయడంతో గృహప్రవేశాలు కూడా చేయడం జరిగిందని పలువురు చెప్తున్నారు. 989 స్లాబ్ లేవల్‌లో ఉండగా, మరికొన్ని వివిధ దశలో ఉన్నట్లు అధికారులు చెప్పారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు ఎన్నడు లేనివిధంగా జోరుగా సాగుతున్నాయనేది స్పష్టంగా కనిపిస్తుంది. తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఏ గ్రామానికి వెళ్లిన కూడా పేదల సంక్షేమం కోసం వారికీ సొంత ఇల్లు ఉండాలన్న దృఢ సంకల్పంతో ముందుకు వెళ్తున్నారు. అదేవిదంగా నియోజకవర్గంలోని ఏ కుటుంబం కూడా ఇల్లు లేదు అనే మాట వినిపించరాదనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నట్లు ఆయన అనేకసార్లు వేదికలపైన చెప్పారు.
ముఖ్యంగా ఒక్కసారి మాట ఇస్తే ఆ మాటకు తిరుగు లేదనే విదంగా పదేపదే ప్రజా వేదికలపై ప్రజల ముందు చెబుతున్నారు. అందుకే మాటకు కట్టుబడి ఉండి పేద ప్రజల సొంతింటి కల నెరవేరేందుకు నిరంతరం శ్రమిస్తున్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిపై



లబ్ధిదారులు, రాజకీయ నాయకుల నుండి ప్రశంసలు కురిపిస్తున్నారు. మాటల్లో కాకుండా చేతల్లో అభివృద్ధి కనిపిస్తోందని, తమ కుటుంబాలకు శాశ్వత నివాసం కల్పించే దిశగా సహకారం అందించడం సంతోషంగా ఉందని లబ్ధిదారులు పేర్కొంటున్నారు.
ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ఇదే విధంగా వేగంగా కొనసాగితే మరిన్ని పేద కుటుంబాలకు సొంతింటి భాగ్యం కలుగుతుందని నియోజకవర్గ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు భద్రతపై అవగాహన కల్పించిన పరిగి "షీ" టీమ్

విస్డమ్ హైస్కూల్‌లో మహిళలు, బాలల రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సు

పరిగి, నవంబర్ 17 (ప్రజాజ్యోతి):
మహిళలు, బాలల భద్రతే లక్ష్యంగా పరిగి సబ్ డివిజన్ "షీ" టీమ్ సిబ్బంది విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా , పరిగి డీఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు పూడూరు మండలంలోని చెన్గోముల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న విస్డమ్ హైస్కూల్‌లో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. "షీ" టీమ్ ఇన్‌చార్జి నరసింహులు, సిబ్బంది విద్యార్థులకు





మహిళలు, బాలలపై జరుగుతున్న నేరాలు, నిర్భయ చట్టం, పోక్సో చట్టం గురించి వివరించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సీసీ కెమెరాల ప్రాధాన్యం, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నిర్మూలన, కమ్యూనిటీ పోలీసింగ్, మానవ అక్రమ రవాణా, మద్యపాన నిషేధం, ట్రాఫిక్ నిబంధనలు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసాలు, గంజాయి, డ్రగ్స్ నిర్మూలన, జెండర్ ఈక్వాలిటీ, జెండర్ సెన్సిటివిటీ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయాల్లో డయల్ 100, 112, "షీ" టీమ్ నంబర్ 181, యాంటీ డ్రగ్ హెల్ప్‌లైన్ 1908, సైబర్ నేరాల ఫిర్యాదులకు 1930, చైల్డ్‌లైన్ 1098 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గౌస్ పటేల్, ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు, "షీ" టీమ్ సభ్యులు సావిత్రి, శోభ పాల్గొన్నారు.

యాబాజిగూడలో వైభవంగా ఆంజనేయస్వామి వార్షికోత్సవం.. ప్రత్యేక పూజలు, అన్నదానం

పరిగి, నవంబర్ 17 (ప్రజాజ్యోతి):
వికారాబాద్ జిల్లా పరిగి మండల పరిధిలోని యాబాజిగూడ గ్రామంలో శ్రీ ఆంజనేయస్వామి ఆలయ ఐదవ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి పవన్





కుమార్ పంతులు వేదమంత్రోచ్చారణల నడుమ స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకులు శశిధర్ రెడ్డితో పాటు గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసి, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

తలసేమియా, సికిల్ సెల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహణ

సోమాజిగూడ,నవంబర్16(ప్రజాజ్యోతి) : తలసేమియా మరియు సికిల్ సెల్ సొసైటీ ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలు అత్యంత ఉత్సాహంగా, ఆనందోత్సాహాల మధ్య జరిగాయి. చిన్నారులు, వారి కుటుంబ సభ్యులు, విశిష్ట అతిథుల సమక్షంలో ఈ కార్యక్రమం సృజనాత్మకత, వినోదం, స్ఫూర్తిదాయక అంశాలతో



ఆద్యంతం ఆకట్టుకుంది. ఈ వేడుకలకు తెలంగాణ ప్రభుత్వ మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వినోద్ కె. అగ్రవాల్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. అతిథులుగా బంజారాహిల్స్ స్టార్ హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ సర్జన్, జాయింట్ రీప్లేస్‌మెంట్ నిపుణులు డాక్టర్ జి. వేద ప్రకాష్, స్నేహ బంగ్, ప్రముఖ పారిశ్రామికవేత్త, దాత శ్యామ్ సుందర్‌జీ లోయా పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టి ఎస్ సి ఎస్ సీఈఓ, కార్యదర్శి డాక్టర్ సుమన్ జైన్, ఉపాధ్యక్షులు నరేష్ రాఠీలతో పాటు బోర్డు సభ్యులు అలీమ్ బేగ్, మనోజ్ రూపాని, శివ్ రతన్, ఎండి. అమిన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీపాలి అగర్వాల్, స్నేహ బంగ్ మాట్లాడుతూ చిన్నారుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేలా స్ఫూర్తిదాయక ప్రసంగాలు చేశారు. ఈ వేడుకలలో కుమారి కృష్ణ కమల్ కిశోర్ బంగ్ చేసిన ప్రసంగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కేవలం తొమ్మిది నెలల వయసులోనే 'స్పాస్టిక్ డిప్లెజిక్ సెరిబ్రల్ పాల్సీ' వ్యాధి బారిన పడిన ఆమె, తన అకుంఠిత దీక్ష, పట్టుదలతో పాటు తల్లి డాక్టర్ మీరా బంగ్ అందించిన నిరంతర ప్రోత్సాహంతో శారీరక, విద్యాపరమైన ఎన్నో సవాళ్లను అధిగమించిన తీరును వివరించారు.

ఆర్టీఐ దరఖాస్తులపై నిర్లక్ష్యం తగదు..

కోరిన సమాచారాన్ని అందించాల్సిందే

పరిగి, నవంబర్ 17 (ప్రజాజ్యోతి):
సమాచార హక్కు చట్టం కింద పౌరులు ఎన్ని అంశాలపై సమాచారం కోరినా, చట్ట నిబంధనలకు అనుగుణంగా కోరిన సమాచారాన్ని అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ ప్రధాన సమాచార కమిషనర్ డా. జి. చంద్రశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. ఆర్టీఐ పిటిషనర్లు ఎక్కువ ప్రశ్నలు అడుగుతున్నారనే కారణంతో వారిని తప్పుపట్టడానికి వీల్లేదని కీలక వ్యాఖ్యలు చేశారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి వివిధ శాఖలకు బదిలీ అయిన సమాచార హక్కు దరఖాస్తులకు సంబంధించి దాఖలైన రెండో అప్పీల్‌పై తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్‌లో విచారణ జరిగింది. ఈ విచారణకు పిటిషనర్ సయ్యద్ షా మొహమ్మద్ హుస్సేని స్వయంగా హాజరై తన వాదనలు వినిపించారు. ప్రధాన సమాచార కమిషనర్ డా. జి. చంద్రశేఖర్ రెడ్డి ఇరువర్గాల వాదనలు విన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖలకు సమర్పించిన ఆర్టీఐ దరఖాస్తులపై ఇప్పటివరకు పూర్తిస్థాయి సమాచారం అందలేదని, గతంలో ఆయా కార్యాలయాలకు సమర్పించిన పిటిషన్లపై తీసుకున్న చర్యల వివరాలు కూడా వెల్లడించలేదని పిటిషనర్ కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కమిషనర్, పౌరులకు సమాచారాన్ని కోరే హక్కు ఉందని, దరఖాస్తుల్లోని ప్రతి అంశాన్ని పరిశీలించి చట్టప్రకారం సమాధానాలు ఇవ్వాలని అధికారులకు సూచించారు. విచారణకు కొన్ని శాఖల అధికారులు మాత్రమే హాజరుకావడాన్ని పరిగణనలోకి తీసుకున్న కమిషనర్, హాజరైన అధికారులు ఇతర సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని అవసరమైన సమాచారాన్ని సేకరించి పిటిషనర్‌కు అందించాలని ఆదేశించారు. ముఖ్యంగా కలెక్టర్ కార్యాలయ ప్రజా సమాచార అధికారి (పీఐఓ), జిల్లా పంచాయతీ అధికారి (ప్రథమ అప్పీల్ అధికారి) పిటిషనర్ సమర్పించిన పిటిషన్లపై తీసుకున్న చర్యల వివరాలతో పాటు కోరిన అన్ని అంశాలకు సంబంధించిన సమాచారాన్ని డిసెంబర్ 9వ తేదీలోగా అందించాలని ఆదేశాలు జారీ చేశారు. నిర్దేశిత గడువులోగా సమాచారం అందకపోతే కమిషన్‌ను మళ్లీ ఆశ్రయించి ఫిర్యాదు చేయవచ్చని పిటిషనర్‌కు సూచించారు. అలాగే ప్రతి ప్రజా సమాచార అధికారి, ప్రథమ అప్పీల్ అధికారి తమ కార్యాలయాలకు వచ్చిన ఆర్టీఐ దరఖాస్తులను పూర్తిగా చదివి అర్థం చేసుకోవాలని కమిషనర్ సూచించారు. దరఖాస్తులోని అంశాలపై సందిగ్ధత ఉంటే నాలుగైదు రోజుల్లోనే దరఖాస్తుదారుడికి లిఖిత పూర్వకంగా తెలియజేసి స్పష్టత తీసుకోవాలని, చట్టం నిర్దేశించిన గడువులోగా పూర్తి సమాచారం అందించాలని తెలిపారు. ఈ సందర్భంగా పిటిషనర్ సయ్యద్ షా మొహమ్మద్ హుస్సేని మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం ప్రతి భారత పౌరుడికి కల్పించిన హక్కు అని, ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగే పనులు, తమ పిటిషన్లపై తీసుకున్న చర్యలు, అధికారుల బాధ్యతల గురించి సమాచారం కోరడం పౌరుల హక్కు అని పేర్కొన్నారు. కమిషన్ ఆదేశాల మేరకు డిసెంబర్ 9లోగా పూర్తి సమాచారం అందుతుందని ఆశిస్తున్నానని, లేనిపక్షంలో మరోసారి కమిషన్‌ను ఆశ్రయించి చట్టపరమైన చర్యలు కోరుతానని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడమే సమాచార హక్కు చట్టం ప్రధాన ఉద్దేశమని సేవా రత్న అవార్డు గ్రహీత, వర్మింగ్ ప్రెసిడెంట్ – హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్, వికారాబాద్ జిల్లా, సమాచార హక్కు వికాస సమితి కార్యనిర్వాహక సభ్యులు సయ్యద్ షా మొహమ్మద్ హుస్సేని పేర్కన్నారు.



ఆడపిల్లల భవిష్యత్తు కోసం సర్పంచ్ అరుణ సంకల్పం

-సుకన్య సమృద్ధి యోజన ప్రతి ఆడపిల్లకు భరోసా కావాలి -జనగామ గ్రామ సర్పంచ్ అరుణ

తాండూరు,పెద్దేముల్ నవంబర్ 17 ప్రజా జ్యోతి :
భారత మాజీ ప్రధాని దివంగత నేత పండిత జవహర్ లాల్ నెహ్రూ చిన్న తినాలని పురస్కరించుకొని జరుపుకునే బాలల దినోత్సవం వేడుకలలో స్థానిక అంగన్వాడి చిన్నారులకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సుకన్య సమృద్ధి యోజన పథకంలో జనగాం గ్రామ సర్పంచ్ అరుణ సుమారు 15 మంది చిన్నారులను చేర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదేండ్ల లోపు ఆడపిల్లల బంగారు భవిష్యత్తుకోసం తన సంపూర్ణ సహకారాన్ని అందించడం జరుగుతుందని చెప్పారు. మంగళవారం రోజు స్థానిక అంగన్వాడీ కేంద్రానికి చెందిన చిన్నారులకు తన సొంత డబ్బులతో సుఖన్య సమృద్ధి యోజన పథకంలో చేర్పించడం కోసం తపాలా శాఖ లో పొదుపు ఖాతాను ప్రారంభించడం జరిగిందన్నారు. ఆడపిల్ల పుడితే భారం కాదు, ఆ ఇంటికి వెలుగు దీపం అని నిరూపించాలన్న ఆమె సంకల్పంతో అనేక మంది చిన్నారులను చేర్పించి వారి బంగారు భవిష్యత్తుకు భరోసా కల్పిస్తున్నారు.
ఓ వైపు గ్రామ సర్పంచ్ గా బాధ్యతలు నిర్వర్తిస్తూనే గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తూ గ్రామంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టిన ఆమె ఆడపిల్లల భవిష్యత్తుపై ప్రత్యేక దృష్టి పెట్టారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సుకన్య సమృద్ధి యోజన పథకం గురించి ప్రతి పేద కుటుంబానికి తెలియజేయాలనే ఒక్క దృఢమైన సంకల్పంతో ఆడపిల్లల కుటుంబంలో చైతన్యం నింపుతున్నారు. ఒక్క ఆడపిల్ల కూడా ఈ పథకానికి దూరం కాకూడదనే ఉద్దేశమే ఆమెలో ఉన్న ఆశయంగా చెప్పవచ్చు.ఈ పథకం ద్వారా ఆడపిల్ల పేరు మీద తపాలా శాఖ కార్యాలయంలో ఖాతా లు తెరిపించి తల్లిదండ్రులు చిన్న చిన్న మొత్తాలు జమ చేసేలా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇలా చేసిన పొదుపు డబ్బులు ఆడ బిడ్డ పెద్దయ్యే సరికి ఉన్నత చదువులకు, పెళ్లి సమయంలో ఆసరాగా నిలుస్తుందని సర్పంచ్ అరుణ గ్రామస్తులకు వివరిస్తున్నారు. అదేవిదంగా గ్రామంలో అంగన్వాడీలు, పాఠశాలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉప సర్పంచ్ అనురాధ, అంగన్వాడీ టీచర్లు సువర్ణ, జయమ్మ, యశోద, తాండూర్ ఎంపో సంజమ్మొల్ల రాములు,జనగాం బీపీఎం చిట్టెమ్మ, అంగన్వాడీ చిన్నారులు,తల్లిదండ్రులు గ్రాస్తులు పాల్గొన్నారు.



డిసెంబర్ 11 నుంచి 'హైదరాబాద్ కామిక్ కాన్'

జూబ్లీహిల్స్,నవంబర్16 (ప్రజాజ్యోతి) :
నగరంలోని పాప్ కల్చర్, యానిమేషన్ అభిమానులను ఉర్రూతలూగించేందుకు 'హైదరాబాద్ కామిక్ కాన్' సిద్ధమవుతోందని నిర్వాహకులు పేర్కొన్నారు. డిసెంబర్ నెలలో జరగనున్న ఈ మెగా ఈవెంట్‌కు ముందస్తు ప్రచారంలో భాగంగా, కామిక్ కాన్ ఇండియా ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్‌లోని కిస్సా కాఫీ హౌస్‌లో ప్రత్యేక 'కాస్ప్లే



మాస్టర్‌క్లాస్' నిర్వహించారు. ఈ వేడుకకు స్థానిక యువత, కాస్ప్లే కళాకారుల నుంచి విశేష స్పందన లభించిందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన భరత్, ఫోమ్ ఆర్మర్ , ప్రాప్ మేకింగ్‌లో తనకున్న దాదాపు పదేళ్ల అనుభవాన్ని ఔత్సాహికులతో పంచుకున్నారన్నారు. తమకు ఇష్టమైన సూపర్ హీరోలు, యానిమే పాత్రల రూపాలను అత్యంత సహజంగా, సృజనాత్మకంగా ఎలా తీర్చిదిద్దుకోవాలో కళాకారులు ఈ సందర్భంగా వివరించారన్నారు. కేవలం దుస్తుల ఎంపిక మాత్రమే కాకుండా, వాటి వెనుక ఉండే ఆలోచన, శ్రమ, సాంకేతిక నైపుణ్యాలు, తక్కువ ఖర్చుతో అద్భుతమైన ప్రాప్స్ (వస్తువులు) తయారు చేసే పద్ధతులపై యువతకు అవగాహన కల్పించారన్నారు. క్రంచీరోల్ భాగస్వామ్యంతో మారుతి సుజుకి సమర్పిస్తున్న 'హైదరాబాద్ కామిక్ కాన్' ప్రధాన వేడుకలు డిసెంబర్ 11 నుంచి 13 వరకు హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో అంగరంగ వైభవంగా జరగనున్నాయని తెలిపారు.'

షాద్‌నగర్ పారిశ్రామిక ప్రగతికి మరో మైలురాయి

కొత్తూరు నవంబర్ 17 (ప్రజా జ్యోతి)
కొత్తూర్ మండలంలోని తీగాపూర్ గ్రామంలో జేహెచ్ ఏరోస్పేస్ సంస్థ ఏర్పాటు చేసిన టూలింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రారంభించారు.ఈ



కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే,రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..తీగాపూర్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో ఏరోస్పేస్ టూలింగ్ సెంటర్ ఏర్పాటు కావడం సంతోషకరమని,ఇది షాద్‌నగర్ పారిశ్రామిక ప్రగతిలో మరో మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. విమానాలు,ఏరో ఇంజిన్ల తయారీ, నిర్వహణకు అవసరమైన అత్యాధునిక పరికరాలు,ఫిక్చర్లను ఈ కేంద్రంలో తయారు చేయనున్నట్లు తెలిపారు.ఇప్పటివరకు దిగుమతులపై ఆధారపడిన ఈ రంగంలో దేశీయ తయారీ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఈ సంస్థ దోహదపడుతుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి ప్రెసిషన్ ఇంజినీరింగ్ కేంద్రంగా తీర్చిదిద్దడంతో పాటు, తెలంగాణలో ఆధునిక పరిశ్రమల అభివృద్ధికి ఇలాంటి సంస్థలు తోడ్పడతాయని అన్నారు.స్థానిక యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పారిశ్రామిక రంగానికి ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు.షాద్‌నగర్ ప్రాంతంలో మరిన్ని పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని వెల్లడించారు. జేహెచ్ ఏరోస్పేస్ సంస్థ ప్రతినిధులు విశాల్, వెంకటేష్‌తో పాటు సంస్థ బృందానికి ఎమ్మెల్యే అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తూర్ మండల అధ్యక్షుడు శేఖర్ రెడ్డి,మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు హరినాథ్ రెడ్డి,అంబటి ప్రభాకర్,సాయిలు,కొర్ర రవి,ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల కోసం రైతుల నిరీక్షణ..?

తుపాను సూచనతో అన్నదాతల్లో ఆందోళన

ఎండపల్లి, నవంబర్ 17 (ప్రజాజ్యోతి): ఆరుగాలం శ్రమించి పండించిన వరి పంట చేతికొచ్చినా రైతులకు కష్టాలు తప్పడం లేదు. కోతలు పూర్తిచేసి ధాన్యాన్ని కల్లాలు, పొలాల్లో కుప్పలుగా పోసుకున్న అన్నదాతలు ప్రభుత్వ



కొనుగోలు కేంద్రాల ప్రారంభం కోసం ఎదురుచూస్తున్నారు. మరోవైపు తుఫాను హెచ్చరికలు వారిని కలవరపెడుతున్నాయి. వర్షాలు కురిస్తే ధాన్యం తడిసి నాణ్యత దెబ్బతింటుందని ఆందోళన చెందుతున్నారు. మండలంలోని మారేడుపల్లి తో పాటు కొన్ని గ్రామాల్లో గత 15 రోజులుగా కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కుప్పలు పోసి కొనుగోళ్ల కోసం ఎదురుచూస్తున్నా ప్రక్రియ ప్రారంభం కాలేదని రైతులు వాపోతున్నారు. ధాన్యాన్ని కాపాడుకునేందుకు నిత్యం కాపలా కాయాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. వర్షాలకు ధాన్యం తడిస్తే తేమశాతం పెరిగి, రంగు మారడం తోపాటు మద్దతు ధర పొందడంలో ఇబ్బందులు ఎదురవుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి రాకపోతే ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదే అదనుగా దళారులు తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. ఇప్పటికే పెట్టుబడులు, సాగు ఖర్చులతో సతమతమవుతున్న తమకు గిట్టుబాటు ధర దక్కకపోతే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని వాపోతున్నారు.

ధాన్యం కొనుగోలు వెంటనే ప్రారంభించాలి మారేడుపల్లి రైతులు:

సుమారుగా గత 15 రోజుల నుండి పంట చేతికొచ్చిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి కుప్పలుగా పోశామని రైతులు తెలిపారు. అప్పటి నుంచి ప్రభుత్వ కొనుగోళ్ల కోసం ఎదురు చూస్తున్నామని, తుఫాను వచ్చే సూచనలతో ఆందోళన చెందుతున్నామని పేర్కొన్నారు. అధికారులు వెంటనే కొనుగోలు ప్రక్రియ ప్రారంభించి దళారుల బారి నుంచి తమను కాపాడాలని కోరారు. ధాన్యం తడిసి నష్టపోయే పరిస్థితి రాకముందే కొనుగోళ్లు చేపట్టాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

త్వరలోనే కొనుగోలు కేంద్రాల ప్రారంభం ఎండపల్లి పీఏసీఎస్ చైర్మన్ గూడ రాంరెడ్డి

రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని



పీఏసీఎస్ చైర్మన్ గూడ రాంరెడ్డి తెలిపారు. త్వరలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

నిజరూప దర్శనానికి ఆహ్వానం

రాష్ట్ర గవర్నర్, ఉప ముఖ్యమంత్రికి ఆహ్వాన పత్రికలు అందించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల,నవంబర్ 17, ప్రజా జ్యోతి: సుమారు గత 60 సంవత్సరాల క్రితం జరిగిన మహాకార్యాన్ని తిరిగి నిర్వహిస్తున్నామంటూ కొండగట్టు ఆంజనేయస్వామి చందనోత్సవము,మహా సంప్రోక్షణ కార్యక్రమాలకు వచ్చి ఆంజనేయ స్వామి నిజరూప దర్శనాన్ని



కన్నుల పండుగగా వీక్షించాలని రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్ల కు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చేతుల మీదుగా మంగళవారం ఆహ్వాన పత్రిక అందించి,ఇట్టి కార్యక్రమానికి ఆహ్వానించారు. అలాగే తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క ను కలిసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఇట్టి కార్యక్రమ విశిష్టతను వివరించారు. దాదాపుగా ఆరు దశాబ్దాల తర్వాత జరుగుతున్న ఈ కార్యక్రమానికి రావాలని కోరుతూ ఆహ్వాన పత్రికతో పాటు స్వామివారి ప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి సత్యంతో పాటు దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ధార్మిక అడ్వైజర్ గోవిందా హరి, ఆలయ కార్య నిర్వహణ అధికారి అంజనా రెడ్డి, ఆలయ పర్యవేక్షకులు సునీల్, వేద పారాయణదారులు, అర్చకులు పాల్గొన్నారు.

ప్రగతిలో అలరించిన 'స్పార్కిల్ 2కె 26' వేడుకలు

– 16 నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్న విద్యార్థులు

రాయికల్, నవంబర్ 17 (ప్రజా జ్యోతి)

బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రగతి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 'స్పార్కిల్ 2K26' వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన 16 రకాల నృత్య ప్రదర్శనలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి.





అయ్యప్ప, శివతాండవం, సేవ్ వాటర్, కరుప్పా, జోకర్, జానపద పాటలతో పాటు పలు వైవిధ్యభరితమైన నృత్యాలతో చిన్నారులు సందడి చేశారు. తమ ప్రతిభతో సభికులను అలరించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ బాలె శేఖర్ మాట్లాడుతూ బాలలలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. చదువుతో పాటు కళలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ విద్యార్థులు రాణించాలని ఆకాంక్షించారు. బాలల దినోత్సవం విద్యార్థుల్లో ఆనందం, సృజనాత్మకతను పెంపొందించే వేదుకగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందాన్ని పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు, ఉత్సాహభరితమైన కార్యక్రమాలతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ జయశ్రీ, డైరెక్టర్ నిఖిల్ కుమార్, ఉపాధ్యాయ బృందం, పోషకులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలి

– కిసాన్ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి గోపాల్ రెడ్డి

కథలాపూర్, నవంబర్ 17(ప్రజాజ్యోతి): రైతులు వరి కోతలు కోసి 20 రోజులుగా కొనుగోలు కేంద్రాల ప్రారంభం కోసం ఎదురుచూస్తున్నప్పటికీ ప్రభుత్వం ఇప్పటివరకు కేంద్రాలను ప్రారంభించకపోవడం విచారకరమని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కోడిపల్లి గోపాల్ రెడ్డి మండిపడ్డారు. మంగళవారం సిరికొండలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బీజేపీ కిసాన్ మోర్చా నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అన్ని రకాల ధాన్యానికి క్వింటాల్‌కు రూ.1,000 బోనస్ ప్రకటించి వెంటనే కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా నిధులు విడుదల చేయాలని, రూ.2 లక్షల రుణమాఫీ పూర్తి చేయాలని, ఫసల్ బీమా అమలు చేయాలని కోరారు. వేసవిలో విద్యుత్ సరఫరాపై స్పష్టత ఇవ్వడంతో పాటు కరువు మండలాలుగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మల్యాల మారుతి, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు, గాంధారి శ్రీనివాస్, ఏనుగు తిరుమల్ రెడ్డి, కానోజు ప్రతాప్, ముంజ వెంకటేష్ తదితర నాయకులు, రైతులు పాల్గొన్నారు.



నిజరూప దర్శనానికి ముందే ఫోటో చెక్కర్లు?

కొండగట్టుకు అంజన్నది కాదంటున్న అర్చకులు - నవంబర్ 20 నుంచి నిజరూప దర్శనం

మల్యాల, నవంబర్ 17,ప్రజా జ్యోతి: కలికాలం నిజాన్ని మాయ చేస్తుందంటే ఇదేనేమో! చందనం తొలగించిన తర్వాత కొండగట్టు ఆంజనేయస్వామి నిజరూప దర్శనం అంటూ సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతున్న ఫోటోలపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆరు దశాబ్దాల తరువాత ఆలయ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కొండగట్టు ఆంజనేయ స్వామి చందనోత్సవము, మహా సంప్రోక్షణ కార్యక్రమము మొదలై మూడు రోజులు కాకముందే స్వామివారి నిజరూప దర్శనం అంటూ ఫోటోలు వీడియోలు వైరల్ అవుతున్నాయి. ఆలయ అధికారులు గోదపత్రికలు ఆహ్వాన పత్రికలు ప్రచురించి తేదీలను కార్యక్రమాలను ప్రచారం చేస్తున్న ఆ కల్పిత ఫోటో మాత్రం సామాజిక మాధ్యమాలలో చెక్కర్లు కొడుతూనే ఉన్నాయి. నవంబర్ 15వ తేదీ రోజున ప్రారంభమైన చందనోత్సవ మహా సంప్రోక్షణ కార్యక్రమాలు యాగాలు, మూల మంత్ర హోమం, ద్వారతోర్ణాలు, పూర్ణాహుతి,నివేదన బలిదానం కార్యక్రమాలు కొనసాగి,నవంబర్ 20వ తేదీ నుండి స్వామివారి నిజరూప దర్శనానికి భక్తులకు అనుమతి ఇవ్వనున్నారు. స్వామివారి చందనం తొలగించక ముందే నిజరూప దర్శనం స్వామి వారి ఫోటోలు అంటూ సోషల్ మీడియాలో చెక్కర్లు కొట్టడంపై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కొండగట్టు అంజన్నది కాదంటున్న అర్చకులు

సోషల్ మీడియాలో సామాజిక మాధ్యమాలలో అంజనేయ స్వామి నిజరూప దర్శనం అంటూ ఫోటోలు వీడియోలు వైరల్ అవుతున్న విషయం మా దృష్టికి రాలేదు. ఆ ఫోటోలతో కానీ వీడియోలతో కానీ కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానానికి ఎలాంటి సంబంధం లేదు. కల్పిత ఫోటోలను నమ్మకుండా స్వామివారి దివ్య మంగళ స్వరూపాన్ని నేరుగా కొండగట్టు క్షేత్రానికి వచ్చి దర్శించాల్సిందిగా తెలిపారు.

నవంబర్ 20 నుంచి నిజరూప దర్శనం ఆలయ ప్రధాన అర్చకులు జితేందర్

కొండగట్టు ఆంజనేయస్వామి నిజరూప దర్శనం నవంబర్ 20 నుండి భక్తులకు అందించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ దర్శనం డిసెంబర్ 29 వరకు కొనసాగేలా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. సోషల్ మీడియాలో సామాజిక మాధ్యమాలలో చెక్కర్లు కొడుతున్న కల్పిత ఫోటో కు కొండగట్టు అంజనేయ స్వామి దేవస్థానానికి ఎలాంటి సంబంధం లేదని ఆలయ పర్యవేక్షణ సునీల్ అన్నారు. ఎక్కడో ఆంజనేయ మూలవిరాట్ ను శుభ్రం చేస్తున్న వీడియోను కొండగట్టు ఆంజనేయ స్వామిదిగా భక్తులను తప్పుదోవ పట్టించే వారిని ఉపేక్షించేది లేదని, తప్పుడు కథనాలు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, కన్నుల పండుగ సాగి ఈ కార్యక్రమానికి భక్తులు ప్రజలు అందరూ సహకరించాలని ఆలయ పర్యవేక్షకులు సునీల్ తెలిపారు.

చేయూత పెన్షన్ లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ చేసిన ఎమ్మెల్యే

తిమ్మాపూర్, నవంబర్ 17 (ప్రజాజ్యోతి): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కొత్తపల్లిలోని సాయిరాం గార్డెన్స్‌లో మంగళవారం చేయూత పథకం కింద కొత్తగా ఎంపికైన మండల లబ్ధిదారులకు ఎమ్మెల్యే మంజూరు పత్రాలను పంపిణీ చేశారు.పేద మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేయబోతోందని మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. ఈ నెల



19న సిద్దిపేటలో నిర్వహించే బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించనున్నారని వెల్లడించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే పెన్షన్ నగదు జమ కానుందని, ప్రస్తుతం మంజూరు పత్రాల పంపిణీ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. నిరుపేదలు, నిస్సహాయులకు ఆసరాగా నిలిచేలా కొత్త పెన్షన్ల మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

ఒకవైపు చేయూత కింద కొత్త పెన్షన్ల పంపిణీ ప్రక్రియ కొనసాగుతుండగా, మరోవైపు ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా ప్రయోజనం కల్పించే లక్ష్యంతో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రభుత్వం తీసుకొస్తోందన్నారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తి అనుకోకుండా మరణిస్తే ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా ఈ పథకం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. సాధారణంగా జీవిత బీమా పథకాలు వ్యక్తిగతంగా లేదా నిర్దిష్ట వర్గాలకే పరిమితమవుతాయని, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా మాత్రం రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించాలనే లక్ష్యంతో రూపొందించిందని ఎమ్మెల్యే వివరించారు.

గత బీఆర్ఎస్ పాలకులు పదేళ్ల పాలనలో పేదల సంక్షేమాన్ని విస్మరించారని ఎమ్మెల్యే విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చి పేద, మధ్యతరగతి ప్రజలకు సంక్షేమ ఫలాలు అందకుండా చేశారని ఆరోపించారు. పదేళ్లలో అర్హులకు రేషన్ కార్డులు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అందించలేకపోయారని, ఇంటికో ఉద్యోగం, దళితులకు మూడెకరాల భూమి వంటి హామీలు అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ఈ కారణంగానే ప్రజలు బీఆర్ఎస్‌ను ఓడించి కాంగ్రెస్‌కు అధికారాన్ని అప్పగించారని అన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే రేవంత్ రెడ్డి ప్రజాభీష్టానికి అనుగుణంగా పాలన సాగిస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంతోపాటు, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా వంటి ఎన్నికల హామీల్లో లేని ప్రజోపయోగ కార్యక్రమాలను సైతం ప్రభుత్వం చేపడుతోందని పేర్కొన్నారు. కొత్తపల్లి గ్రామ సర్పంచ్ గోదారి శోభారాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ మండల తహసీల్దార్ కర్ర శ్రీనివాస్ రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, గన్నేరువరం ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్య, నుస్తులాపూర్, పోరండ్ల, ఊటూరు పీఏసీఎస్ చైర్మన్లు మోరపల్లి రమణారెడ్డి, గోపు తిరుపతిరెడ్డి, ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, ప్యాక్స్ వైస్ చైర్మన్ రావుల కృష్ణ, ఆత్మ కమిటీ చైర్మన్ చెన్నబోయిన రవి, పార్టీ నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాస్, తుమ్మనపల్లి సంధ్య, పొన్నాల సంపత్, పెరుక రవీందర్, పార్టీ మామిడి అనిల్ కుమార్, బుధారపు శ్రీనివాస్, సోముల అనిల్ కుమార్, గొట్టెముక్కుల సంపత్ రెడ్డి, రాములు యాదవ్, శ్రీనివాస్, రెడ్డిగాని రాజు,ఎలుక రాజు తోపాటు వివిధ గ్రామాల సర్పంచులు, పార్టీ గ్రామశాఖల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

"బాలమల్లుపల్లిలో బాలామృతం ప్లస్ పై అవగాహన

తంగళ్ళపల్లి నవంబర్ 17 :(ప్రజా జ్యోతి): తంగళ్ళపల్లి మండలం జిల్లెల్ల సెక్టార్ పరిధిలోని బాలమల్లుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం 10 నిమిషాల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ యాద యెల్లయ్య, డిప్యూటీ సర్పంచ్ డి.రాజు, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ వనిత, పంచాయతీ కార్యదర్శి రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ వాసాల రాజిరెడ్డి, గ్రామ పెద్దలు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోప పోషణ ఉన్న పిల్లల తల్లిదండ్రులకు బాలామృతం ప్లస్ యొక్క విలువలను వివరించారు. ప్రతి నెల పిల్లల బరువు తప్పనిసరిగా తూయించాలని సూచించారు. పిల్లల జీవితంలో 6 సంవత్సరాల లోపు వయస్సు చాలా ముఖ్యమైనదని, ఈ సమయంలోనే మెదడు ఎదుగుదల ఎక్కువగా ఉంటుందని, కాబట్టి పిల్లలను చురుకుగా ఉంచాలని, అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఉప సర్పంచ్ సమక్షంలో ఒక ముఖ్యమైన తీర్మానం చేశారు. గ్రామంలో ప్రీ-స్కూల్ పిల్లలు చాలా తక్కువగా ఉన్నారని, 5 సంవత్సరాల లోపు పిల్లలను ప్రైవేట్ స్కూల్‌కు పంపడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని గుర్తించారు. ఇకపై 5 సంవత్సరాల లోపు పిల్లలను అంగన్‌వాడీకే పంపాలని, ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం, ప్రీ-స్కూల్ విద్యను సద్వినియోగం చేసుకోవాలని తీర్మానించారు.



అంకుసాపూర్‌లో బాలామృతం ప్లస్ పై అవగాహన కార్యక్రమం

తంగళ్ళపల్లి, నవంబర్ 17(ప్రజాజ్యోతి): తంగళ్ళపల్లి సెక్టార్ పరిధిలోని అంకుసాపూర్-1 అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం 10 నిమిషాల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిపిఓ వీరభద్రయ్య, ఎంపిడిఓ రమేష్, సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి,



సూపర్వైజర్ సౌజన్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి, లబ్ధిదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా లోప పోషణ ఉన్న పిల్లల తల్లిదండ్రులకు బాలామృతం ప్లస్ యొక్క విలువలను వివరించారు. ప్రతి నెల పిల్లల బరువు తప్పనిసరిగా తూయించాలని సూచించారు. పిల్లల జీవితంలో 6 సంవత్సరాల లోపు వయస్సు చాలా ముఖ్యమైనదని, ఈ సమయంలోనే మెదడు ఎదుగుదల ఎక్కువగా ఉంటుందని, కాబట్టి పిల్లలను చురుకుగా ఉంచాలని, అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్, ఆశా కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

దేవుని గుట్ట తండాలో బాలల దినోత్సవం

ఎల్లారెడ్డిపేట నవంబర్ 17 ప్రజా జ్యోతి: ఎల్లారెడ్డిపేట మండలంలో దేవుని గుట్ట ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం రోజు చిల్డ్రన్స్ డే జరుపుకున్నారు విద్యార్థులు ఉపాధ్యాయులు అయిన వేళ



చిన్నారులను వారి తల్లిదండ్రులు సంతోషాన్ని వ్యక్తం చేశారు ఉపాధ్యాయులు రోజా అంజలి విద్యార్థులు విద్యార్థులు అంగన్వాడి ఇన్స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేటలో చేయూత పెన్షన్ల పంపిణీ

ఎల్లారెడ్డిపేట నవంబర్ 17 ప్రజా జ్యోతి: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో మంగళవారం రోజు మణికంఠ గార్డెన్ లో చేత పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్



నాయకులు ఏఎంసీ చైర్మన్ దేవానందం నంది కిషన్ మండల అధ్యక్షుడు రాజేందర్ మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు దొమ్మాట నరసయ్య సుభాష్ గుండారం కృష్ణారెడ్డి ఇల్లెందుల గీతాంజలి మూడవ సరోజ ఎంపీడీవో సత్తయ్య చారి వివిధ గ్రామాల సర్పంచులు చేయూత పెన్షన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎలనినో పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన

ఇల్లంతకుంట నవంబర్ 17(ప్రజాజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం గాలిపల్లి రైతు వేదికలో మంగళవారం రోజు సర్పంచ్ బద్దం శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో యాసంగిలో ఎల్‌నినో ప్రభావం వల్ల వ్యవసాయంపై కలిగే ప్రభావాలు రైతులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి వివరిస్తూ వరికి బదులుగా తక్కువ నీటి అవసరం ఉన్న ఆరుతడి పంటలు సాగు చేయాలని వివరిస్తూ కేత్ బచావో అభియాన్ ప్రోగ్రాం లో భాగంగ రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రీయ ఎరువులు వేస్తూ నేల ఆరోగ్యం కాపాడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రామకృష్ణ (డి సీ ఓ),మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్, మండల రెవెన్యూ అధికారి సురేష్,ఎమ్ పి డి ఓ శశికళ , ఎమ్ పి ఓ వజీర్‌అహ్మద్, వేటర్నరీ అధికారి ఇందిర, ఏ పి ఎమ్ కుమార స్వామి, ఏఈవో అర్చన, పంచాయతి కార్యదర్శి అనిల్ విద్యుత్ లైన్ మెన్ శ్రీనివాస్,ఉపసర్పంచ్లు, వార్డ్ మెంబర్స్ రైతులు పాల్గొన్నారు.



59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో యోగా కార్యక్రమం



ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ ఖమ్మం ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర గ్రంథాలయంలో యోగా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ ఖాదర్ బాబా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని, యోగా ద్వారా శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెంపొందుతాయని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు,యువత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శ్రీమతి పి. పద్మజ, గ్రేడ్-1 లైబ్రేరియన్ చి.మాల్యూర్, గ్రేడ్-3 లైబ్రేరియన్లు బాబు, వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ పి. సంతోష్,కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి విద్యుత్ డిమాండ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు
విద్యుత్ మౌలిక సదుపాయాల పనులను పగవత్తం చేయాలి

- డీటీఆర్‌లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్య పెంపు,
నూతన సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులను సత్వరమే పూర్తి చేయాలి
- టీజీ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ఐఏఎస్



ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి వేసవిలో ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ వినియోగం పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో, పెరగనున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా పంపిణీ వ్యవస్థను ముందుగానే పటిష్టం చేయాలని టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఖమ్మం సర్కిల్ పర్యటనలో భాగంగా తొలుత మధిర డివిజన్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సమావేశమై వేసవి కార్యాచరణ ప్రణాళికపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వేసవిలో పెరగనున్న విద్యుత్ లోడ్‌ను దృష్టిలో ఉంచుకొని అవసరమైన ప్రాంతాల్లో డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు (డీటీఆర్‌లు), పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల (పీటీఆర్‌లు) సామర్థ్యాన్ని పెంచడంతో పాటు, అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, నూతన సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.అనంతరం మధిర పట్టణంలో చేపడుతున్న అండర్‌గ్రౌండ్ కేబుల్ పనులను పరిశీలించారు. పనుల్లో వేగం పెంచి, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. తదుపరి బోనకల్ మండలం బ్రాహ్మణపల్లిలో నిర్మాణం పూర్తిచేసుకున్న 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు. సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఏర్పాటు చేయాలన్నారు. కొత్త సబ్ స్టేషన్ లు రావడం వలన విద్యుత్ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు దోహదపడుతుందని తెలిపారు.అనంతరం వైరా పట్టణంలో నూతనంగా ప్రతిపాదించిన 33/11 కేవీ శాంతినగర్ సబ్‌స్టేషన్ నిర్మాణ స్థలాన్ని సీఎండీ పరిశీలించారు. సబ్‌స్టేషన్ నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు, స్థల పరిస్థితులను సమీక్షించి, పనులు చేపట్టేందుకు అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. అదే విధంగా వైరా పట్టణంలో నిర్మించనున్న డివిజన్ కార్యాలయం, సబ్ డివిజన్ కార్యాలయం, విద్యుత్ రెవెన్యూ కార్యాలయం (ఈఆర్ఓ) స్థలాలను కూడా పరిశీలించారు.వైరా రోడ్ లో నిర్మించనున్న ఇండోర్ సబ్ స్టేషన్ ను పరిశీలించి, తీసుకోల్సిన చర్యలపై చర్చించి తగిన సూచనలు చేశారు. ఈ పర్యటనలో ఖమ్మం ఆపరేషన్ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాస చారి, డి . ఈ ఖమ్మం టౌన్ రామారావు, డి.ఈ మధిర శ్రీనివాస్ , డి.ఈ వైరా రమేష్ ,ఏడిఈలు (ఆపరేషన్, కస్ట్రక్షన్), వైరా, రూరల్ ఏఈలు, ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

హామీల అమలు ఏమయ్యాయి: రేగ కాంతారావు



గుండాల నవంబర్ 17 ప్రజా జ్యోతి హామీలు ఇచ్చి అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పాతాళానికి పాత్రయాలను బి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షులు పినపాక మాజీ శాసనసభ్యులు రేగ కాంతారావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం కోసం 420 హామీలతో మేనిఫెస్టో విడుదల చేసి ప్రజలు నమ్మించి అధికారంలోకి వచ్చాక అమలు చేయడంలో విఫలమైందన్నారు. హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వంద రోజుల్లో అమలు చేస్తామని మూడేళ్లు పూర్తయిన నేటికీ హామీలు అమలులో శూన్యమని ధ్వజమెత్తారు . మేనిఫెస్టో విడుదల చేసి నేటికీ మూడు సంవత్సరాలు పూర్తి అవుతున్న మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. మూడేళ్లు రేవంత్ రెడ్డికి కెసిఆర్ ని తిట్టడమే సరిపోయిందని ఆయన పేర్కొన్నారు. హామీల అమలు లో పూర్తిగా విఫలమైన ప్రభుత్వం ప్రజలను పక్కదారి పట్టించేందుకు డైవర్షన్ రాజకీయాలు చేస్తుందని ఆరోపించారు. సంక్షేమం లో పూర్తిగా విఫలమైనప్పటికీ అభివృద్ధిలో సైతం పైసా ఖర్చు పెట్టలేదని ఆయన అన్నారు. మేనిఫెస్టో ప్రతులను పార్టీ నాయకులతో కలిసి చింపి చెత్తబుట్టలో పడేవేశారు. ఈ కార్యక్రమంలో బెల్లం భాస్కర్, మోకాళ్ళ వీరస్వామి, గడ్డం వీరన్న, వట్టం రవి, ఇరుకుల్లూరి రాము, గొల్లపల్లి రమేష్, నిట్ట రాములు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని మజ్జూరి యోక్షిత

- వాలీబాల్ క్రీడలో రాష్ట్రస్థాయిలో రెండవ స్థానం కైవసం



భద్రాచలం, నవంబర్ 17 (ప్రజా జ్యోతి) సంగారెడ్డిలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ ఫెడరేషన్ క్రీడలలో అండర్ 14 విభాగం వాలీబాల్ క్రీడలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం గర్ల్స్ హై స్కూల్ కి చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని. మజ్జూరి యోక్షిత ఉత్తమ ప్రతిభను కనబరిచింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి క్రీడలలో చక్కని క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించిన యోక్షిత రాష్ట్రస్థాయి అండర్ 14 వాలీబాల్ క్రీడలకు ఎంపిక అయింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా వాలీబాల్ టీం లో చోటు దక్కించుకుంది నవంబర్ 13 14 15 తేదీలలో సంగారెడ్డి పట్టణంలో జరిగిన స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ లో వాలీబాల్ క్రీడలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ద్వితీయ స్థానం సాధించగా ఈ టీంలో ప్రాతినిధ్యం వహించిన మజ్జూరి యోక్షిత ఉత్తమ ప్రతిభను క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి జట్టు విజయానికి మంచి ప్రదర్శన చేసింది. రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన వాలీబాల్ క్రీడాకారిని మజ్జూరి యోక్షిత అని ప్రధానోపాధ్యాయులు రామా పి ఈ టి సుజాత పలువురు ఉపాధ్యాయులు అభినందించారు యోక్షిత ముమ్ముందు రాష్ట్ర జాతీయ క్రీడా వేదికల మీద తన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి ఉన్నతశ్రేణి క్రీడాకారునిగా ఎదగాలని ఆకాంక్షించి అభినందనలు తెలియజేశారు.

8 వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ • క్రీడల నిర్వహణ పనులు వేగంగా పూర్తి చేయాలి
- సర్దార్ పటేల్ స్టేడియంలో క్రీడల నిర్వహణ పై క్షేత్ర స్థాయిలో పరిశీలించిన కలెక్టర్



ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి 8 వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ అన్నారు.మంగళవారం కలెక్టర్, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ లతో కలిసి సర్దార్ పటేల్ స్టేడియంలో క్రీడల నిర్వహణ ఏర్పాట్లపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి,అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, క్రీడల నిర్వహణ విజయవంతానికి చేపట్టే పనులు నాణ్యతలో రాజీ లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు.రూ. 3.12 కోట్ల వ్యయంతో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.అనుమతులు మంజూరై, ఒప్పందం పూర్తయిన పనుల్లో కొత్తగా నిర్మించిన సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్‌కు కావాల్సిన లైటింగ్ సదుపాయాల ఏర్పాటు చేయాలన్నారు.సింథటిక్ ట్రాక్‌కు అదనపు మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా చైన్ లింక్ మెష్ ఏర్పాటు, ప్రహరీ గోడ నిర్మాణం,ఇంటర్‌లాకింగ్ కాంక్రీట్ బ్లాక్ పేవ్‌మెంట్ల నిర్మాణం,అల్యూమినియం స్తంభాలతో హ్యామర్ త్రో కేజ్ ఏర్పాటు, స్టేడియం గేటు, ఆర్చ్ నిర్మాణం మరుగుదొడ్ల మరమ్మతులు,పెయింటింగ్, టైల్స్ మొదలైన వసతుల కల్పన పనులు చేయాలన్నారు. క్రీడాకారులకు సందర్శకులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రధాన భవనం ప్రవేశ ద్వారం నుండి మెయిన్ గేట్ వరకు బీటీ రోడ్డు నిర్మాణం,ప్రధాన భవనంలోని అథ్లెట్లు,కార్యాలయ గదులకు పెయింటింగ్, తలుపులు, కిటికీల అమరిక, ఎలక్ట్రికల్ మరమ్మతులు, వాకింగ్ ట్రాక్ లెవలింగ్,నేమ్ బోర్డుల ఏర్పాటు,సీటింగ్ గ్యాలరీల వద్ద టెన్సైల్ కోనికల్ స్ట్రక్చర్ షేడ్ ఏర్పాటు, ప్రధాన భవనంలోని అథ్లెట్, ఆఫీస్ టాయిలెట్ల మరమ్మతులు, గీజర్ల ఏర్పాటు,పార్కింగ్ ప్రాంతంలో చిప్స్ వేయడం, స్టేడియం ప్రాంగణంలో వీధి దీపాల ఏర్పాటు,ఓపెన్ వెల్ సబ్‌మెర్సిబుల్ మోటార్ ఏర్పాటు, సంప్ నుండి నీటి ట్యాంకులకు కనెక్షన్ల కల్పన, పీజీ కళాశాల మైదానం శుభ్రపరచడం,చదును చేయడం,నిరుపయోగ వాహనాల తరలింపు, టేబుల్ టెన్నిస్ కోర్టు పక్కన సీసీ డ్రైన్ నిర్మాణం, ప్రధాన భవనం పక్కనున్న 2 గ్యాలరీలకు పెయింటింగ్,ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుకు ఆర్టిస్టిక్ గ్రాఫిక్ పెయింటింగ్, స్విమ్మింగ్ పూల్ గదులు, ఇతర చిన్న తరహా మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఖేలో ఇండియా క్రీడల సమయానికి ముందుగానే పనులన్నీ నాణ్యతతో పూర్తి



చేసి, క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఐఎన్ఓ టి. సునీల్ కుమార్, మునిసిపల్ ఇఇ కృష్ణలాల్,హార్టికల్చర్ అధికారిణి అనితశ్రీ, డిఇ నాగజ్యోతి, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ జయచందర్, అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

వచ్చే మార్చి కల్లా నిర్మాణాలు పూర్తిచేసి అందుబాటులోకి తేవాలి

- ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్
- అంతర్గత రోడ్డు పనులు పూర్తి చేయాలి
- పాఠశాల పనులను వేగవంతం చేయాలి
- నిర్మాణ పనుల్లో ఎక్కడ అలసత్వం ఉండకూడదు
- బోనకల్ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్





బోనకల్, నవంబర్ 17(ప్రజా జ్యోతి): వచ్చే మార్చి కల్లా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణాలు పూర్తిచేసి, అందుబాటులోకి తేవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని లక్ష్మీపురం లో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను క్షేత్ర స్థాయిలో జిల్లా కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణాల్లో అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ నిర్మాణం పూర్తయిందన్నారు. ఆకాడమిక్ 4 బ్లాకుల్లో 3 బ్లాకులు పూర్తయి, ఫినిషింగ్ పనులు జరుగుతున్నట్లు, ఒక బ్లాక్ సెంట్రింగ్ వర్క్ పురోగతిలో ఉందన్నారు. సీనియర్ హాస్టళ్లు 9 లో 5 హాస్టళ్లు పూర్తవగా, ఒకటి మోంట్రింగ్ పురోగతిలో ఉండగా, 3 హాస్టళ్ల నిర్మాణాలు ప్లింత్ లెవెల్ పూర్తయ్యాయని అన్నారు. జూనియర్ 4 హాస్టళ్లకు సంబంధించి స్లాబ్ లు పూర్తయి, ఫినిషింగ్ పనులు పురోగతిలో ఉన్నట్లు తెలిపారు. కిచెన్ కం డైనింగ్ హాల్ సెంట్రింగ్ పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. గ్రౌండ్ లెవెల్ సంప్, ఓహెచ్ఎస్ఆర్ పనులు పురోగతిలో ఉన్నట్లు, టీచింగ్ స్టాఫ్ క్వార్టర్స్ ఎర్త్ వర్క్ పనులు జరుగుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. అంతర్గత రోడ్లు పనులు చేపట్టి పూర్తి చేయాలన్నారు. నిర్మాణ పనుల్లో ఎక్కడ ఆలస్యం అలసత్వం ఉండకూడదని గుత్తేదారులకు, అధికారులకు తెలిపారు. యంగ్ ఇండియా పాఠశాల పనులను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. నిర్మాణ కార్మికుల సంఖ్యను పెంచుకుని, పనులను మరింత వేగవంతం చేసి, మార్చి కల్లా పూర్తి స్థాయిలో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ఇఇ బుగ్గయ్య, డిఇ నాగేశ్వర చారి, ఏఇ నాగేశ్వర రావు, బోనకల్ తహసీల్దార్ చల్లూరి సుధాకర్, గిర్దావర్ - 1 సామినేని నరసింహారావు,తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భద్రత కల్పించడమే లక్ష్యం
- నవంబర్ 19 నుండి నెల రోజుల పాటు ప్రతి గ్రామం, మున్సిపల్ వార్డులో ప్రత్యేక క్యాంపులు
- ప్రతి క్యాంపులో ఐదు కౌంటర్లు, హెల్ప్ డెస్క్, 200 మంది వేచి ఉండేందుకు అవసరమైన ఏర్పాట్లు
- రేషన్ కార్డు లేని కుటుంబాల నమోదు కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు
- ప్రతి రోజు సాయంత్రం 4.30 గంటల వరకు నమోదు వివరాల నివేదిక అందించాలి
- డేటా అందుబాటులో లేదనే కారణంతో ఏ ఒక్క అర్హుడినీ క్యాంపు నుంచి వెనక్కి పంపించరాదు
- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం క్యాంపుల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్



ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు ఖమ్మం జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు.మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. టి. శ్రీజతో కలిసి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా రాష్ట్రంలోని ప్రతి అర్హులైన కుటుంబానికి రూ. 5 లక్షల జీవిత బీమా భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, కుటుంబంలోని సంపాదించే సభ్యునికి జీవిత బీమా రక్షణ కల్పించడం ద్వారా ఆ కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తున్నదని తెలిపారు. నవంబర్ 19 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభం కానున్న ఈ పథకాన్ని జిల్లాలో ప్రతి కుటుంబానికి వర్తింపజేసే లక్ష్యంతో అధికారులు పకడ్బందీ ప్రణాళికతో పనిచేయాలని ఆదేశించారు.నెల రోజుల పాటు ప్రత్యేక క్యాంపుల నిర్వహణ,నవంబర్ 19న పథకాన్ని ప్రారంభించిన అనంతరం నెల రోజుల పాటు జిల్లాలోని ప్రతి గ్రామంలో, మున్సిపాలిటీల పరిధిలోని ప్రతి వార్డులో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని కలెక్టర్ ఆదేశించారు.ప్రతి జనావాసం పరిధిలో క్యాంపు వారం రోజుల పాటు కొనసాగేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. నెల రోజుల వ్యవధిలో ప్రతి బృందం కనీసం నాలుగు క్యాంపులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని ప్రతి జనావాసానికి క్యాంపు అందేలా అవసరమైన సంఖ్యలో బృందాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జనావాసాల వారీగా క్యాంపుల షెడ్యూల్ రూపొందించాలని, క్యాంపుల ఏర్పాటుపై ముందస్తుగా టాంటాం ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ప్రతి గ్రామం, పట్టణ వార్డులో క్యాంపు నిర్వహించే తేదీలు, ప్రదేశాల వివరాలను ప్రజలకు ముందుగానే తెలియజేయాలని తెలిపారు.

క్యాంపుల్లో అవసరమైన సౌకర్యాలు, కౌంటర్లు:

ప్రతి క్యాంపులో తప్పనిసరిగా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు.క్యాంపులకు వచ్చే సుమారు 200 మంది ప్రజలు వేచి ఉండేందుకు సరిపడా సౌకర్యాలు కల్పించాలని, దరఖాస్తుల స్వీకరణకు ప్రతి క్యాంపులో ఐదు కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.రేషన్ కార్డు లేని కుటుంబాల వివరాలు నమోదు చేసేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా దరఖాస్తుల స్వీకరణ, పత్రాల పరిశీలన, ఆధార్ ధృవీకరణ, నామినీ వివరాల నమోదు ప్రక్రియలను సులభతరం చేయాలని సూచించారు.వృద్ధులు, దివ్యాంగులు, బలహీన వర్గాలకు చెందిన వారికి ప్రాధాన్యతనిస్తూ ప్రత్యేక సహాయం అందించాలని పేర్కొన్నారు. ప్రతి క్యాంపులో త్రాగునీరు, కుర్చీలు, విద్యుత్, ఇంటర్నెట్, ప్రింటర్, పవర్ బ్యాకప్ వంటి సదుపాయాలు కల్పించాలని తెలిపారు.కంప్యూటర్లు, సాంకేతిక పరికరాల ఏర్పాటు,ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం క్యాంపుల నిర్వహణకు అవసరమైన కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు, ప్రింటర్లు, ఇతర సాంకేతిక పరికరాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల్లో ఇప్పటికే అందుబాటులో ఉన్న కంప్యూటర్లు, ఇతర పరికరాలను కూడా క్యాంపుల నిర్వహణకు వినియోగించుకోవాలని సూచించారు. క్యాంపుల నిర్వహణకు అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తుందని తెలిపారు. సాంకేతిక పరికరాల కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని,దరఖాస్తుల నమోదు ప్రక్రియలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు.నమోదు పురోగతిపై రోజువారీ నివేదికలు,ప్రతి రోజు క్యాంపుల్లో నమోదైన దరఖాస్తుల వివరాలను సేకరించి సమీక్షించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం 4.30 గంటల వరకు ఆ రోజు నమోదు చేసిన దరఖాస్తుల వివరాలతో కూడిన నివేదికను తప్పనిసరిగా అందించాలని ఆదేశించారు.ప్రతి రోజు పురోగతిని సమీక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు.పథకం అర్హతలు, బీమా వివరాలు,ఈ పథకం క్రింద ఒక్కో కుటుంబానికి రూ. 5 లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పించ నున్నట్లు కలెక్టర్ తెలిపారు. కుటుంబంలోని సంపాదించే సభ్యుని వయస్సు 18 నుంచి 59 సంవత్సరాల మధ్య ఉండాలని వివరించారు.ఆహార భద్రత కార్డు లేని కుటుంబాలు కూడా ఈ పథకంలో కొత్తగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అటువంటి కుటుంబాలు ఖాళీ దరఖాస్తు ఫారం తీసుకుని వివరాలు నింపి, బీమాదారుని ఆధార్ కార్డు ప్రతిని జతచేసి సమర్పించాలని పేర్కొన్నారు.ఎఫ్ ఎస్ సి లేదు' అనే ఆప్షన్‌ను ఎంపిక చేసి, ఆధార్ ఓటీపీ ద్వారా ధృవీకరణ అనంతరం కుటుంబ సభ్యులు,బీమాదారుడు, నామినీ వివరాలు నమోదు చేసి రసీదు పొందవచ్చని వివరించారు.అవసరమైన పత్రాలు, నామినీ వివరాలు నమోదు సమయంలో బీమాదారుని ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. కుటుంబ సభ్యులందరి ఆధార్ సంబర్లు, ఆహార భద్రత కార్డు లేదా రేషన్ కార్డు (ఉంటే), మొబైల్ నంబర్,నామినీకి సంబంధించిన వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు.బీమాదారుడు నామినీ వివరాలను నమోదు చేసే సమయంలో జాగ్రత్త వహించాలని తెలిపారు. ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి.ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణ వార్డుల్లో డప్పు చాటింపు ద్వారా ప్రచారం నిర్వహించాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచులు, వార్డు సభ్యుల సహకారంతో ప్రతి ఇంటికి పథకం వివరాలు చేరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పత్రికలు, టెలివిజన్,సోషల్ మీడియా, పోస్టర్లు, కరపత్రాలు, ఆడియో, వీడియో సందేశాల ద్వారా పథకం లక్ష్యం,అర్హతలు, నమోదు విధానం, అవసరమైన పత్రాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ముఖ్యంగా, డేటా అందుబాటులో లేదనే కారణంతో ఏ ఒక్క అర్హుడినీ క్యాంపు నుంచి వెనక్కి పంపించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆహార భద్రత కార్డు లేని కుటుంబాలకు కూడా కొత్తగా నమోదు చేసుకునే అవకాశం కల్పించాలని, ప్రతి దరఖాస్తుదారునికి అవసరమైన సహాయం అందించాలని తెలిపారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించే లక్ష్యంతో అధికారులు సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేసి పథకం విజయవంతానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం క్యాంపులను పక్కా ప్రణాళికతో నిర్వహించాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో ఇప్పటికే అందుబాటులో ఉన్న కంప్యూటర్లు, ల్యాప్ టాప్‌లు, ట్యాబ్‌లను క్యాంపుల నిర్వహణ కోసం వినియోగించుకోవాలని తెలిపారు.ప్రతి క్యాంపు బృందంలో కంప్యూటర్ ఆపరేటర్,సూపర్‌వైజర్, టెక్నికల్ అసిస్టెంట్ తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పథకం మార్గదర్శకాలు, అర్హతలు, నమోదు విధానం, అవసరమైన పత్రాల వివరాలపై క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి ప్రతి ఒక్కరికీ పూర్తి అవగాహన కల్పించాలని తెలిపారు.ప్రజలకు ఎలాంటి సందేహాలు,ఇబ్బందులు ఎదురైనా వెంటనే పరిష్కరించేలా హెల్ప్ డెస్క్ సిబ్బంది అందుబాటులో ఉండాలని, ప్రతి అర్హులైన కుటుంబం పథకంలో నమోదు చేసుకునేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో సిపిఓ ఏ. శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 19 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు

18 నుంచి 59 ఏళ్ల వారికి రూ.5 లక్షల జీవిత బీమా

నెల రోజుల్లో అర్హుల వివరాల నమోదు పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

వికారాబాద్ ప్రతినిధి, నవంబర్ 17(ప్రజా జ్యోతి):
జిల్లాలో 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన అర్హులైన కుటుంబ యజమానులకు రూ.5 లక్షల జీవిత బీమా సదుపాయం కల్పించేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయనుందని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. ఈ నెల 19వ తేదీ నుంచి పథకం ప్రారంభించి, నెల రోజుల్లోగా అర్హుల



వివరాల నమోదు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పథకం అమలుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని అన్ని కుటుంబాలకు జీవిత బీమా ప్రయోజనం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వయస్సు నిర్ధారణకు ఆధార్ కార్డును ప్రామాణికంగా తీసుకోవాలని సూచించారు. త్వరలో మొబైల్ యాప్ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ప్రజలకు పథకంపై అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో సర్పంచులు, మున్సిపాలిటీల్లో వార్డు సభ్యులతో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ, రేషన్ కార్డు ఆధారంగా కుటుంబాల వివరాలను యాప్‌లో నమోదు చేయాలని, కుటుంబ యజమాని భార్యను నామినీగా పేర్కొనాలని సూచించారు. ఆధార్‌లో పుట్టిన తేదీ లేకుంటే జూలై 1వ తేదీని ప్రామాణికంగా తీసుకోవాలన్నారు. ఆధార్, ఫోన్ నంబర్, నామినీ వివరాలను పరిశీలించి దరఖాస్తు ఫారాన్ని యాప్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ఈ నెల 19 నుంచి ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు, శిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పట్టణ ప్రాంతాల్లో నేరుగా వివరాల నమోదు, గ్రామీణ ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా దరఖాస్తుల ప్రక్రియ చేపట్టాలని సూచించారు. రేషన్ కార్డులు లేని అర్హులైన కుటుంబాలకు కూడా పథకం ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మరో అదనపు కలెక్టర్ వెంకటాచారి మాట్లాడుతూ, అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులోగా పథకాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూర్, డీఆర్‌డీఏ శ్రీనివాస్, డీపీఓ జయసుధ, నీపీఓ వెంకటేశ్వర్లు, ఎల్‌డీఎం మహమూద్, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నగరంలో గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్

మొదటిపేజీ తరువాయి..

ఈ కొత్త కేంద్రాన్ని ప్రారంభించింది. సంస్థ ప్రపంచవ్యాప్త విస్తరణ ప్రణాళికలో ఇది కీలక ముందడుగుగా నిలవనుంది. హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దాదాపు 1.37 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ కార్యాలయంలో 1,200 వర్క్‌స్టేషన్లు ఏర్పాటు చేసే సామర్థ్యం ఉంది. టెక్నాలజీ, ఆపరేషన్స్ విభాగాలు ఒకే చోట పనిచేసేలా దీన్ని రూపొందించారు. తెలంగాణ ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, పరిశ్రమలు, వాణిజ్యం, శాసన వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఈ కేంద్రాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈఐ సీనియర్ నాయకత్వ బృందం సభ్యులు క్రిస్టీ ఎడ్లింగ్-డే (చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్), బ్రాడ్ లాండిస్ (గ్లోబల్ హెడ్ ఆఫ్ ఆపరేషన్స్), దర్పణ్ మెహతా (ఎస్ఈఐ ఇండియా సీనియర్ మేనేజింగ్ డైరెక్టర్) పాల్గొన్నారు. తెలంగాణ ప్రభుత్వ ఐటీ సలహాదారు సాయి కృష్ణ కూడా ఈ కేంద్రాన్ని సందర్శించారు. ఎస్ఈఐ సంస్థ చిన్న సంస్థల నుంచి పెద్ద ఆర్థిక సంస్థల వరకు వివిధ రకాల క్లయింట్లకు సేవలు అందిస్తోంది. అమెరికాలోని టాప్ 20 బ్యాంకుల్లో 9 బ్యాంకులు, ప్రపంచంలోని టాప్ 100 అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థల్లో 48 సంస్థలు ఎస్ఈఐ సేవలను ఉపయోగించుకుంటున్నాయి. ఈ సంస్థ నిర్వహణ, సలహాలు, అడ్మినిస్ట్రేషన్ సేవలు అందిస్తున్న ఆస్తుల విలువ 2 ట్రిలియన్ డాలర్లు. అలాగే సంస్థకు చెందిన వెల్త్ మేనేజ్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా 8.1 ట్రిలియన్ డాలర్ల విలువైన లావాదేవీలను ప్రాసెస్ చేస్తున్నారు. క్యాపిటల్ మార్కెట్లు, ఇన్వెస్ట్‌మెంట్ ఆపరేషన్స్, వెల్త్ మేనేజ్‌మెంట్ రంగాల్లో ఎస్ఈఐకి విస్తృతమైన అనుభవం ఉంది. ముఖ్యంగా ప్రైవేట్ క్రెడిట్, ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్స్ నిర్వహణలోనూ ఈ సంస్థ కీలక సేవలు అందిస్తోంది. మోడల్ పోర్ట్‌ఫోలియో సొల్యూషన్స్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంస్థల అవసరాలకు అనుగుణంగా సేవలు అందిస్తోంది. ఎస్ఈఐ హైదరాబాద్‌లో అడుగుపెట్టడం నగరంలోని ఫైనాన్షియల్ టెక్నాలజీ రంగానికి మరో కీలక ముందడుగు. ప్రస్తుతం హైదరాబాద్‌లో 500కు పైగా గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు ఉన్నాయి. భారత్‌లో కొత్తగా ఏర్పాటవుతున్న బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లలో సగానికి పైగా సంస్థలు హైదరాబాద్‌నే ఎంచుకుంటున్నాయి. ఇప్పటివరకు హైదరాబాద్‌లోని జీసీసీలు ప్రధానంగా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగాలకే పరిమితమయ్యేవి. కానీ ఇప్పుడు ప్రపంచ ఆర్థిక మార్కెట్లకు అవసరమైన టెక్నాలజీని అభివృద్ధి చేసే స్థాయికి నగరం ఎదుగుతోంది. క్యాపిటల్ మార్కెట్లు, సైబర్ సెక్యూరిటీ, వెల్త్ మేనేజ్‌మెంట్, రిస్క్ మేనేజ్‌మెంట్, మార్కెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి కీలక రంగాల్లో హైదరాబాద్‌లో టెక్నాలజీ సామర్థ్యాలు పెరుగుతున్నాయి. టెక్నాలజీ, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇంజినీరింగ్ రంగాల్లో నైపుణ్యం ఉన్న ఉద్యోగులు కూడా నగరంలో పెద్ద సంఖ్యలో అందుబాటులో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎస్ఈఐ కొత్త కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల ప్రపంచ ఆర్థిక మార్కెట్లకు అవసరమైన టెక్నాలజీని అందించే నగరంగా హైదరాబాద్ గుర్తింపు మరింత పెరగనుంది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ప్రపంచ ఆర్థిక మార్కెట్లకు అవసరమైన టెక్నాలజీ నైపుణ్యాలు, ఆర్థిక రంగంలో అనుభవం హైదరాబాద్‌లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. “ముంబై భారతదేశ ఆర్థిక రాజధాని అయితే.. హైదరాబాద్ ప్రపంచ ఆర్థిక మార్కెట్లకు అవసరమైన టెక్నాలజీని అభివృద్ధి చేస్తోంది. క్యాపిటల్ మార్కెట్లు, వెల్త్ మేనేజ్‌మెంట్, రిస్క్ మేనేజ్‌మెంట్, మార్కెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి రంగాల్లో హైదరాబాద్ తన సామర్థ్యాన్ని పెంచుకుంటోంది. ఎస్ఈఐ కూడా ఈ వ్యవస్థలో భాగం కావడంతో ప్రపంచ ఆర్థిక మార్కెట్లకు సేవలు అందించే విషయంలో హైదరాబాద్ సామర్థ్యం మరింత పెరుగుతుంది. ప్రపంచంలోని టాప్ 10 బీఎఫ్ఎస్ఐ సంస్థలన్నింటికీ ఇప్పుడు హైదరాబాద్‌లో ఉనికి ఉంది. హైదరాబాద్‌కు ఎస్ఈఐ సంస్థకు స్వాగతం పలుకుతున్నాను. నగరంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ రంగానికి ఆ సంస్థ మరింత తోడ్పాటు అందిస్తుందని ఆశిస్తున్నాను” అని మంత్రి తెలిపారు.ఎస్ఈఐ హైదరాబాద్ కేంద్రం ద్వారా పలు కీలక విభాగాలకు సేవలు అందించనుంది. సాఫ్ట్‌వేర్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజినీరింగ్, ఎంటర్‌ప్రైజ్ ఏఐ, డేటా సైన్స్, అనలిటిక్స్, ప్రొడక్ట్ డిజైన్, ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ ఆపరేషన్స్ వంటి విభాగాలు ఇందులో ఉంటాయి. ఈ బాధ్యతలతో హైదరాబాద్‌లో పనిచేసే ఉద్యోగులు సంస్థకు చెందిన ప్రధాన టెక్నాలజీ, ఇన్వెస్ట్‌మెంట్ ఆపరేషన్స్‌లో భాగం కానున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎస్ఈఐ వ్యాపార కార్యకలాపాలకు అవసరమైన కీలక సిస్టమ్స్, సేవలకు హైదరాబాద్ టీమ్ మద్దతు అందించనుంది.ఎస్ఈఐ గ్లోబల్ హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ బ్రాడ్ లాండిస్ మాట్లాడుతూ.. గత 25 ఏళ్లకు పైగా భారత్‌లోని నైపుణ్యం ఉన్న ఉద్యోగుల సేవలను సంస్థ ఉపయోగించుకుంటోందని తెలిపారు. వ్యూహాత్మక భాగస్వామ్యాల ద్వారా ఇక్కడి ప్రతిభావంతులతో కలిసి పనిచేస్తున్నామని చెప్పారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి దామోదర్ రాజనర్సింహా

మునిపల్లి, రాయికోడ్ మండలాల్లో 1,213 మందికి నూతన పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ

సంగారెడ్డి నవంబర్ 17 (ప్రజా జ్యోతి):
అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు అందించి పేద కుటుంబాలకు సామాజిక భద్రత కల్పించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా అన్నారు. మంగళవారం అందోల్ నియోజకవర్గంలోని మునిపల్లి మండల కేంద్రంలో ఎస్ఆర్ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన చేయూత నూతన పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మునిపల్లి, రాయికోడ్ మండలాలకు చెందిన లబ్ధిదారులకు పింఛన్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పింఛన్ అంటే కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు తదితర అర్హులైన వర్గాలకు ఆత్మవిశ్వాసం, భరోసా కల్పించే సామాజిక భద్రత అని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా



అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. మునిపల్లి మండలంలో 629 మందికి, రాయికోడ్ మండలంలో 584 మందికి కలిపి మొత్తం 1,213 మందికి నూతనంగా చేయూత పింఛన్లు మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా 18,591 నూతన పింఛన్లు మంజూరైనట్లు వెల్లడించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన చివరి లబ్ధిదారునికి చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు.

60 గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు:
అందోల్ నియోజకవర్గంలోని 60 గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రతి గ్రామానికి మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడంతో పాటు మునిపల్లి,



కంకోల్, సింగీతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 24 గంటల అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వైద్యులు, అంబులెన్సులు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. బుదేరా మహిళా కళాశాలలో అదనపు గదులు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వ నిధులతో పనులు చేపడుతున్నామని, సీఎస్ఆర్ నిధుల ద్వారా కూడా కళాశాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. సింగూరు బ్యాక్‌వాటర్ ప్రాంతంలో రవాణా సౌకర్యాలు మెరుగుపరిచి పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించవచ్చన్నారు.

మహిళా సాధికారతకు ప్రాధాన్యత:
మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక సహకారం అందిస్తూ మహిళలు పెట్రోల్ బంకులు, ఇందిరమ్మ క్యాంటీన్లు తదితర వ్యాపార రంగాల్లో రాణించేలా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే వడ్డీని ప్రభుత్వమే భరిస్తుందని వివరించారు.

19 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవన బీమా దరఖాస్తులు:
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవన బీమా పథకానికి ఈ నెల 19వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ, వివరాల నమోదు ప్రక్రియ ప్రారంభం కానుందని మంత్రి, కలెక్టర్ తెలిపారు. 18 నుంచి 59 ఏళ్ల వయసు కలిగిన అర్హులకు ఈ పథకం వర్తిస్తుందని, ప్రతి కుటుంబంలో ఒకరికి రూ.5 లక్షల వరకు బీమా సౌకర్యం కల్పించనున్నట్లు వివరించారు.
దరఖాస్తుదారులు రేషన్ కార్డు, ఆధార్ కార్డు వివరాలను అందజేయాలని సూచించారు. గ్రామ పంచాయతీలు, ఎంపీడీవో కార్యాలయాలు, మున్సిపల్ వార్డుల పరిధిలో దరఖాస్తుల స్వీకరణతో పాటు ఆన్‌లైన్‌లో వివరాల నమోదు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజలకు సేవ చేయడమే తన రాజకీయ ప్రస్థానంలో ప్రధాన లక్ష్యమని మంత్రి దామోదర్ రాజనర్సింహా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి జగదీశ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సూర్యారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, గ్రామ సర్పంచులు, మహిళా సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, నూతన పింఛన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల నిర్వహణకు సరికొత్త డిజిటల్ అస్త్రం..

స్మార్ట్ స్కూల్ మేనేజ్‌మెంట్ యాప్!

ఒకే వేదికపై విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యానికి అవసరమైన సమస్త సమాచారం

ఆధునిక సాంకేతికతతో పాఠశాలల నిర్వహణలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం..

యాప్ రూపకర్త చెలుమోజు అర్జున్ చారి ప్రతిభకు నిదర్శనం

అబ్దుల్లాపూర్ మెట్టు / నవంబర్ 17(ప్రజాజ్యోతి):

యాజమాన్యానికి ఒకే వేదికపై సమగ్ర సమాచారం!:
సాధారణంగా పాఠశాలల నిర్వహణలో విద్యార్థుల వివరాలు, రోజువారీ హాజరు, ఫీజుల వసూళ్లు, పరీక్షల ఫలితాలు, ఉపాధ్యాయుల వివరాలు, తరగతుల సమయపట్టిక, తల్లిదండ్రులకు సమాచారం చేరవేయడం వంటి అనేక పనులు ఉంటాయి. వీటన్నింటినీ విడివిడిగా నిర్వహించడం వల్ల సమయం వృథా కావడమే కాకుండా కొన్నిసార్లు సమాచార లోపాలు కూడా తలెత్తుతుంటాయి. ఈ సమస్యలకు పరిష్కారంగా స్మార్ట్ స్కూల్ మేనేజ్‌మెంట్ యాప్‌ను రూపొందించారు. విద్యా సంస్థలకు సంబంధించిన కీలక కార్యకలాపాలను ఒకే వేదికపై నిర్వహించుకునేలా దీనిని తీర్చిదిద్దారు. దీంతో పాఠశాల యాజమాన్యం ఎక్కడి నుంచైనా సంస్థకు సంబంధించిన ముఖ్యమైన వివరాలను పర్యవేక్షించుకునే అవకాశం ఉంటుంది.

యాప్‌లో ఆకట్టుకునే ప్రత్యేక సదుపాయాలు:
1. విద్యార్థుల పూర్తి వివరాలు: ప్రతి విద్యార్థి వ్యక్తిగత వివరాలు, విద్యా ప్రగతి, ఇతర రికార్డులను డిజిటల్ రూపంలో భద్రపరచుకోవచ్చు.
2. రోజువారీ హాజరు నమోదు: ఉపాధ్యాయులు విద్యార్థుల హాజరును నమోదు చేయడంతో పాటు విద్యార్థులు తమ హాజరు శాతాన్ని తెలుసుకోవచ్చు.
3. ఫీజుల నిర్వహణ: ఫీజుల చెల్లింపులు, పెండింగ్ బకాయిలు, చెల్లింపుల చరిత్ర, ఫీజు గుర్తుచేసే సమాచారాన్ని నిర్వహించుకోవచ్చు.
4. ఉపాధ్యాయుల నిర్వహణ: ఉపాధ్యాయులకు ప్రత్యేక ఖాతా ద్వారా తరగతులు, విద్యార్థుల హాజరు, సంబంధిత వివరాలను నిర్వహించే సదుపాయం ఉంటుంది.
5. విద్యార్థుల ప్రగతిపై సూచనలు: విద్యార్థుల చదువు, క్రమశిక్షణ, ప్రవర్తన, ప్రతిభకు సంబంధించిన ఉపాధ్యాయుల సూచనలను నమోదు చేయవచ్చు.
6. తక్షణ సమాచార వ్యవస్థ: పాఠశాల ప్రకటనలు, ముఖ్యమైన నోటీసులు, ఫీజు గుర్తుచేసే సమాచారం, హాజరు వివరాలను తెలియజేసే సదుపాయం ఉంటుంది.
7. తరగతుల సమయపట్టిక: విద్యార్థులు తమ తరగతుల సమయాలను, రోజువారీ పాఠ్య ప్రణాళికను సులభంగా తెలుసుకోవచ్చు.
8. పరీక్షల నిర్వహణ: పరీక్షల షెడ్యూల్, పరీక్షలకు సంబంధించిన సమాచారాన్ని ఒకే వేదికపై నిర్వహించుకోవచ్చు.
9. సమగ్ర పర్యవేక్షణ: మొత్తం విద్యార్థుల సంఖ్య, హాజరు శాతం, ఫీజుల వసూళ్లు, పెండింగ్ వివరాలు వంటి కీలక సమాచారాన్ని యాజమాన్యం ఒకే తెరపై పరిశీలించవచ్చు.
10. ప్రత్యేక ప్రవేశ సదుపాయం: విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రత్యేక ఖాతాలు, సురక్షిత ప్రవేశ సదుపాయంతో సమాచారాన్ని నిర్వహించుకునే విధంగా రూపొందించారు.

నేటి ఆధునిక సాంకేతిక యుగంలో విద్యారంగం సైతం డిజిటల్ బాటలో వేగంగా ముందుకు సాగుతోంది. పాఠశాలలు, కళాశాలల నిర్వహణలో ఎదురవుతున్న అనేక సమస్యలకు సాంకేతిక పరిష్కారం చూపుతూ రూపొందించిన వినూత్న అప్లికేషన్‌నే స్మార్ట్ స్కూల్ మేనేజ్‌మెంట్ యాప్ ను రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్టు మండలం ఇంజాపూర్ గ్రామానికి చెందిన యువకుడు చెలుమోజు అర్జున్ చారి రూపొందించిన ఈ ఆధునిక యాప్ విద్యా సంస్థల నిర్వహణను మరింత సులభతరం చేయడంతో పాటు సమయాన్ని ఆదా చేస్తూ, పరిపాలనా వ్యవస్థలో పారదర్శకతను పెంపొందించేందుకు దోహదపడనుంది.


విద్యా సంస్థలకు సమయం ఆదా.. నిర్వహణలో పారదర్శకత!:
ఈ యాప్ అందుబాటులోకి రావడం ద్వారా పాఠశాల యాజమాన్యాలకు రోజువారీ పరిపాలనా పనుల భారం తగ్గే అవకాశం ఉంది. రికార్డుల నిర్వహణలో కాగితాల వినియోగాన్ని తగ్గించడంతో పాటు విద్యార్థుల వివరాలను క్రమబద్ధంగా భద్రపరచుకోవచ్చు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, యాజమాన్యం మధ్య సమాచార మార్పిడి మరింత వేగవంతం అవుతుంది.
ముఖ్యంగా విద్యా సంస్థల అధిపతులు ప్రతి చిన్న విషయానికీ కార్యాలయ సిబ్బందిపై ఆధారపడకుండా, సంస్థకు సంబంధించిన కీలక వివరాలను ఒకే వేదికపై పర్యవేక్షించుకునే వీలు కలుగుతుంది. తద్వారా విద్యా బోధనపై మరింత దృష్టి సారించేందుకు అవకాశం ఏర్పడుతుంది.



అర్జున్ చారి సాంకేతిక ప్రతిభకు నిదర్శనం:
సమాజంలో విద్యారంగం ఎదుర్కొంటున్న నిర్వహణపరమైన సమస్యలను గుర్తించి, వాటికి సాంకేతిక పరిష్కారం చూపాలనే ఆలోచనతో చెలుమోజు అర్జున్ చారి ఈ స్మార్ట్ స్కూల్ మేనేజ్‌మెంట్ యాప్‌ను రూపొందించడం అభినందనీయం. కేవలం ఒక అప్లికేషన్‌ను రూపొందించడమే కాకుండా విద్యా సంస్థల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అనేక కీలక సదుపాయాలను ఒకే వేదికపై అందించాలనే ఆయన ఆలోచన ప్రశంసనీయం.

అర్జున్ చారి సాంకేతిక ప్రతిభకు నిదర్శనం:
విద్యా సంస్థల నిర్వహణలో సమయాన్ని ఆదా చేయడం, పనితీరులు పారదర్శకతను పెంపొందించడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యారంగానికి చేరువ చేయడం. ముఖ్యంగా చిన్న మధ్య స్థాయి పాఠశాలలకు సైతం డిజిటల్ నిర్వహణ అందుబాటులోకి రావాలన్నదే నా ఆకాంక్షాన్ని యాప్ రూపకర్త చెలుమోజు అర్జున్ చారి అన్నారు. విద్యా రంగానికి ఉపయోగపడే మరిన్ని సాంకేతిక సదుపాయాలను భవిష్యత్తులో అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తానన్నారు. పాఠశాలలో కళాశాలలో యాజమాన్యాలు ఈ యాప్ ను పరిశీలించి తమ అభిప్రాయాలు సూచనలు తెలియజేయాలని అన్నారు.మరిన్ని వివరాల కోసం 8309417543 తన ఫోన్ నెంబర్ లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. కొత్త ఆలోచన, సాంకేతిక పరిజ్ఞానం, సమాజానికి ఉపయోగపడాలనే సంకల్పం కలిస్తే ఎలాంటి అద్భుతమైన మార్పులు సాధ్యమవుతాయో ఈ యాప్ ఒక ఉదాహరణగా నిలుస్తోంది.

విద్యా సంస్థల యాజమాన్యాలకు ప్రత్యేక ఆహ్వానం:
ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యా సంస్థలు కేవలం బోధనకే పరిమితం కాకుండా, పరిపాలనా వ్యవస్థను కూడా ఆధునికీకరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ నేపథ్యంలో పాఠశాలలు,



కళాశాలల యాజమాన్యాలు స్మార్ట్ స్కూల్ మేనేజ్‌మెంట్ యాప్‌ను పరిశీలించి, తమ సంస్థ అవసరాలకు అనుగుణంగా వినియోగించుకోవడం ద్వారా డిజిటల్ విద్యా నిర్వహణ దిశగా ముందడుగు వేయవచ్చు. విద్యా నిర్వహణలో సరికొత్త ఆలోచనకు రూపమిచ్చిన చెలుమోజు అర్జున్ చారి మరిన్ని వినూత్న సాంకేతిక ఆవిష్కరణలతో ముందుకు సాగాలని విద్యారంగ ప్రముఖులు ఆకాంక్షిస్తున్నారు.

సోనియా ఆత్మకథలో తెలంగాణ ఊసే లేదు..

మొదటిపేజీ తరువాయి..

ఉన్న గౌరవరాహిత్యమే మాజీ ప్రధాని పీవీ నరసింహారావు గారి అవమానానికి దారితీసిందని ఆయన ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం సోనియా గాంధీ దయతో ఇచ్చిన బహుమతి కాదని, కోట్లాది మంది ప్రజల నిరంతర పోరాటం, కేసీఆర్ నాయకత్వంలో సాగిన చారిత్రక ఉద్యమం ద్వారా సాధించుకున్న హక్కు అని కేటీఆర్ స్పష్టం చేశారు. మరోవైపు ఈ పుస్తకంలోని అంశాల ఆధారంగా సినిమా తీస్తామని కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి ప్రకటించడం గమనార్హం. తెలంగాణ ఉద్యమ ప్రవాహంలో కొట్టుకుపోతామన్న భయంతోనే, రాజకీయ అనివార్యత వల్ల కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఏర్పాటుకు అంగీకరించిందని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ప్రజలపై ఎన్నడూ నిజమైన ప్రేమ లేదని, కేవలం రాజకీయ అవసరాల కోసమే రాష్ట్రం ఇచ్చారని అన్నారు. తెలంగాణ చరిత్రను, అమరుల త్యాగాలను, కేసీఆర్ పోరాటాన్ని తుడిచిపెట్టి ఆ క్రెడిట్‌ను తమ ఖాతాలో వేసుకోవాలని కాంగ్రెస్ ప్రయత్నించడం సిగ్గుచేటని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమ చరిత్రను ఎవరూ చెరిపివేయలేరని ఆయన తేల్చిచెప్పారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పట్ల ఇప్పుడు కొత్తగా ప్రేమ ఒలకబోస్తున్న కాంగ్రెస్ నేతలకు పీవీ కుమార్తె, ఎమ్మెల్సీ వాణీదేవి గట్టి సమాధానం ఇచ్చారని కేటీఆర్ ప్రస్తావించారు. పీవీపై అంత ప్రేమ, గౌరవం ఉంటే ఆయన అంత్యక్రియలను ఢిల్లీలో ఎందుకు నిర్వహించలేదని వాణీదేవి ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ నాయకులపై ఎప్పటికీ గౌరవం ఉండదని కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో నీళ్లు లేక కరువుతో ప్రజలు అల్లాడుతుంటే భారత్ సమ్మిట్‌కు కోట్లు ఖర్చు పెట్టి ప్రచారం చేసుకోవడం అవసరమా? అని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదు పాలకులు తెచ్చిన వికృతి కరువు అని మండిపడ్డారు. కరువులో 9 వేల కోట్లు కొడంగల్‌కు పెట్టడం అవసరమా? రాష్ట్రంలో కొడంగల్ ఒక్కటే ఉందా? అని ప్రశ్నించారు. 250 టీఎంసీల నీళ్లు కృష్ణా నదిలో ఉన్నాయి. ఎందుకు పంపులు ఆన్ చేయడం లేదన్నారు. 70 కిలోమీటర్ల దగ్గర్లో ఉన్న పాలమూరుకు నీళ్లు రావు.. ఆంధ్రాకు ఎందుకు పోతున్నాయని నిలదీశారు. బియ్యం, కూరగాయల ధరలు పెరుగుతుంటే ఇప్పుడు మూసీ సుందరీకరణ పనులు చేపట్టడంలో అర్థం లేదన్నారు. కరువు సహాయక చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కరువు సాయం కేంద్రం ఇచ్చినాక నువ్వెందుకు? అని మండిపడ్డారు. రేవంత్ రెడ్డికి కమీషన్ల మీద యావ తప్ప, రైతుల మీద ప్రేమ లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు పూర్తవుతుంది. రైతుల్లో భారీగా వ్యతిరేకత ఉందని అన్నారు. మీడియాతో చిట్ చాట్‌లో కేటీఆర్ మాట్లాడుతూ.. ఈ శతాబ్దపు అతిపెద్ద మోసం కాంగ్రెస్ మేనిఫెస్టో అని.. నోటికి ఎంత వస్తే అంత అడ్డగోలు హామీలు ఇచ్చింది. ఇది పెద్ద మోసం..చెప్పిన ఒక్కటి కూడా సక్రమంగా చేయలేదని ఫైర్ అయ్యారు. రేవంత్ రెడ్డి పూర్తిగా బాడీగార్డ్‌గా మారారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వ్యవహార శైలి బాగోలేదు. పీసీసీ చీఫ్ కూడా చిన్నపిల్లాడిలా ఉరుకుతున్నాడు. తనకంటే అయిదేళ్లు చిన్న వ్యక్తి అమిత్ షా కాళ్లు రాంచందర్ రావు ఎందుకు మొక్కారు..? ఆత్మగౌరవం కోసం తిరగబడ్డ సమాజం తెలంగాణ. ఆత్మగౌరవం లేకుండా ఇక్కడ నాయకులు చీప్‌గా ప్రవర్తిస్తున్నారు. మూడేళ్ల పరిపాలన వైఫల్యాన్ని కప్పి పుచ్చడానికి కాంగ్రెస్ శతవిధాలా ప్రయత్నం చేస్తో